చోరులున్నారు.. జాగ్రత్త..! 2
తట్టును తరిమేద్దాం 3
వ్యక్తిత్వ వికాసానికి సోపానం.. ప్రార్థన మధ్య పేజీల్లో

ఈనాడు సిద్దిపేట
గురువారం 17 ఆగస్టు 2017 16 పేజీలు

మూలుగుతున్న నిధులకేది చికిత్స..!

నిధులకు నిర్లక్ష్యపు జబ్బు పట్టింది. ఖాతాల్లో మూలుగుతున్న నిధులకు 'ఖర్చు' అనే చికిత్స అందించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రజారోగ్యాన్ని పరిహాసం చేసేలా సిద్దిపేట, మెదక్ జిల్లాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సమస్యలు తిష్ట వేస్తున్నాయి. కనీస సౌకర్యాల కల్పన కోసం నిధుల్ని వినియోగించడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. బ్యాంకుల్లో మూలుగుతున్న డబ్బుల్ని బయటకు తీయడంలో నిర్లిప్తతను చూపుతున్నారు. ఇప్పుడిప్పుడే సర్కారు దవాఖానాలకు రోగుల తాకిడి పెరుగుతున్న తరుణంలో వసతుల కల్పనలో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. మెదక్, సిద్దిపేట జిల్లాల పరిధిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థితిగతులపై పరిశీలన కథనం.

(సిద్దిపేట)

ఆస్పత్రుల్లో సేవలు అధ్వానం
ఖర్చుల వినియోగం.. 'ప్రాథమిక'ం
ఖాతాల్లో మూలుగుతున్న డబ్బులు

న్యూస్‌టుడే ప్రత్యేక పరిశీలన

శివ్వంపేట మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏడాదిగా రూ.20వేలు మాత్రమే ఖర్చు చేశారు. మిగులు నిధులు, ఇటీవల కొత్తగా వచ్చినవి కలిపి సుమారు రూ.2.50లక్షలు అందుబాటులో ఉన్నాయి. పుష్కలంగా నిధులున్నా సమస్యల్ని పరిష్కరించడంలో మాత్రం వెనుకడుగు కనిపిస్తోంది. ఇటీవల ప్రసవాల సంఖ్య పెరుగుతుండటం వల్ల ఇక్కడికి వచ్చే వారు సరైన వసతులు లేక ఆరుబయటనే ఉండాల్సిన పరిస్థితి. చిన్న పాటి షెడ్డు నిర్మిస్తే ఉపయోగకరంగా మారనుంది. రోగుల కోసం తాగునీటి శుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేస్తే మేలు జరగనుంది.



శివ్వంపేట పీహెచ్‌సీ ఆవరణలో పిచ్చిమొక్కలు



చిన్నకోడూరులోని ఆస్పత్రిలో 8నెలల కిందటే తాగునీటి శుద్ధి పరికరం పాడైపోయింది. ఇక్కడికి వచ్చేవారికి దాహార్తిని తీర్చడంలేదు. మరమ్మతులు చేయిస్తే వినియోగంలోకి రానుంది. కానీ ఈ పనిని చేయడంలేదు. ఇక్కడ గతేడాది నిధుల్లో రూ.36 వేలు మిగిలాయి. కొత్తగా వచ్చిన నిధులతో లక్షకుపైగా డబ్బులు అందుబాటులో ఉన్నాయి. ములుగు పీహెచ్‌సీలో భవనాన్ని మరోచోటకు మారుస్తారనే సాకుతో ఇక్కడి అవసరాలకు వచ్చిన నిధుల్ని వాడటంలేదు. ఇదే మండలంలోని సింగన్నగూడ ఆరోగ్య కేంద్రంలోనూ నిధుల వినియోగంలో జాప్యం కనిపిస్తోంది. సకాలంలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాల్ని నిర్వహించడం లేదు.

మిరుదొడ్డి, భూంపల్లి పీహెచ్‌సీల్లోనూ ఇదే పరిస్థితి. రోజులో ఈ రెండు ఆస్పత్రులకు 300కుపైగా వైద్యసేవల కోసం వస్తుంటారు. ఆస్పత్రి ఆవరణంలో పిచ్చిమొక్కలు దర్శనం ఇస్తున్నాయి. ఇతర సమస్యల పరిష్కారం కోసం అధికారులు చొరవ చూపడంలేదు. నిధుల వినియోగానికి సంబంధించి ఆన్‌లైన్ విధానంతో లావాదేవీలపై శిక్షణ ఇస్తామని చెప్పడంతో ఆ మొత్తాన్ని బ్యాంకుల్లోనే ఉంచినట్లు ఇక్కడి సిబ్బంది చెబుతున్నారు. మిరుదొడ్డిలోని పీహెచ్‌సీలో ఆక్సిజన్ వ్యవస్థ అందుబాటులో లేదు. ఇక్కడికి వచ్చేవారికి బోరు నీళ్లే దిక్కవుతున్నాయి. ఆస్పత్రిలో స్నానాలగది అధ్వానంగా కనిపిస్తోంది.



మిరుదొడ్డి ఆస్పత్రిలోని స్నానాలగదిలో ఇతర సామగ్రి

రెండు జిల్లాల పరిధిలో మొత్తం 52 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. సిద్దిపేట జిల్లాలో 33, మెదక్ జిల్లాలో 19 చోట్ల ఇవి ఉన్నాయి. మొత్తం వైద్యశాలల్లో 26చోట్లనే గతేడాది జాతీయ ఆరోగ్యమిషన్ ద్వారా వచ్చిన నిధులను ఆయా పనుల కోసం వినియోగించారు. మిగతా వాటిలో చాలావరకు ఖర్చు చేయకపోవడంతో అక్కడి సిబ్బంది యూసీ(వినియోగ ధ్రువపత్రాలు)లు జిల్లా అధికారులకు సమర్పించలేదు. 2016-17 సంవత్సరానికిగాను ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.05లక్షల చొప్పున రూ.54.60లక్షలు వచ్చాయి. అందులో ఇంకా రూ.27.30 లక్షల వరకు ఖర్చు చేయాల్సి

మిగతా 7లో



రుణాలు చెల్లించాలంటూ అందిన తాఖీదులను చూపిస్తున్న రైతులు

పంట రుణాలు చెల్లించండి.!

అన్నదాతలకు బ్యాంకు తాఖీదులు
ఆందోళనలో కర్షకులు

గజ్వేల్, న్యూస్‌టుడే: రెండేళ్లుగా పేరుకుపోయిన పంట రుణాలు చెల్లించాలని.. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్న హెచ్చరికలతో కూడిన బ్యాంకు తాఖీదులు అందటంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటన బుధవారం గజ్వేల్ మండలం అక్కారం మధిర గ్రామమైన కోనాపూర్‌లో వెలుగుచూసింది. సర్కారు రుణమాఫీ చేసిందన్న సంతోషంతో బ్యాంకుల్లో మళ్లీ కొత్త రుణాలు తీసుకుని వ్యవసాయం చేసుకుంటున్న రైతులకు పాత బాకీ కట్టాలని తాఖీదులు అందటంపై నివ్వెరపోతున్నారు. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ కేంద్రంగా ఉన్న గ్రామీణ వికాస్ బ్యాంకులో ప్రజ్ఞాపూర్, అక్కారం, కోనాపూర్, శ్రీగిరిపల్లి, జగదేవపూర్ మండలం తీగుల్, అంగడి కిష్టాపూర్ గ్రామాలకు చెందిన 562 మంది రైతులు.. మొత్తం రూ.5.60 కోట్ల పంట రుణాలు తీసుకున్నారు. అన్నదాతలకు ఇచ్చిన హామీ మేరకు ప్రభుత్వం రూ.లక్ష లోపు పంట రుణాన్ని నాలుగు విడతలుగా మాఫీ చేసిన విషయం తెల్సిందే. దీనికి సంబంధించిన నగదు ప్రభుత్వం నుంచి బ్యాంకులకు చేరకపోవటంతో ఇది వరకు పంట రుణాలను రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు బ్యాంకు అధికారులు తాఖీదులు జారీ చేశారు. ఒక్క అక్కారం గ్రామంలోనే 200 మంది రైతులకు నోటీసులు అందాయి. కోనాపూర్ గ్రామానికి చెందిన రాజయ్య, రిప్ప సత్యనారాయణ, భిక్షపతి, బాల్‌నర్సయ్య, రిప్ప యాదగిరి, రామచంద్రయ్య, సాయిలు తదితరులు తాఖీదులు అందుకున్నారు. ఈ విషయాన్ని సిద్దిపేట జిల్లా వ్యవసాయశాఖ అధికారి శ్రవణ్ కుమార్ దృష్టికి తీసుకుపోగా.. రైతులు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంకులకు ప్రభుత్వం నగదు మొత్తాన్ని చెల్లిస్తుందన్నారు.

నిబంధనల మేరకు ఇచ్చాం

- నాగార్జునరావు, బ్యాంకు మేనేజర్

పంట రుణాలు రీషెడ్యూల్ చేసుకున్న రైతులకు సంబంధించిన బాకీలు పెరిగిపోవటంతో తాఖీదులు ఇచ్చాం. రుణమాఫీకి సంబంధించిన మొత్తం ప్రభుత్వం నుంచి రాలేదు. ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకుపోయాం. బ్యాంకు నిబంధనల ప్రకారం నోటీసులు ఇచ్చాం.

వైద్యసిబ్బంది నియామక కౌన్సిలింగ్ రద్దు

మళ్లీ తేదీలు ప్రకటిస్తాం: జిల్లా వైద్యాధికారి

సిద్దిపేట, న్యూస్‌టుడే: తాత్కాలిక, పొరుగు సేవల పద్ధతిలో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకానికి నిర్వహించతలపెట్టిన కౌన్సిలింగ్ రద్దయింది. జిల్లా కేంద్రం సిద్దిపేటలో ఈనెల 17, 18వ తేదీల్లో తలపెట్టిన కౌన్సిలింగ్‌ను రద్దు చేసినట్లు జిల్లా వైద్యాధికారి ప్రవీణ్‌చందర్ తెలిపారు. బుధవారం సిద్దిపేటలో ఆయన మాట్లాడుతూ... మళ్లీ కౌన్సిలింగ్ ఎప్పుడు నిర్వహించేది త్వరలో ప్రకటిస్తామన్నారు. అభ్యర్థులు గుర్తించాలని ఆయన సూచించారు. జిల్లాలోని వైద్యారోగ్య శాఖలో తాత్కాలిక, పొరుగు సేవల కింద మొత్తం 155 పోస్టులు మంజూరు కాగా ఈనెల 11వ తేదీన 124 మందితో కూడిన ఎంపిక జాబితాను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో ఉంచిన సంగతి తెలిసిందే. **ఈక్రమంలో 'అన్నీ అనుమానాలే' శీర్షికన ఈనెల 15న 'ఈనాడు'లో ఎంపిక జరిగిన తీరుతెన్నులపై కథనం వెలువడింది.** వివిధ విభాగాల్లో దరఖాస్తు చేయని 11 మంది పేర్లు ఎంపిక జాబితాలో ఉండటం.. నియామక ప్రక్రియలో లోపభూయిష్ట విధానం అనుసరించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో అధికారులు దిద్దుబాట చర్యలు చేపట్టినట్లుగా తాజా పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఇందులో భాగంగానే కౌన్సిలింగ్ రద్దు చేశారన్న భావన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ఎంపిక ప్రక్రియ సజావుగా జరిగేలా చూడడం.. లేదంటే పోస్టుల భర్తీ ప్రకటన రద్దు చేసి మళ్లీ కొత్త ప్రకటన ద్వారా ఎంపిక చేపట్టాలని పలువురు అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.


అన్నీ అనుమానాలే.!

చోరులున్నారు.. జాగ్రత్త..!

మూడు నెలల్లో 20కి పైగా దొంగతనాలు

తాళం వేసిన నివాసాలే అధికం

న్యూస్‌టుడే, సిద్దిపేట టౌన్

దొంగలున్నారు.. జాగ్రత్త..! అనే హెచ్చరికను రద్దీగా ఉండే ప్రాంతాల్లో తరచూ చూస్తాంటాం.. వింటుంటాం. ఈ హెచ్చరికను బయటకు వెళ్లినపుడే కాదు.. ఇంటి వద్ద గుర్తుంచుకోవాలి. దూరప్రాంతాలకు వెళ్లినపుడు మననం చేసుకోవాలి. తద్వారా చోరీల బారి నుంచి తప్పించుకున్న వారమవుతాం. లేదంటే ఇల్లు గుల్లయిందని బాధపడాల్సి వస్తుంది. జిల్లాలో గడిచిన మూడు నెల కాలంలో 20కి పైగా దొంగతనాలు జరిగాయి. ఇందులో అత్యధికంగా తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా జరుగుతుండటం గమనార్హం.



సిద్దిపేటలోని ఓ ఇంట్లో ఇటీవల చోరీ జరుగగా ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

సిద్దిపేట జిల్లాగా ఆవిర్భవించిన తరువాత పోలీసు కమిషనరేట్ ఏర్పాటైంది. విస్తృతంగా నిఘా పెంచారు. చోరీల నివారణలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు పెద్దపీట వేశారు. అయినప్పటికీ చోరీల నియంత్రణ అసాధ్యంగా మారింది. దుండగులు.. తమ నైపుణ్యంతో చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. తాళం వేసిన ఇళ్లే అదునుగా పని కానిచ్చేస్తున్నారు. కమిషనరేట్ పరిధిలో గడిచిన మే, జూన్, జులై నెలల్లో వివిధ ప్రాంతాల్లో చోటు చేసుకున్న చోరీలే ఇందుకు నిదర్శనం. కొన్ని పోలీసు కేసులు నమోదు కాగా.. మరికొన్ని ఠాణాల వరకు వెళ్లడం లేదు. సమస్యలు ఎదురవుతాయనే భావన కొంతమంది బాధితుల్లో ఉండటమే కారణం. మరోవైపు దొంగలు.. సీసీ కెమెరా నిఘా పెరిగిన నేపథ్యంలో ప్రధాన ప్రాంతాలను మినహాయించి కాలనీల వైపు కన్నేశారు.

బీరువాలను ధ్వంసం చేస్తూ..

చోరులు ఇంటి తాళాలు పగులగొడుతూ.. బీరువాలను ధ్వంసం చేసి విలువైన సామగ్రిని ఊడ్చుకెళ్తున్నారు. ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్నవే అత్యధికంగా వెలుగుచూస్తున్నాయి. మరోవైపు రహదారులపై ఒంటరిగా వెళ్తున్న క్రమంలో మహిళ మెడల్లోంచి గొలుసులను లాక్కెళ్తున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇలాంటి ఘటనలు గడిచిన మూడు నెలల్లో దాదాపు ఐదు జరిగాయి. ఆలయంలో చోరీతో పాటు వివిధ రూపాల్లో చోరీలు జరుగుతున్నాయి. మొత్తం 90 రోజుల్లో ఆయా ఘటనల్లో సుమారు 70 తులాలకు పైగా బంగారం, 60 తులాల వెండి, రూ.5 లక్షల వరకు సొమ్ము అపహరణకు గురైంది. వివిధ సందర్భాల్లో చోరీలకు పాల్పడుతున్న 14 మందిని పోలీసులు రిమాండ్ చేశారు.

దూర ప్రాంతాలకు వెళితే..

సెలవులు, వివిధ శుభకార్యాలకు వెళ్లిన క్రమంలో ఏమి కాదులే అనే భావనతో ఇళ్లలోనే బంగారు నగలు, నగదు, విలువైన సామగ్రి దాచి వెళ్తున్నారు. ఇదే చోరులకు వరంగా.. యజమానులకు శాపంగా మారుతోంది. రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా పని కానిచ్చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బంగారం, ఇతర విలువైన సొమ్ము బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం ఉత్తమం. ఒక రోజుకు మించి ఇంటితాళం వేసి ఊళ్లెళ్లాల్సి వస్తే.. పోలీసులకు సమాచారం ఇస్తే తద్వారా నిఘా పెరుగుతుంది. పూర్తి జాగ్రత్తలతో ఇతర ప్రాంతాలకు వెళితే మేలని పోలీసులు అంటున్నారు.

భద్రతపై అవగాహన..

ఇటీవల కాలంలో జిల్లా కేంద్రం సిద్దిపేటలో సీసీ కెమెరాల ఏర్పాటుపై ఠాణాల్లో విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నారు. దుకాణ సముదాయాలు, వాణిజ్య, వ్యాపార సంస్థల వద్ద తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కమిషనరేట్ పోలీసులు వ్యాపారులకు సూచిస్తున్నారు. ఇందుకు కావాల్సిన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉంటామని హామీ ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో విడతల వారీగా సదస్సులు నిర్వహిస్తున్నారు.

డీఎడ్‌లో సీటు రాలేదని విద్యార్థిని ఆత్మహత్య



ఇందు (పాతచిత్రం)

చేగుంట: డీఎడ్‌లో సీటు రాలేదన్న మనస్తాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం రెడ్డిపల్లిలో బుధవారం సాయంత్రం జరిగింది. స్థానిక ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ముప్పిడి రాజు కుమార్తె ఇందు (19) చేగుంటలో తెలంగాణ ఆదర్శ పాఠశాలలో ఇంటర్ ఎంపీసీ పూర్తిచేసి ఉత్తీర్ణత సాధించింది. డీఎడ్‌లో చేరాలనే ఉద్దేశంతో జూన్ 17 ప్రవేశ పరీక్ష రాసింది. గత నెలలో ఫలితాలు రాగా 3,200 ర్యాంకు వచ్చింది. సీటు వస్తుందనే నమ్మకంతో డిగ్రీలో సైతం చేరలేదు. గత నెలలోనే ధ్రువపత్రాల పరిశీలనకు సైతం వెళ్లారు. సీటు అలాట్‌మెంట్ కోసం ఆన్‌లైన్‌లో కళాశాలలను సైతం ఎంచుకోగా.. ఈ నెల 10న సీటు అలాట్‌మెంట్‌లో ఆమెకు ఏ డీఎడ్ కళాశాలలో కన్వీనర్ కోటాలో సీటు దక్కలేదు. అటు డిగ్రీలో చేరకపోవటం, ఇటు డీఎడ్‌లో సీటు రాకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురైంది. ఈ క్రమంలో కుటుంబసభ్యులు గ్రామంలో జరిగిన వివాహ శుభకార్యానికి వెళ్లారు. తనకు తలనొప్పి ఉందని చెప్పి ఇంట్లోనే ఉంది. ఆ తర్వాత కొద్దిసేపటికి శరీరంపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలి తల్లి యాదమ్మ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ వివరించారు.

గ్రామాన్ని హరితమయం చేయాలి

జిల్లా పంచాయతీ అధికారి హనోక్

భుజరంపేట, కౌడిపల్లి: గ్రామంతటా మొక్కలను నాటి హరితమయం చేయాలని మెదక్ జిల్లా పంచాయతీ అధికారి హనోక్ సూచించారు. కౌడిపల్లి మండలం భుజిరంపేట గ్రామంలో హరితహారంలో భాగంగా బుధవారం మండల పరిషత్ అధ్యక్షురాలు పద్మతో కలిసి మొక్కలను నాటారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ.. ఉన్నత్ భారత్ అభియాన్ కింద సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించి శతశాతం మొక్కలను నాటి సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని తెలిపారు. మొక్కలను నాటడం ముఖ్యంకాదని సంరక్షించాలని కోరారు. గ్రామంలోని ప్రధాన రోడ్డుపై వంద వరకు మొక్కలు నాటి నీరు పోసిన అనంతరం ట్రీగార్డులను ఏర్పాటు చేశారు. సర్పంచి కిష్టమ్మ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్, గ్రామ రెవెన్యూ అధికారి సోమరాజు, ఏపీవో అంజిరెడ్డి పాల్గొన్నారు.



మొక్కనాటి ట్రీగార్డు ఏర్పాటు చేస్తున్న డీపీవో

కంకర క్వారీల పరిశీలన

తూప్రాన్: తూప్రాన్ మండలం మనపూర్ శివారులో కంకర క్వారీలను బుధవారం తూప్రాన్ ఆర్డీవో ఓజె మధు పరిశీలించారు. ప్రజలకు ప్రమాదకరంగా మారడంతో పాటు వ్యవసాయ పంటలకు నష్టాన్ని చేకూరుస్తున్న కంకర క్వారీలపై చర్యలు తీసుకోవాలని మనపూర్ గ్రామస్థులు గతంలో మానవహక్కుల సంఘంలో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కంకర క్వారీల నిర్వహణ తీరు, పంటలకు కలుగుతున్న నష్టాలను తెలుసుకునేందుకు ఆర్డీవో.. తూప్రాన్ తహసీల్దార్ గంగాధర్‌తో కలిసి క్వారీలను సందర్శించారు. మానవహక్కుల సంఘం ఆదేశాల మేరకు మనపూర్ శివారులో ఉన్న కంకర క్వారీలపై నివేదిక రూపొందించి సమర్పిస్తామని తహసీల్దారు తెలిపారు.



క్వారీలను పరిశీలిస్తున్న ఆర్డీవో మధు

సృజనాత్మకతను వెలికితీసేందుకు సైన్స్ కాంగ్రెస్



సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో సరోజినీదేవి

మెదక్ కలెక్టరేట్: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు అక్టోబరులో 25వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్‌ను నిర్వహించనున్నట్లు మెదక్ జిల్లా విద్యాధికారి సరోజినీదేవి తెలిపారు. బుధవారం స్థానిక గీతా ఉన్నత పాఠశాలలో మెదక్, హవేలిఘనపూర్, రామాయంపేట, నిజాంపేట, పాపన్నపేట, రేగోడ్, అల్లాదుర్గం, టేక్మాల్, పెద్దశంకరంపేట మండలాలకు చెందిన సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. ఎక్కువ సంఖ్యలో ప్రాజెక్టులు జిల్లాస్థాయిలో నమోదు కావాలని ఆమె సూచించారు. ప్రాజెక్టుల నిర్వహణ విధానం, నిర్వహించాల్సిన అంశాలను జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఆర్పీలు ప్రభు, రాజ్‌కుమార్, ఎంఈవో నీలకంఠం, గీతా పాఠశాల ప్రిన్సిపల్ రవికుమార్, వైస్‌ప్రిన్సిపల్ సునీత తదితరులు పాల్గొన్నారు.

అఖండ భారత్ సాధించాలి

మెదక్ కలెక్టరేట్: అఖండ భారత్ సంకల్ప్ దివసను పురస్కరించుకొని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి మెదక్‌లో కాగడాల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కోదండ రామాలయం నుంచి ప్రారంభమైన ప్రదర్శన రాందాస్ చౌరస్తా వరకు కొనసాగింది. ఈ సందర్భంగా వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షులు వనపర్తి వెంకటేశం మాట్లాడుతూ.. భారత్ సమున్నతమైన దేశమని, దేశంపై ఎన్ని దండయాత్రలు జరిగినా దృఢంగా అభివృద్ధి సాధిస్తూ ముందంజలో ఉందన్నారు. భూభాగాలు ముక్కలు కాకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టంచేశారు. అఖండభారత్ సాధించాలని, దేశరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. వీహెచ్‌పీ జిల్లా గోరక్ష ప్రముఖ్ మహేశ్వర్‌శర్మ, కోశాధికారి రాంచంద్రం, పట్టణ అధ్యక్షుడు సత్యనారాయణ, బాధ్యులు మల్లేశం, జితేందర్, రాంసింగ్, సమరసత జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవి, మహేంద్రనాథ్, భాజపా జిల్లా అధ్యక్షులు చోళ రాంచరణ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



కాగడాల ప్రదర్శనలో వీహెచ్‌పీ, భాజపా నాయకులు

వర్గీకరణకు సమష్టి కృషి చేయాలి

తూప్రాన్: ఎస్సీ వర్గీకరణ సాధన కోసం దళితులందరు ఏకం కావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎన్ రమేష్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన తూప్రాన్‌లో మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించడంలో తెలుగురాష్ట్రాల ముఖ్యమంత్రులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. గ్రామస్థాయిలో ఎమ్మార్పీఎస్‌ను బలోపేతం చేసి రెండు రాష్ట్ర ప్రభుత్వాలతోపాటు కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా అక్టోబర్ 14వ తేదీన మరోమారు 'చలోఅమరావతి' కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. ఇప్పటికైనా రెండు రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఎస్సీ వర్గీకరణకు ఆమోదం లభించేలా చొరవ తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మాసాయిపేట యాదగిరి, గజ్జల భిక్షపతి, రాములు, జిల్లా బాధ్యులు నాగార్జున, నాగులు, పట్టణ అధ్యక్షుడు రమేష్, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

చెరువు శిఖంలో పైప్‌లైన్

వెల్దుర్తి: ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించాలనే ఆశయంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథ పథకం పైప్‌లైన్ సురక్షితం కాని చెరువు శిఖంలో వేయడం గమనార్హం. వెల్దుర్తి కుడి చెరువు శిఖంలో ఇలా కనిపిస్తుంది. తూప్రాన్ మార్గంలో వెల్దుర్తి పరిధి శేరిల గ్రామానికి మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ వేయాల్సి ఉంది. అయితే సంబంధిత అధికారులు, గుత్తేదారు నిర్లక్ష్యంగా చెరువు కట్టను తవ్వి శిఖంలో నుంచి పైప్‌లైన్ వేశారు. ఇలా వేయడం వల్ల పైప్‌లైన్‌కు మరమ్మతులు అవసరమైనప్పుడు నిండుగా ఉండే చెరువు శిఖంలో మరమ్మతులు చేయడం కష్టమే. దీనికితోడు ఏమైనా లీకులు ఏర్పడితే శుద్ధినీరు కలుషితం అయ్యే అవకాశం లేకపోలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత నిర్లక్ష్యంగా పనులు చేపట్టడంపై ఆందోళన చెందుతున్నారు. ఈ విషయమై 'న్యూస్‌టుడే' గ్రామీణ తాగునీటి సరఫరా ఏఈ అరవింద్ దృష్టికి తీసుకెళ్లగా మిషన్ భగీరథ ప్రధాన పైప్‌లైన్ ఏర్పాటు పనులు తమ పరిధిలోకి రావని, వాటర్‌గ్రిడ్ పరిధిలోకి వస్తాయని చెప్పారు. ఈ విషయాన్ని గ్రిడ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లానని చెప్పారు.



వెల్దుర్తి కుడి చెరువు శిఖంలో వేసిన పైప్‌లైన్



తట్టును తరిమేద్దాం

■ ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణ
■ నేటి నుంచి కార్యక్రమం



పంపిణీకి సిద్ధంగా నీడిల్స్

‘తట్టు, రుబెల్లా టీకా వేయిద్దాం.. కలిసికట్టుగా రెండు వ్యాధులను తరిమేద్దాం...!’ నినాదంతో ప్రత్యేక టీకాల కార్యక్రమం జిల్లాలో గురువారం ప్రారంభం కానుంది. ఇందుకోసం వైద్యారోగ్య శాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. తట్టు, రుబెల్లా వ్యాధి నివారణకే ఒకే టీకాను ప్రవేశపెట్టడం ఇదే మొదటిసారి. దీంతో ఈ అంశానికి ప్రాధాన్యత ఏర్పడింది. ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 25వ తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగనుంది.

న్యూస్‌టుడే, సిద్దిపేట, చేర్యాల

సిద్దిపేట జిల్లాలో 9 నెలల నుంచి 15 ఏళ్ల వయసు వరకు ఉన్న పిల్లలు 2,43,246 మంది ఉంటారు. వీరందరికీ ఈ టీకా వేసే దిశగా వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో టీకా ఇవ్వనున్నారు. ఇందుకోసం ఇప్పటికే వైద్య సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. 1.50 లక్షల డోసుల టీకా జిల్లాలో సిద్ధంగా ఉంది. ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించడానికి నలుగురు ప్రత్యేకాధికారులను నియమించారు. ముగ్గురు ఉప వైద్యాధికారులతో పాటు 33 పీహెచ్‌సీల వైద్యాధికారులు, 80 మంది సూపర్‌వైజర్లు పర్యవేక్షించనున్నారు. 385 మంది ఏఎన్‌ఎంలు ఈ క్రతువులో భాగస్వాములు కానున్నారు. టీకా వేయించుకునే పిల్లల పేర్లు నమోదు చేయడంతో పాటు వారి ఎడమచేతి వేలిపై ముద్ర వేస్తారు. నిర్ధేశిత వ్యవధి ముగిశాక.. మిగిలిపోయిన వారెంతమందో గుర్తిస్తారు. తర్వాత వారం రోజుల పాటు స్వీపప్ కార్యక్రమం చేపట్టి వారందరికీ టీకా వేయిస్తారు.



తట్టు నివారణకు వైద్యఆరోగ్యశాఖ ప్రచార బ్యానరు

రుబెల్లా వ్యాధి

- గర్భంతో ఉన్న మహిళలకు రుబెల్లా సోకితే పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది.
- దీని మూలంగా పుట్టబోయే బిడ్డకు కంటి, వినికిడి, మెదడు, గుండె సంబంధిత లోపాలు కలుగుతాయి.
- కొన్ని సందర్భాలలో గర్భస్రావం, మృతశిశువు జననం సంభవిస్తాయి.

గతంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా తట్టుకు టీకా ఇచ్చేవారు. రుబెల్లాకు ఇవ్వలేదు. దీన్ని గుర్తించిన ప్రపంచ ఆరోగ్య సంస్థ పిల్లలకు కచ్చితంగా ఇవ్వాలని నొక్కి చెప్పింది. ఈ నేపథ్యంలో ఈ రెండు కీలక వ్యాధులను నివారించడానికి వీలుగా ఒకే టీకా రూపొందించారు. రుబెల్లా టీకా ఈ దశలోనే ఇస్తే పిల్లలు పెద్దయ్యాక, ఆ తర్వాతి తరం ఆరోగ్యవంతంగా జీవించే అవకాశం ఉంటుందనే ముందస్తుగా ఈ కార్యక్రమం చేపట్టారు. లయన్స్ క్లబ్ కూడా ప్రచారంలో పాల్గొంటోంది.

తట్టు.. ప్రమాదకరం

తట్టు ప్రాణాంతక వ్యాధి. దీనివల్ల చిన్నారులు న్యూమోనియా, విరేచనాలు, మెదడువాపు వ్యాధులకు గురవుతారు. ఒక్కోసారి మరణాలు సంభవించవచ్చు.
- దగ్గడం, తుమ్మడం ద్వారా ఒకరి నుంచి ఒకరికి సోకుతుంది.
- తీవ్రమైన జ్వరం, చర్మం మీద ఎర్రని దద్దుర్లు, దగ్గు, జలుబు, కళ్లు ఎర్రబడడం దీని సాధారణ లక్షణాలు.
- దేశంలో 2020 కల్లా తట్టు వ్యాధిని సంపూర్ణంగా నిర్మూలించాలనేది ప్రభుత్వ లక్ష్యం.

టీకా కార్యక్రమం ఇలా..

వ్యవధి: ఆగస్టు 17- సెప్టెంబర్ 25
పిల్లల సంఖ్య 2,43,246
సిద్దంగా ఉన్న డోసులు 1.50 లక్షలు
ప్రత్యేకాధికారులు 04
సూపర్‌వైజర్లు 80

తప్పక వేయించండి : ప్రవీణ్‌చందర్, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి



9 నెలల నుంచి 15 ఏళ్లున్న పిల్లలకు టీకా తప్పక వేయించండి. ఇప్పటి వరకు తీసుకున్న తట్టు టీకా డోసులకు అదనంగా దీన్ని వేయించాలి. ఇప్పుడు 9 నెలలున్న చిన్నారులకు ఈ టీకా వేయించడంతో పాటు 16, 24 నెలల వయసులోనూ వేయించాలి. పిల్లలకు చక్కటి ఆరోగ్యాన్ని ప్రసాదించాలనే లక్ష్యంతో చేపట్టిన ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. పాఠశాలల ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు సహకరించాలి.

తపాలా ఉద్యోగుల నిరవధిక సమ్మె

సిద్దిపేట టౌన్: వివిధ డిమాండ్ల సాధనలో భాగంగా తపాలా ఉద్యోగులు సమ్మెబాట పట్టారు. సిద్దిపేట పట్టణంలోని తపాలా కార్యాలయం ఎదుట ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం నిరవధిక సమ్మె ప్రారంభించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఆంజనేయులు, కార్యదర్శి శంకర్ మాట్లాడారు. సంఘం సూచించిన సవరణలతో పాటు జీడీఎస్ కమిటీ నివేదిక అమలుచేయాలన్నారు. జీడీఎస్‌లకు పని కల్పించి సివిల్ సర్వెంట్ హోదా కల్పించాలన్నారు. పింఛను మంజూరు చేయాలని, వేధింపులు నిలిపివేయాలని కోరారు. సంఘ ప్రతినిధులు రాంచంద్రం, వెంకటేశ్, పరశురాములు, మనోహర్, ఎల్లయ్య, చందర్‌రావు, నాంపల్లి, తిరుపతిరెడ్డి, మీనా, శ్రీలత తదితరులున్నారు.



సిద్దిపేటలో ఉద్యోగుల నిరసన

సీపీఎస్ రద్దు చేసే వరకు పోరాటం

సిద్దిపేట టౌన్: విద్యారంగ సమస్యల పరిష్కారానికి, ఉపాధ్యాయుల హక్కుల సాధనలో ఎస్టీయూ(స్టేట్ టీచర్స్ యూనియన్) ముందుంటుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు జైన సత్యం అన్నారు. సిద్దిపేటలో బుధవారం జిల్లా కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్య, ఉపాధ్యాయ రంగ సమస్యల పరిష్కారంలో ప్రత్యేక పాత్ర పోషిస్తామన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసే వరకు పోరాటం కొనసాగిస్తామన్నారు. పాత పింఛను విధానాన్ని అమలుచేయాలనే డిమాండ్‌తో ఈనెల 28న నిరసన, సెప్టెంబరు 1న సామూహిక సెలవులతో ధర్నా చేపట్టాలని కోరారు. వేతన సవరణ సంఘాన్ని వెంటనే నియమించి అమలు చేయాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి రంగారావు, ప్రతినిధులు మనోహర్, శ్రీనివాస్, మధుసూదన్, భూపాల్, రవీందర్‌రెడ్డి, రాజేశం తదితరులున్నారు.

బీడీ కార్మికుల పిల్లలకు ఉపకారవేతనాలు

సిద్దిపేట అర్బన్: బీడీ కార్మికులు తమ పిల్లల ఉపకార వేతనాల కోసం అంతర్జాలంలో దరఖాస్తు చేసుకోవాలని సిద్దిపేట బీడీ కార్మికుల ఆసుపత్రి అధికారి విజయ్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని గుర్తింపు కలిగిన పాఠశాలల్లో ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులు సెప్టెంబరు 30వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యార్థులు అక్టోబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 94405 04895.

పరిశ్రమిస్తేనే... కష్టం తెలిసేది!

ఈనాడు, సంగారెడ్డి

పొలంలో శ్రమించే అన్నదాతలకు అండగా నిలవాలంటే ముందుగా వారి కష్టనష్టాలు ఏంటో తెలుసుకోవాలి. అందివచ్చిన సాంకేతికతను సద్వినియోగం చేసుకొని రైతులకు మేలు జరిగేలా చూడాలి. ఇవే విషయాలను నేర్పేందుకు మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం తునికిలో ఉన్న డాక్టర్ డి.రామానాయుడు విజ్ఞానజ్యోతి గ్రామీణాభివృద్ధి విద్యాసంస్థలో విద్యార్థులను బృందాలుగా విభజించి పంటలు సాగు చేసే బాధ్యతలను అప్పగిస్తున్నారు. వారే అన్ని పనులూ చేస్తూ సాగులో ఉండే కష్టనష్టాలను తెలుసుకుంటున్నారు. నాట్లు వేసే దగ్గర నుంచి కోతలు కోసే వరకు ఇలా పొలంలో చెమటలు చిందిస్తున్నారు. మరికొందరు కూరగాయల తోటల్లో కలుపుతీసే పనిలో నిమగ్నమవుతున్నారు. సాగు మొదలుపెట్టినప్పటి నుంచి పంట చేతికొచ్చే వరకు విద్యార్థులే చూసుకుంటారని కళాశాల నిర్వాహకులు వివరిస్తున్నారు. పంటల ఉత్పత్తులు అమ్మగా వచ్చిన లాభంలోనూ వారికి వాటా ఇస్తామంటున్నారు. పేద విద్యార్థులకు వ్యవసాయంలో మెలకువలను పెంచేలా ఆరునెలలపాటు ఉచిత కోర్సునూ అందిస్తున్నారు. పాఠాలతో పాటు అందులో ఉన్న సారాన్ని అనుభవపూర్వకంగా నేర్పిస్తుండటంతో ఇక్కడ చదివిన 88 మంది విద్యార్థులు ఇటీవల వ్యవసాయ విస్తరణాధికారులుగా కొలువులు దక్కించుకోవడం విశేషం.



కూరగాయల తోటలో కలుపు తీస్తున్న విద్యార్థులు

సిద్దిపేట

ఘనంగా ప్రతిష్ఠోత్సవాలు

సిద్దిపేట టౌన్: పవనసుత పంచముఖి ఆంజనేయస్వామి ఆలయంలో ఈనెల 13వ తేదీన ప్రారంభమైన ప్రతిష్ఠా ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో బుధవారం సుదర్శన హవనం, పూర్ణాహుతి, ధ్వజ కుంభారాధన, లక్ష్మీహవనం, హోమం నిర్వహించారు. గురువారం శివ పంచాయతన నవగ్రహ సహిత పంచముఖి ఆంజనేయస్వామి విగ్రహాల ప్రతిష్ఠా మహోత్సవం జరగనుంది. మహా పూర్ణాహుతి, యంత్ర ప్రతిష్ఠ, అష్టబంధనం, ప్రథమ ఆరాధన జరగనున్నాయి.



సిద్దిపేట మండలం పెద్దలింగా రెడిపల్లిలో గత ఏడాది అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం నిమిత్తం రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు చేతుల మీదుగా శంకుస్థాపన చేసిన శిలాఫలకం ఇది ఇప్పటివరకు పనులు ప్రారంభించక పోవడంతో వెలవెలబోతోంది.

సిద్దిపేట మండలం తోర్నాలలో నాలుగేళ్ల కిందట ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ హయాంలో అంగన్‌వాడీ కేంద్రం భవనానికి రూ.6 లక్షలు మంజూరు చేసింది. ప్రస్తుత మంత్రి, అప్పటి శాసనసభ్యుడు తన్నీరు హరీశ్‌రావు భవనం పనులకు శిలా ఫలకం ఆవిష్కరించారు. అనంతరం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా ఏమీ చేయలేక అదికాస్తా పొదల చాటున చిక్కుకుపోయింది. పనులు ప్రారంభించినా అసంపూర్తిగా మిగిలి పోయాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రం పురాతన భవనంలో కొనసాగుతోంది.



నాలుగేళ్లు గడచినా ముందుకు సాగవా..!

అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు ● పట్టని పంచాయతీరాజ్ అధికారులు

న్యూస్‌టుడే, సిద్దిపేట రూరల్

ఐదేళ్లు లోపు చిన్నారులతో పాటు గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారాన్ని అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ కేంద్రాలు సమస్యలతో కునారిల్లుతున్నాయి. సొంత భవనాలు లేమి ప్రధాన సమస్యగా వేధిస్తోంది. ఏళ్ల కిందట సొంత భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారుల నిర్లక్ష్యానికి.. శంకుస్థాపన చేసిన శిలాఫలకాలు పొదల్లో దాగి ఉంటున్నాయి. ఫలితంగా అద్దె ఇళ్లలో చిన్నారుల ఇక్కట్లు అనివార్యంగా మారుతున్నాయి. సిద్దిపేట మండలంలోని చాలా గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు నేటికీ సొంత భవనాలు లేవు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' కథనం.

వివిధ శాఖలు, ఉపాధి హామీ నిధులతో ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. ఫలితంగా చిన్నారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకంలో ఏళ్ల కిత్రం ఒక్కో భవనానికి రూ.3 నుంచి రూ.6 లక్షల వరకు నిధులు మంజూరు చేసినా ముందుకు సాగడం లేదు. భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసిన తర్వాత వాటి గురించి ఏ ఒక్క అధికారి పట్టించుకోలేదు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామాల్లో పనులే ప్రారంభించలేదంటే సంబంధిత పంచాయతీ రాజ్ శాఖ అధికారులు నిర్లక్ష్య ధోరణిని అర్థం చేసుకోవచ్చు. నిధులు మంజూరైనా భవనాలు పూర్తి చేయక పోవడంతో ఎలాంటి సౌకర్యాలు లేని అద్దె ఇళ్లలో కేంద్రాలను కొనసాగిస్తున్నారు.

వచ్చే సగం మంది ప్రైవేటు బాట

ఐదేళ్లు నిండిన పిల్లలనే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చేర్చుకోవాలనే నిబంధనలు ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో తల్లిదండ్రులు ఐదేళ్లలోపు ఉన్న తమ పిల్లలను ఆయా గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించకుండా ప్రైవేటు పాఠశాలకు పంపుతున్నారు. ప్రైవేటు పాఠశాలలు నిబంధనలను బేఖాతరు చేస్తుండటంతో అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలను సైతం చేర్చుకుంటున్నారు. దీంతో కొన్ని అంగన్‌వాడీ కేంద్రాలు పిల్లలు లేక వెలవెలబోతున్నాయి. ఇందుకు ప్రధాన కారణం పక్కా భవనాలు లేకపోవడమే అని తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో వాటికి సొంత భవనాలు నిర్మించి తగిన వసతులు కల్పిస్తేనే పెద్దసంఖ్యలో పిల్లలు వచ్చే అవకాశం ఉందని పలువురు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిలిచిపోయిన భవనాల పనులు సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



తోర్నాలలో పురాతన భవనంలో ఇలా...

భవనాల పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం

- వెంకటాచారి,
ఏఈ, పంచాయతీరాజ్, సిద్దిపేట

మండలంలో కొన్నిచోట్ల అంగన్‌వాడీ కేంద్రాల భవనాల పనులు ప్రారంభం కాని విషయం నిజమే. సంబంధిత గుత్తేదారులు పనులు పూర్తి చేసేందుకు చొరవ చూపక పోవడం, కొన్ని చోట్ల స్థలాల సమస్యలతో నిలిచిపోయాయి. ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహించి సత్వరం పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

ప్రతిభావంతులకు ప్రోత్సాహకం



పారితోషికం అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

తడ్కపల్లి (సిద్దిపేట అర్బన్): విద్యార్థులు చక్కగా చదివి పాఠశాలకు మరింత పేరు తేవాలని తడ్కపల్లి ప్రధానోపాధ్యాయుడు గన్నె రాజిరెడ్డి తెలిపారు. 2016-17 విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో పదో తరగతిలో 9.7, 9.8 జీపీఏ సాధించిన 8 మంది విద్యార్థులకు రూ.వెయ్యి చొప్పున అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉత్తమ ఫలితాలు సాధించడం వల్ల మిగిలిన విద్యార్థులు కూడా ఇటువైపు ఆకర్షితులవుతారన్నారు. 2015-16లోనూ ఉత్తమ ఫలితాలు సాధించిన 13 మందికి రూ.వెయ్యి చొప్పున ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచి బాల్‌నర్సయ్య, ఉపసర్పంచి రమేశ్, ఎంపీటీసీ కవిత, విద్యాకమిటీ ఛైర్మన్ బండోజు యాదగిరి, ఉప ఛైర్మన్ యాదవ్వ, నాయకులు కిష్టారెడ్డి, ఆగంరెడ్డి, ఉపాధ్యాయులు పద్మ, మల్లేశం, ప్రభాకర్‌రెడ్డి, నాగరాణి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

సమాజసేవను అదృష్టంగా భావించాలి



పాఠశాలలో విద్యార్థులకు సంచులను అందజేస్తూ..

గోపులాపూర్ (చిన్నకోడూరు): ప్రతి వ్యక్తి సమాజ సేవ చేయడాన్ని అదృష్టంగా భావించాలని గోపులాపూర్ సర్పంచి నిరుగొండ శ్రీనివాస్ అన్నారు. బుధవారం గోపులాపూర్ మదిర ఎదుల్లవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రాతపుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, సంచులు అందించారు. గ్రామానికి చెందిన పర్సా సురేష్ వీటిని సమకూర్చారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు చేయూత ఇవ్వడం అభినందనీయమన్నారు. అనంతరం ఇదే గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బేటీ పడావో - బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా చిన్నారులతో రాఖీ కట్టించే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు బాలకృష్ణ, ఎస్ఎంసీ ఛైర్మన్ యాదయ్య పాల్గొన్నారు.

చెత్తబుట్టల పంపిణీ

సిద్దిపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని 34వ వార్డులో ప్రజలకు తెరాస నేత జడేజా చెత్త బుట్టలు బుధవారం పంపిణీ చేశారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా బల్దియా వాహనానికి అందజేయాలని సూచించారు. మహిళా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలి



రామునిపట్లలో మందులను అందజేస్తూ..

రామునిపట్ల (చిన్నకోడూరు): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రామునిపట్ల సర్పంచి వర్కోలు లావణ్య అన్నారు. ఈ గ్రామంలో బాల వికాస స్వచ్ఛందసంస్థ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యుడు పవన్ కుమార్ మాట్లాడుతూ.. ఆరోగ్యంగా ఉండేందుకు ప్రతిఒక్కరు వైద్యుల సలహాలు తీసుకోవాలన్నారు. రక్తపోటు, చక్కెర వ్యాధులు దరి చేరకుండా ముందు నుంచే జాగ్రత్తలు వహించాలని సూచించారు. శిబిరానికి హాజరైన 170 మందికి సాధారణ పరీక్షలు నిర్వహించి మందులు అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు భాగ్యలక్ష్మి, తెరాస నేతలు రాజలింగం, చంద్రం, బాల వికాస డీఏలు శంకర్, రాజు, రాజేందర్ పాల్గొన్నారు.

అవగాహనతోనే వ్యాధుల నివారణ



ప్రచార బెలూన్‌ను ఎగరవేస్తున్న జడ్పీటీసీ సభ్యుడు శరత్‌రావు

బెజ్జంకి, న్యూస్‌టుడే: చిన్నారులకు ప్రాణాంతకమైన తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు ప్రతిఒక్కరు అవగాహనతో నడుచుకోవాలని బెజ్జంకి జడ్పీటీసీ సభ్యుడు శరత్‌రావు అన్నారు. ఈనెల 17 నుంచి ప్రారంభం కానున్న ప్రత్యేక టీకా కార్యక్రమాన్ని చిన్నారులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని కోరారు. బెజ్జంకి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో టీకా ప్రచార కార్యక్రమంలో భాగంగా ప్రత్యేకంగా రూపొందించిన భారీ బెలూన్‌ను బుధవారం మాధవ నర్సింగ్ హోం ఆస్పత్రిపై ఎగురవేశారు. రెండు వ్యాధుల నివారణ ఒకే టీకాతో సాధ్యమవుతుందని, 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు చిన్నారులు ఈ టీకాను సద్వినియోగం చేసుకునేలా చైతన్యపరచాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ దామోదర్, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, సర్పంచి నర్సయ్య, ఎస్సై అభిలాష్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, శ్రీపతి, సుధీర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సత్యం, నారాయణరెడ్డి, ఇతరులు పాల్గొన్నారు.

● ముత్తన్నపేటలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు, గ్రామస్థులకు తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణపై బుధవారం అవగాహన సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ కరపత్రాలను పంపిణీ చేసి వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, టీకా సద్వినియోగం చేసుకోవాల్సిన తీరును వివరించారు. సర్పంచి సుకన్య, ఎస్ఎంసీ ఛైర్మన్ సారయ్య, గ్రామస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దిపేట

ఎమ్మెల్యే పర్యటన నేడు

బెజ్జంకి, న్యూస్‌టుడే: లక్ష్మీపూర్ గ్రామంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవానికి రాష్ట్ర సాంస్కృతిక సారధి ఛైర్మన్, స్థానిక శాసనసభ్యుడు రసమయి బాలకిషన్ గురువారం హాజరవుతున్నట్లు తెరాస మండల అధ్యక్షుడు రావుల రామకృష్ణారెడ్డి తెలిపారు. ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని కోరారు.



పూలకుండీలు అందజేస్తున్న మహేందర్‌రెడ్డి

పర్యావరణాన్ని ప్రేమించండి

సిద్దిపేట టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థి కర్ర మహేందర్‌రెడ్డి 60 పూలకుండీలు, అలంకరణ మొక్కలను కళాశాలలోని నేచర్ క్లబ్‌కు బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు కుండీల్లో పూలమొక్కల పెంపకం విధానంపై అవగాహన కల్పించారు. సేంద్రియ పద్ధతిలో పెంపకం తీరును వివరించారు. పర్యావరణాన్ని ప్రేమిస్తే మొక్కలు, చెట్ల విలువ తెలుస్తుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి, క్లబ్ సలహాదారు పి.అయోధ్యరెడ్డి, సభ్యులు హరికృష్ణ, రఘునందన్‌రెడ్డి, విశ్వనాథం, గుణాకర్, అనురాధ, పుణ్యమ్మ ఉన్నారు.

అధికారికి అభినందన

సిద్దిపేట టౌన్: రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం అందుకున్న జిల్లా అటవీ అధికారి శ్రీధర్‌రావును నీటిపారుదల శాఖ ఈఈ రవీందర్‌రెడ్డి బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన్ను సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు.

కాంగ్రెస్‌లో చేరిక

నంగునూరు: వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా కృషి చేయాలని నంగునూరు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దేవులపల్లి యాదగిరి అన్నారు. మండల కేంద్రానికి చెందిన కొంతమంది యువకులు స్థానికుడు రాజేందర్ నేతృత్వంలో బుధవారం పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. నాయకులు యాదగిరి, రాజు, హరిప్రసాద్ ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా నా క్లయింటు అగు దూస రాజేశ్వరీ W/o మల్లయ్య R/o H.No. 8-1-76 మరియు 77 హైదరాబాద్ రోడ్ (పాత LIC ఆఫీస్ ఎదురుగా) సిద్దిపేటలో గల ఆస్తికి సంబంధించి తేది: 11-08-2017 రోజున గౌ॥ శ్రీ K. శివచరణ్ అడ్వకేట్ ద్వారా ఇచ్చిన నోటీసుకు (ప్రకటనకు) జవాబుగా వ్రాయునది ఏమనగా నా క్లయింటుకు వారి భర్తయగు మల్లయ్య ద్వారా సంక్రమించిన ఆస్తికి సంబంధించి వారి కుమారులగు నరహరికి 230 చ॥గ॥లు, శ్రీనివాస్‌కు 200 చ॥గ॥లు మరియు శ్రీధర్‌కు 200 చ॥గ॥లను రిజిష్టర్ చేసి ఇచ్చినది. వారి కుమారులు నా క్లయింట్ యొక్క జీవన భృతి (జీవితకాలపు) క్రింద రూపాయలు బ్యాంకు నందు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తానని మాట ఇవ్వడం వల్ల సదరు ఆస్తిని వారిపేర రిజిష్టర్ చేయనైనది. అయినను ఇట్టి ఆస్తికి సంబంధించి వారి కుటుంబ తగాదాలు ఉన్నవి. కనుక ఇట్టి ఆస్తి విషయంలో వివాదాలు పరిష్కారమయ్యే వరకు అట్టి ఆస్తిపై ఎవ్వరూ ఒప్పందం కుదుర్చుకోరాదు. మరియు క్రయవిక్రయాలు జరుపరాదనీ ఈ నోటీస్ ద్వారా తెలుపనైనది. ఇట్టి ఆస్తి వివాదంపై ఆక్షేపణలు ఉన్నందున అట్టి వివాదం పరిష్కరించుకోకుండా ఎవరైనా కొన్నచో తరువాత తీసుకోబోవు చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురు.


దేవునూరి రవీందర్
అడ్వకేట్ & నోటరి
సిద్దిపేట. 9849153868

భవన నిర్మాణ పనుల పరిశీలన

సిద్దిపేట రూరల్: పట్టణంలోని ఎల్లమ్మ దేవాలయం ప్రాంతంలో గౌడ సంఘం కల్యాణ మండపాన్ని మంత్రి హరీశ్‌రావు మంజూరుచేశారు. ఈ నేపథ్యంలో బుధవారం మున్సిపల్ ఛైర్మన్ రాజనర్సు, మంత్రి ఓఎస్డీ బాలరాజు మండపానికి సంబంధించి స్థలాన్ని పరిశీలించారు. అనంతరం పట్టణంలోని ఇమాంబాద్‌లో రూ.30 లక్షలతో జరుగుతున్న ముదిరాజ్ సామూహిక భవన నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని గుత్తేదారులకు సూచించారు.

భూగర్భ కేబుల్ వేయండి

సిద్దిపేట, న్యూస్‌టుడే: కొడకండ్ల 220 కేవీ విద్యుత్తు కేంద్రం నుంచి సిద్దిపేట పవర్‌హౌజ్‌కు విద్యుత్తు సరఫరా కోసం మెదక్ రహదారిలో నిర్మిస్తున్న టవర్‌తో ఇబ్బందులు ఎదురవుతాయని పురపాలిక ఛైర్మన్ రాజనర్సు. ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డికి తెలిపారు. మెదక్ రహదారిలో విభాగిని అంచుదాటి టవర్ నిర్మాణం చేపట్టడంతో దాన్ని పరిశీలించిన మంత్రి హరీశ్‌రావు ఎట్టి పరిస్థితుల్లోనూ అంచుదాటి రహదారిపైకి నిర్మాణం రావొద్దని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో బుధవారం ట్రాన్స్‌కో డైరెక్టర్ జగత్‌రెడ్డి సిద్దిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా ఎన్సాన్‌పల్లి చౌరస్తా నుంచి జిల్లా ఆసుపత్రి మీదుగా పవర్‌హౌజ్ వరకు భూగర్భ కేబుల్ వేయాలని రాజనర్సు కోరారు. ఇదే సరైన ప్రత్యామ్నాయం అని ప్రతిపాదించారు. టవర్లు వేయడానికి మరేమైనా రహదారులు అనువుగా ఉన్నాయా...? అని పరిశీలించారు. ఆర్అండ్‌బీ, ట్రాన్స్‌కో అధికారులు వెంట ఉన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న బల్దియా ఛైర్మన్ రాజనర్సు

కోమటిచెరువు పరిశీలన

పట్టణంలోని కోమటిచెరువును ఛైర్మన్ రాజనర్సు, ఓఎస్డీ బాలరాజు, నీటిపారుదల శాఖ ఏఈ విష్ణువర్ధన్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మత్తడి దూకే ప్రాంతాన్ని చదును చేయడం, కెనాల్ పరిశుభ్రం చేసే అంశంపై చర్చించారు. వెంటనే ఈ పనులు చేపట్టాలని నిర్ణయించారు.

వినాయక దీక్షలు 25 నుంచి

సిద్దిపేట అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకుని గణేశుని అర్ధమండల దీక్షలు ఈనెల 25 నుంచి ప్రారంభమవుతున్నట్లు గణేశ్ సేవా సమితి ప్రతినిధి తోట వెంకటేశం తెలిపారు. సిద్దిపేటలో గురువారం దీక్ష కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాణిపాక వరసిద్ధి వినాయకుని ఆశీస్సులతో గత 13 సంవత్సరాలుగా దీక్షలు చేపడుతున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న భక్తులు మాలధారణకు రావాలని సూచించారు. కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధులు రాజలింగం, మోహన్, రత్నం, వీరారెడ్డి, అశోక్, ఈశ్వర్‌చరణ్, రమేష్ ఉన్నారు.

పుస్తెమెట్టెల అందజేత

సిద్దిపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని ఓ పేద వధువు వివాహం సందర్భంగా వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మి, ఆనంద్ బుధవారం పుస్తెమెట్టెలు అందించారు. పేద యువతుల వివాహాలకు తాము చేయూత ఇస్తామన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

సిద్దిపేట రూరల్: సిద్దిపేటలో ఆదర్శ విద్యానికేతన్ విద్యాలయంలో సార్వత్రిక విద్యలో 10వ, 11వ తరగతుల్లో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు హరికుమార్ తెలిపారు. ఈనెల 17వ తేదీ నుంచి వచ్చే నెల 4వ తేదీ వరకు దరఖాస్తుకు గడువు ఉందన్నారు.

నియామకం

సిద్దిపేట అర్బన్: భారతీయ జనతా దళిత మోర్చా సిద్దిపేట జిల్లా ఉపాధ్యక్షుడిగా బైరి గిరి నియమితులైనట్టు పార్టీ జిల్లా అధ్యక్షుడు నరోత్తంరెడ్డి తెలిపారు. ఈ మేరకు బుధవారం పార్టీ కార్యాలయంలో నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రోశయ్య, శ్రీనివాస్, కమాలాకర్‌రెడ్డి, గోపీనాథ్, యాదగిరి ఉన్నారు.

దైవభక్తితో మానసిక ప్రశాంతత

మల్యాల(చిన్నకోడూరు): దైవభక్తితోనే వ్యక్తికి అసలైన మానసిక ప్రశాంతత లభిస్తుందని సర్పంచి యాదయ్య అన్నారు. మల్యాల ఉన్నత పాఠశాలలో సరస్వతి మాత విగ్రహావిష్కరణ కార్యక్రమం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు కిష్టయ్య మాట్లాడుతూ.. పాఠశాల స్థాయిలోనే విద్యార్థులకు దైవభక్తిని పెంపొందించాలనే సంకల్పంతో గ్రామానికి చెందిన సంధ్య-తిరుపతిరెడ్డి ముందుకొచ్చి సరస్వతి మాత విగ్రహాన్ని ఏర్పాటు చేయించడం అభినందనీయమన్నారు. విగ్రహావిష్కరణలో ఎంపీటీసీ సభ్యుడు మల్లేశం, పీఏసీఎస్ డైరెక్టర్ రాజేల్లం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గుర్రాలగొందిలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

గుర్రాలగొంది(చిన్నకోడూరు): ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు ప్రభుత్వం పటిష్ఠ ప్రణాళికతో ముందుకు సాగుతోందని గుర్రాలగొంది సర్పంచి అంజనేయులు అన్నారు. ఈ గ్రామంలో 20 రెండు పడకగదుల ఇళ్ల నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. సర్పంచి మాట్లాడుతూ.. నిరుపేదలకు సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా రెండు పడకగదుల ఇళ్ల పథకాన్ని ప్రారంభించిందన్నారు. ప్రస్తుతం గుర్రాలగొందిలో ప్రారంభించామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు మల్లేశం, ఉపసర్పంచి శివయ్య, ఏఈలు సంతోష్, నాగేంద్ర పాల్గొన్నారు.

ఆసక్తితో చదివితే సులువే

సిద్దిపేట టౌన్: ఆసక్తితో చదివితే విద్యాభ్యాసం సులువుగా ఉంటుందని, కష్టపడి కాకుండా ఇష్టంగా చదవాలని ప్రేరకురాలు భాగ్యలక్ష్మి అన్నారు. పట్టణంలోని ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాలలో జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రేరణ-వ్యక్తిత్వ వికాసంపై బుధవారం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. జ్ఞాపకశక్తి పెంపొందించుకోవడం, పాఠ్యాంశాలను సులభంగా అర్థం చేసుకునే విధానాలను వివరించారు. అందరికీ శక్తిసామర్థ్యాలు, తెలివితేటలు ఒకేస్థాయిలో ఉంటాయని, సరైన దిశలో వినియోగించుకోవాలన్నారు. హెచ్ఎం రామస్వామి, జేవీవీ జిల్లా అధ్యక్షుడు ఎం.బాలరాజు, ప్రధాన కార్యదర్శి సాదత్ అలీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భాగ్యలక్ష్మి

సెల్లారు గోడ కూల్చివేత

సిద్దిపేట, న్యూస్‌టుడే: సిద్దిపేట - మెదక్ రహదారిలోని ఓ సెల్లార్‌లో అక్రమంగా నిర్మించిన గోడను అధికారులు మంగళవారం కూల్చివేయించారు. ఈ కార్యక్రమాన్ని టీపీఓ స్వామినాయక్ పర్యవేక్షించారు. పట్టణంలోని అన్ని సెల్లార్లలో అక్రమ నిర్మాణాలు కూల్చివేసే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. టీపీఎస్ హబీబున్నీసా, టీపీబీఓ ప్రవీణ్, రాజీవ్‌రెడ్డి, రఘునాథ్ పాల్గొన్నారు.

CLASSIFIEDS

POULTRY

నిన్నటిరోజు NECC, హైదరాబాద్ జోన్ 100 కోడిగుడ్ల ఫారంగేటు ధర రూ॥ 355/- చిల్లర ధర రూ॥ 4.15 ఫోన్: 23240329, కల్‌బర్డ్ ధర రూ॥ 62/-per KG, ఫర్‌బర్డ్ ఫోన్: 9000371404.

AUTOMOTIVE



BUSINESS OFFER

Data Entry new Project available with High Payout & Long Term Contract Min 5- Systems & Office setup Mandatory ✆ 7330650753.

సత్యదేవ - ప్లాస్టిక్ వస్తువులు తయారుచేయు మెషిన్లు అమ్మకం. నెలకు 20 వేలు పైగా ఆ॥, ముడిసరుకు ఇచ్చి తయారైనవి కొంటాం, 5 సం॥ బై బ్యాక్ అగ్రిమెంట్. ✆ 95810 56713.

PLOT FOR SALE

హైద్రాబాద్, ఇల్లుకట్టుకొనుటకు అనుకూలమైన HMDA లేఅవుట్ గేటెడ్ కమ్యూనిటీ గండిమైసమ్మ 'X' రోడ్స్ దగ్గర బాలానగర్ & మియాపూర్ నుండి 12KM రింగురోడ్ 1KM. Bank Loans స్పాట్ రిజి॥ ✆ 9912297624

JOBS

Wanted Computer Operators with High Speed Typing 40 Wpm Soft Tech Solutions Sangareddy. 9603041000, 8328367470

నిరుద్యోగులకు శుభవార్త. హైదరాబాద్‌లో కొత్తగా ఓపెన్ చేసిన MNC కంపెనీలో పర్మినెంట్ జాబ్స్ కలవు. (Males) ఎటువంటి ఫీజు లేదు. వయస్సు 18-26. నెలకు 10-15 వేలు సంపాదన. రూమ్, ఫుడ్ ఫ్రీ. కృష్ణ ✆ 9030225252

సదాశివపేటలోని ప్రముఖ కంపెనీలో పనిచేయడానికి అనుభవం గల I.T.I. ఫిట్టర్లు/ వెల్డర్స్, హౌస్ కీపింగ్ బాయ్స్ వెంటనే కావలెను. PF+ ESI+ వసతి+ Food. ✆ 9666578684

Paytm ekyc Update చేయడానికి Smart Phone కలిగిన యువతీ, యువకులు కావలెను. జీతం: 12,000. ✆ 9490522635

దుర్గ TVS సంగారెడ్డిలో పూర్తి కంప్యూటర్ పరిజ్ఞానం కల్గిన లేడీ రిసెప్షనిస్ట్ మరియు వర్క్‌షాప్ మేనేజర్‌గా పనిచేయుటకు B.Tech, M.Tech, ITI మెకానికల్ Eng పూర్తి చేసుకున్న అనుభవజ్ఞులైన మరియు ఉత్సాహవంతులైన వ్యక్తులు కావలెను. ✆ 9490796981, 9676156202.

హైదరాబాద్‌లోని ఇళ్లల్లో 24గం॥లు వృద్ధులకు సేవ చేయడానికి, వంట చేయడానికి, పిల్లలను చూసుకోవడానికి 100 మంది ఆడవారు/ మగవారు కావలెను. జీతం: 9 వేలు భో+ వసతి ఫ్రీ. ✆ 7032025222.

సిద్దిపేటలో పనిచేయుటకు BBR మెటల్ ఇండస్ట్రీలో పనిచేయుటకు కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ బాయ్, సూపర్‌వైజర్‌లు కావలెను. అనుభవం ఉన్నవారికి మంచి వేతనం ఇవ్వబడును. పనివేళలు ఉ॥ 8 గం॥ల నుండి సా॥ 8 గం॥ల వరకు. Cell: 9440896116

ENGINEERING

CMAS Mtg of Construction Machinery @Cherlapally Looking for Electrical Engg with 3-5 Yrs Exp in Control Panel Wiring & VFD's HMI. ✆ 9397811468. admin@cmac.co.in

FACULTY / TEACHERS

Teachers to Teach High School Social Studies & Primary Teachers in A Reputed School at Isnapur 'X' Road. Ptc. Mdl. ✆ 8686078899

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పచ్చదనం.. ఆలయానికి అందం



నర్సాపూర్‌లోని లక్ష్మీనారాయణస్వామి ఆలయం

న్యూస్‌టుడే, నర్సాపూర్

ఆ ఆలయాన్ని చూస్తూ.. అక్కడి పచ్చదనం పరవశింపజేస్తుంది.. ఆవరణలోకి అడుగుపెడితే ఆహ్లాదకర వాతావరణం స్వాగతం పలుకుతుంది.. పచ్చని తివాచీ పరిచినట్లుండే ఈ ప్రాంతం చూడముచ్చటగా ఉంటుంది. పూలు, ఔషధ మొక్కలతో పాటు భక్తులు ప్రదక్షిణలు చేసేందుకు ప్రత్యేకంగా చేసిన ఏర్పాట్లతో ఆకర్షణీయంగా కనిపిస్తుంది. అదెక్కడో కాదు.. నర్సాపూర్‌లో కాకతీయుల కాలంలో నిర్మించిన లక్ష్మీనారాయణస్వామి ఆలయం.

అప్పట్లో దేశ్‌ముఖ్‌లు నిర్మించిన ఈ ఆలయం శిథిలం కాగా స్థానికంగా ఉన్న ఓ ఇంజినీరింగ్ కళాశాల యాజమాన్యం రూ.30 లక్షలు వెచ్చించి పునర్‌నిర్మించింది. ఆలయాన్ని నిర్మించి చేతులు దులుపేసుకోకుండా నిర్వహణను సైతం చూస్తోంది. ఇక పచ్చదన సంరక్షణకు ఓ వ్యక్తిని ప్రత్యేకంగా నియమించడం గమనార్హం. నాటిన మొక్కలు పెరిగి పచ్చదనం వెల్లివిరుస్తోంది. ఏపుగా పెరిగిన వృక్షాలు రక్షణ గోడగా నిలిచాయి. ఇక్కడి చెట్లకు పూసిన పూలను స్వామికే సమర్పిస్తుండటం గమనార్హం. ఎక్కడా మట్టినేల అనేది కనిపించకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులు కాలినడకన ప్రదక్షిణలు చేయడానికి బండలు ఏర్పాటుచేసి వాటి చుట్టూ గడ్డిని ఏర్పాటు చేశారు.



ఆవరణలో చెట్లు



ప్రదక్షిణ చేసేందుకు ఏర్పాటుచేశారిలా..

లోక కల్యాణార్థం సుదర్శన యాగం

వర్గల్: ప్రముఖ పుణ్యక్షేత్రం నాచారంగుట్ట లక్ష్మీనరసింహ్మాస్వామి ఆలయంలో లోకకల్యాణార్థం సుదర్శన యాగం నిర్వహిస్తామని ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షులు కొట్టాల యాదగిరి వెల్లడించారు. బుధవారం క్షేత్రం కార్యాలయంలో ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమావేశంలో పలు అంశాలు చర్చించామని తెలిపారు. ముఖ్యంగా సుదర్శన యాగంపై చర్చ సాగిందని చెప్పారు. దాతల సహకారంతో నవంబరు 13 నుంచి 16 వరకు యాగాన్ని భారీగా నిర్వహించాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. క్షేత్రంలో టెంటు సామగ్రికి టెండరు నిర్వహిస్తామన్నారు. క్షేత్రంలోని అతిపురాతన శిథిలమైన సత్రాలను కూల్చివేస్తామని స్పష్టంచేశారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈవో సుధాకర్‌రెడ్డి, ధర్మకర్తలు కృష్ణమాచార్యులు, జహంగీర్‌యాదవ్, రాములుగౌడ్, పడిగె రాజు, చంద్రారెడ్డి, పాండురంగారావు, విఠల్, కె.యాదగిరి, వెంకటేష్, కోడిపాక వెంకటేశం, రాజనర్సింగరావు, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న ధర్మకర్తలు

మెరుగైన సేవలు అందించాలి



అధికారులతో ఎమ్మెల్యే మదన్‌రెడ్డి

నర్సాపూర్ రూరల్: అధికారులు ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజు ఉత్తమ సేవలు అందించినందుకు నర్సాపూర్ ఆర్డీవో వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ వేణుగోపాల్, ఎస్ఐ వెంకటరాజగౌడ్, తహసీల్ కార్యాలయం జూనియర్ అసిస్టెంటు నాగరాజు, చిప్పల్‌తుర్తి వీఆర్వో ధన్‌సింగ్, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్‌లు ప్రశంసాపత్రాలు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు బుధవారం నర్సాపూర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో వీరందరినీ స్థానిక ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులు తమ పరిధిలో ప్రజలకు విలువైన సేవలు అందిస్తూ ప్రశంసలు అందుకోవాలన్నారు. తెరాస జిల్లా నాయకుడు అశోక్‌గౌడ్, డీసీసీబీ వైస్‌ఛైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, తెరాస మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు హబీబ్‌ఖాన్, నాగేష్ తదితరులు ఉన్నారు.



సైన్స్ పట్ల అవగాహన అవసరం

నర్సాపూర్ రూరల్: సైన్స్ పట్ల అవగాహన పెంచుకోవాలని జేవీవీ రాష్ట్ర కార్యదర్శి నర్సింలు సూచించారు. బుధవారం నర్సాపూర్‌లో సంఘం జిల్లాస్థాయి కార్యవర్గ సమావేశం ఎల్లంకి డిగ్రీ కళాశాలలో జరిగింది. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో సైన్స్ కేంద్రాన్ని ఏర్పాటుచేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్లీనరీ అక్టోబరు 14, 15 తేదీలలో తుప్రాన్‌లో నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ నెల 27న ఒక రోజు శిక్షణ కార్యక్రమం ఉంటుందని, ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. అనంతరం స్వర్గీయ శాస్త్రవేత్త పీఎం భార్గవకు సంతాపం తెలిపారు. టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్, కోశాధికారి పండరి, మోహన్‌రావు తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నర్సింలు

మూతపడిన తపాలా కార్యాలయాలు

వెల్దుర్తి: గ్రామీణ తపాలా ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. జిల్లా వ్యాప్తంగా గ్రామీణ తపాలా కార్యాలయాలు మూతపడ్డాయి. గ్రామీణ డాక్‌సేవక్‌లు తమ డిమాండ్ల సాధనకు అఖిల భారత గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం పిలుపు మేరకు దేశ వ్యాప్తంగా నిరవధిక సమ్మె బాట పట్టారు. దీంతో జిల్లాలో 90 శాతం సేవలు నిలిచిపోయాయి. తపాలాశాఖలో గ్రామీణ డాక్‌సేవక్స్ సేవలు కీలకం. గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉత్తరాల రూపంలో వచ్చే సమాచారాలను ఏరోజుకా రోజు చేరవేయడంలో వీరిదే కీలకపాత్ర. సాంకేతికంగా ఎంతో అభివృద్ధి చెందిన ప్రస్తుత తరుణంలో గ్రామీణులకు ఈ సేవలే దిక్కు.

125 కార్యాలయాలు బంద్

గ్రామీణ తపాలా ఉద్యోగుల సమ్మె వల్ల మెదక్ జిల్లాలో 125 గ్రామీణ తపాల కార్యాలయాలు మూతపడ్డాయి. దీంతో మెదక్‌లో ఉన్న జిల్లా కార్యాలయంతో పాటు 22 సబ్ పోస్టాఫీసులు పాక్షికంగా మాత్రమే పని చేశాయి. మొత్తం 230 మంది సిబ్బంది సమ్మెలో ఉన్నారు. గ్రామీణ తపాల కార్యాలయాల్లో బ్రాంచి పోస్టుమాస్టర్, డెలివరి ఏజెంట్లు, మెయిల్ క్యారియర్లు పని చేస్తారు. వీరందరు ఆందోళనలో ఉండటం గమనార్హం. పొదుపు ఖాతాలు, ఆర్డీ, నూతన ఖాతాలు తెరవడం, గ్రామీణ తపాల జీవిత బీమా, సుకన్య సమృద్ధి యోజన, మనీయార్డర్లు పంపిణీ చేయడం, రిజిస్టర్ పోస్టులు, సాధారణ ఉత్తరాల విక్రయాలు, బట్వాడా చేయడం వంటి విధులకు ఈ ఆందోళనతో ఆటంకాలు ఏర్పడ్డాయి.

ఉపాధి కూలీలకు ఇబ్బందే

ఇదిలా ఉండగా ఉపాధి హామీ కూలీలకు కూలి డబ్బు, ఆసరా పింఛన్లు గ్రామీణ తపాల కార్యాలయాల ద్వారానే అందజేస్తున్నారు. ఇవి నిలిచిపోవడంతో కూలీలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఇబ్బందులకు గురవుతున్నారు.

డిమాండ్లు ఇవి..

- గ్రామీణ డాక్ సేవక్స్ (జీడీఎస్)లకు సివిల్ సర్వెంట్ హోదా ఇవ్వాలి.
- ఎనిమిది గంటల పని సమయంగా నిర్ణయించాలి.
- కమలేష్‌చంద్ర కమిటీ సిఫార్సులను అమలు చేయాలి.
- దిల్లీ,మద్రాస్ క్యాట్ ప్రిన్సిపల్ బెంచ్ తీర్పు ప్రకారం జీడీఎస్‌లకు పింఛన్ సదుపాయం కల్పించాలి.

శ్రమదోపిడికి గురవుతున్నాం..: యూ.మల్లయ్య, అధ్యక్షుడు, గ్రామీణ తపాల ఉద్యోగుల సంఘం



దశాబ్దాల కొద్ది జీడీఎస్‌లు శ్రమదోపిడికి గురవుతున్నారు. 1977, 1996 సంవత్సరాల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను సైతం ప్రభుత్వం బేఖాతరు చేస్తోంది. ఇంతవరకు సివిల్ సర్వెంట్ హోదా కల్పించకుండా ప్రభుత్వం, తపాలాశాఖలు కాలయాపన చేస్తున్నాయి. జీడీఎస్ ఏడో వేతన కమిటీ అములులో జాప్యం నెలకొంది. ఇప్పటికైనా ప్రభుత్వం దిగి వచ్చి మా డిమాండ్లను నెరవేర్చాలి.

చాలీచాలని వేతనాలు: ఆంజనేయులు, కార్యదర్శి



దశాబ్దాలుగా గ్రామీణ తపాల ఉద్యోగులు చాలీచాలని జీతాలతో వెట్టిచాకిరీ చేస్తున్నారు. తమకు న్యాయం జరిగే వరకు విధులను బహిష్కరించి గ్రామీణ తపాల సేవలు స్తంభింపజేసి కమలేష్‌చంద్ర కమిటీ నివేదిక అమలయ్యేవరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తాం.



గంజాయి సాగు చేసిన చేనులో పోలీసులు

గంజాయి పండించినా, తరలించినా కఠిన చర్యలు

కంగ్టి: అక్రమంగా గంజాయి పండించినా, తరలించినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కంగ్టి సీఐ తిరుపతియాదవ్ హెచ్చరించారు. సమాచారం మేరకు మండలంలోని ఎన్కమూరి గ్రామ శివారు సర్వే నం.83లో అక్రమంగా సాగవుతున్న గంజాయి క్షేత్రాలపై తన సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఎన్కమూరి శివారులో వ్యవసాయ భూములు ఉన్న నాగల్‌గిద్ద మండలం ఎనక్‌పల్లి మోనా తండాకు చెందిన మారుతి, మారోనిబాయిలు కంది పంటలో అంతర పంటగా గంజాయి మొక్కలను సాగు చేస్తున్నారు. ఇరువురు కలిసి దాదాపు అర ఎకరం విస్తీర్ణంలో గంజాయి మొక్కలు పెంచుతున్నారు. ఈ మేరకు ఏపుగా పెరిగిన గంజాయి మొక్కలను కూలీలతో పెకిలించివేశామన్నారు. నిందితులపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ దాడుల్లో కంగ్టి ఎస్ఐ నానునాయక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నలుగురు కార్యదర్శులు, సర్పంచిపై కేసు నమోదు

అమీన్‌పూర్: అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలో అధికారాన్ని దుర్వినియోగం చేసిన అభియోగాలతో నలుగురు కార్యదర్శులు, సర్పంచిపై బుధవారం అమీన్‌పూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అమీన్‌పూర్ పంచాయతీ పరిధిలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు కాశీనాథ్, సుమనారాయణ, వాసంతి, ఈటీపీఆర్టీ దేవదాసులు, గ్రామ సర్పంచి కాట శ్రీనివాస్‌గౌడ్ పంచాయతీ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు, ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు ఇచ్చారని ఎంపీడీఓ అనంతరెడ్డి ఫిర్యాదు చేశారని తెలిపారు. అధికార దుర్వినియోగానికి పాల్పడిన ఐదుగురిపై వివిధ ఐపీసీ సెక్షన్లలో కేసులు నమోదు చేసి విచారణ చేస్తున్నామని తెలిపారు.

సెప్టెంబరు 3 నుంచి జగదాంబ భవానీ వ్రత దీక్షలు

సంగారెడ్డి మున్సిపాలిటీ, న్యూస్‌టుడే: సెప్టెంబరు 3 నుంచి 23వ తేదీ వరకు శ్రీ జగదాంబ భవానీ వ్రత దీక్ష మహోత్సవాలు జిల్లాలోని అన్ని తండాలలో నిర్వహించాలని ఆల్ ఇండియా లంబాడ శక్తిపీఠ్ సహాయ కార్యదర్శి విఠల్‌నాయక్ రాథోడ్ తెలిపారు. బుధవారం ఆయన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. 3న ఉదయం 8 గంటలకు పుల్కల్ మండలం లక్ష్మీసాగర్ పంచాయతీ పరిధిలోని విఠల్‌నాయక్ తండాలో తాను స్వయంగా దీక్షలో పాల్గొంటానని పేర్కొన్నారు. 21 రోజుల పాటు దీక్ష చేపట్టనున్నారు.

స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలి

కాచిగూడ, న్యూస్‌టుడే: పార్టీలకు అతీతంగా స్వచ్ఛ భారత్‌ను విజయవంతం చేయాలని కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ కోరారు. బుధవారం కాచిగూడ రైల్వే స్టేషన్‌లో దక్షిణ మధ్య రైల్వే హైదరాబాద్ డివిజన్ ఆధ్వర్యంలో చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు తమ తమ ప్రాంతాల్లో పరిసరాల పారిశుద్ధ్యంలో భాగస్వాములు కావాలని కోరారు. పారిశుద్ధ్యంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంపీలు, ఎమ్మెల్యేలతో సమావేశాన్ని నిర్వహించారని, తర్వాత ఏమైందో తెలియదన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో చాలా చోట్ల చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోందన్నారు. నగరంలో వేస్ట్‌మేనేజ్‌మెంట్ కార్యక్రమాన్ని చేపట్టి రహదారుల పరిశుభ్రతకు పెద్ద పీట వేయాలని సూచించారు. రైల్వేలో పారిశుద్ధ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. రైల్వే స్టేషన్లు, ప్లాట్ ఫారాలు, పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ప్రయాణికులు సహకరించాలని కోరారు. దక్షిణ మధ్య రైల్వే జీఎం వినోద్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ... రైల్వే హైదరాబాద్ డివిజన్ పరిధిలో ఈ నెల 16 నుంచి 31 వరకు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. పారిశుద్ధ్య లోపాలను సవరించుకుని ముందుకెళతామన్నారు. కార్యక్రమంలో భాజపా శాసన సభాపక్ష నేత, ఎమ్మెల్యే జి.కిషన్‌రెడ్డి, డీఆర్ఎం అరుణ్‌కుమార్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

	వెన్‌కాబ్	సుగుణ
ఫాంరేటు	76-00	78-00
రిటైల్	90-00	93-00
డ్రెస్డ్	126-00	135-00
స్కిన్‌లెస్	149-00	158-00

వెన్‌కాబ్: 9849219870
సుగుణ: 9346589121

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

పటాన్‌చెరు: పరిశ్రమలో విద్యుదాఘాతానికి గురైన ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన ఇది. బీడీఎల్ రాణా పరిధిలో చోటు చేసుకుంది. సీఐ వేణుగోపాల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడ కు చెందిన ఎంఎస్ఎన్ పరిశ్రమలో బీహార్‌కు చెందిన రాయ్ (38) గుత్తేదారుడి వద్ద కార్మికుడుగా పనిచేస్తున్నారు. విధి నిర్వహణలో భాగంగా బుధవారం మధ్యాహ్నం పంపుహౌస్‌లో పని చేస్తున్నారు. అక్కడే ఉన్న విద్యుత్తు తీగలు తగిలాయి. ఆస్పత్రికి తరలించే లోపు మృత్యువాత పడ్డారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు పోలీసులు చెప్పారు.

మూలుగుతున్న నిధులకేది 'చికిత్స'.!

(మొదటి పేజీ తరువాయి) ఉంది. ఇటీవల 2017-18 వార్షిక సంవత్సరానికిగాను మొదటి దఫా ఒక్కో ఆస్పత్రికి రూ.87,500 చొప్పున రెండు జిల్లాలకు రూ.45.50లక్షలు విడుదలయ్యాయి. వాటిని దాదాపుగా అన్ని చోట్ల ముట్టుకోనే లేదు. వ్యాధులు ప్రబలే కాలం అవడంతోపాటు ఉన్న చిన్నపాటి మౌలిక వసతుల కోసం ఈ నిధుల్ని వినియోగించడంలో జాప్యాన్ని చూపిస్తున్నారు. గతేడాది సిద్దిపేటలో 18, మెదక్‌లో 8 చోట్ల వచ్చిన నిధుల్ని ఆయా పనులకు ఉపయోగించారు. మిగతా వాటికి సంబంధించి ఖర్చు చేయకపోవడంపై ఉన్నతాధికారులు పలుమార్లు తాకీదులు అందించినా మార్పు కనిపించలేదు.

మొక్కుబడి తంతే..

ఆస్పత్రి అభివృద్ధి కమిటీల సమావేశం ప్రతి మూడు నెలలకోసారి జరగాల్సి ఉంటుంది. రోగులకు ఇబ్బంది కలుగకుండా తగిన వసతులు కల్పించేదుకు అవసరమైన చర్చకు కమిటీ సమావేశం వేదికగా నిలుస్తుంది. ఇందులో చర్చించిన అంశాలకు తీర్మానాలు చేసి నిధుల్ని వినియోగించుకోవచ్చు. చాలా చోట్ల కమిటీల సమావేశాలు జరగడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవలే రెండు జిల్లాల్లో పాలనాధికారుల ఆదేశాలతో నిర్వహించారు. ఎంపీపీ ఈ కమిటీకి అధ్యక్షుడిగా వ్యవహరిస్తారు. కాగా ఆస్పత్రి అభివృద్ధి నిధులకు సంబంధించి ఎలాంటి సమాచారాన్ని ఇవ్వడంలేదని, కమిటీ సమావేశాల్ని జరపడం లేదని ఒకరిద్దరు ఎంపీపీలు బాహాటంగా ఆయా సందర్భాల్లో ఉన్నతాధికారులకు విన్నవిస్తున్నారు. ఎక్కువగా ఆస్పత్రుల్లో తాగునీటి సమస్యతోపాటు చిన్నపాటిగా భవన మరమ్మతులు, పారిశుద్ధ్య పనులు, ఆధునీకరణ పనులు, రోగుల కోసం కుర్చీల ఏర్పాటు.. తదితర సదుపాయాలను సమకూర్చాల్సి ఉంటుంది.

నిర్లక్ష్యానికి మందేది..?

గతంతో పోలిస్తే ఆస్పత్రులకు వచ్చే నిధుల తీరు క్రమక్రమంగా తగ్గుతోంది. కొన్నేళ్ల కిందట ఒక్కో ఆస్పత్రికి రూ.2.25 లక్షల వరకు అందగా.. అది కాస్తా లక్షతోనే సరిపెట్టాల్సి వస్తోంది. ఇలా అరకొరగా అందిన నిధులను సక్రమంగా ఉపయోగించడంలో నిర్లిప్తత అడుగడుగునా కనిపిస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం చాలాచోట్ల శాపంగా మారుతుంది. ఈక్రమంలో ఆస్పత్రుల చెంతన చెట్ల పొదలు పేరుకున్నాయి. పారిశుద్ధ్య సమస్యలు తిష్ట వేస్తున్నా పట్టించుకోవడంలేదు. కొన్నింటిలో మూత్రశాలలు సరిగ్గాలేవు. పలుమార్లు తనిఖీల సందర్భాల్లో ఉన్నతాధికారులు ఆయా సమస్యల్ని గుర్తించి వాటి పరిష్కారాలకు ఆదేశాలిచ్చినా చెప్పుకోతగిన స్థాయిలో మార్పు కనిపించలేదు.

- టేక్మాల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చిన నిధులను అతితూచి ఖర్చు చేస్తున్నారు. అంతర్జాల సౌకర్యం కోసం రూ.11 వేలు మాత్రమే ఇటీవల ఖర్చు చేసినట్లు సమాచారం. దీంతోపాటు స్టేషనరీ సహా అత్యవసర మందులకు మరికొన్నింటిని వెచ్చించారు. చాలావరకు నిధులు అలాగే ఉండిపోయాయి. చిన్నశంకరంపేటలోని ఆస్పత్రిలో పరిస్థితి మరోలా ఉంది. ఇక్కడి ఆస్పత్రి భవనానికి కొన్నేళ్లకిందటే రంగులు వేశారు. తిరిగి ఇటీవలే మరోమారు వేసి ఉన్న నిధుల్ని వినియోగించారు. ఇతర అవసరాల కోసం వినియోగించాల్సిన నిధుల విషయంలో శ్రద్ధ చూపించలేదనే విమర్శలున్నాయి.


పలుమార్లు ఆదేశాలిచ్చాం..

- జగన్నాథరెడ్డి, జాతీయ ఆరోగ్యమిషన్ అధికారి (సిద్దిపేట, మెదక్ జిల్లాలు)

ఆసుపత్రుల్లో పలు అవసరాల కోసం నిధులు వినియోగించాలని తగు ఆదేశాలు ఇచ్చాం. సరిగ్గా వినియోగించని వారికి ప్రత్యేకంగా సూచించాం. ఈ నెలాఖరులోగా వాటిని ఉపయోగించి సదుపాయాలు కల్పించకపోతే శాఖాపరంగా తగిన చర్యలు తీసుకుంటాం. ఆయా ఆస్పత్రుల వారీగా చేసిన ఖర్చుల తీరుని సమీక్షిస్తాం.

సామాజిక సేవలో యువతరం

జీవితంలో రూ.కోట్ల ధనం సంపాదించినా పొందని ఆనందం ఓ సేవా కార్యక్రమం నిర్వహిస్తే కలుగుతుంది.. సామాజిక సేవతో సంతృప్తి కలుగుతుందంటూ పెద్దలు చెప్పిన మాటను తూచా తప్పకుండా పాటిస్తూ స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఈ యువ ఇంజినీర్లు.. ఎన్ఎస్ఎస్ స్ఫూర్తిని అందిపుచ్చుకొని పెన్నులు, పుస్తకాలు పక్కనపెట్టి పలుగు, పార చేతబట్టి పల్లెలకు కదిలారు.. కేవలం జాతీయ నినాదాన్ని నాలుగుగోడల మధ్యన పరిమితం చేయకుండా విద్యనభ్యసించడంతో పాటు సామాజిక సమస్యలను పరిష్కరించడంలోనూ తామేమీ తక్కువ కాదని నిరూపిస్తున్నారు.. నర్సాపూర్‌లోని బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు. ఇదే మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంతో పాటు నర్సాపూర్ పట్టణంలోనూ 15 రోజుల పాటు ప్రత్యేక కార్యక్రమాలను చేపట్టి ఆదర్శంగా నిలిచారు.



ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో ఆదర్శం



ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణంలో శుభ్రం చేస్తూ..

యువ ఇంజినీర్ల.. సేవా పథం

న్యూస్‌టుడే, నర్సాపూర్

బీవీఆర్ఐటీ ఇంజినీరింగ్ కళాశాలలో అన్ని విభాగాల విద్యార్థులతో ఎన్ఎస్ఎస్ విభాగాన్ని ఏర్పాటుచేశారు. ఆసక్తి ఉన్న వారు ముందుకు రాగా వారితో సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. చదువుతో పాటు వీటిని చేపట్టడం వల్ల భావి జీవితంలో వేసే అడుగులకు ప్రత్యక్ష అవగాహన కలుగుతుందన్న సదుద్దేశంతో దీనికి పూనుకున్నారు. ప్రస్తుతం 300 మంది విద్యార్థులు సభ్యులుగా కొనసాగుతున్నారు. సమన్వయకర్తలుగా నీరజవర్మ, వరుణ్‌కుమార్, శివరామరాజు, గోపాలకృష్ణ, ఝాన్సీ, లోహిత, సాయికిరణ్, దినేశ్‌లు వ్యవహరిస్తున్నారు. ఐటీ విభాగం అధిపతి దశరథరామయ్య ఆధ్వర్యంలో జేఎన్టీయూ ఎన్ఎస్ఎస్ విభాగం సమన్వయకర్త డాక్టర్ పి. సమ్మూలాల్ సూచనల మేరకు కార్యక్రమాలు ముందుకు సాగుతున్నారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన స్వచ్ఛభారత్ పిలుపును అందిపుచ్చుకొని విద్యార్థులు ఇటీవల స్వచ్ఛభారత్ పక్వాడ కార్యక్రమాన్ని 15 రోజుల పాటు చేపట్టడం విశేషం.



నర్సాపూర్‌లో స్వచ్ఛతపై విద్యార్థుల ర్యాలీ

పరిసరాల శుభ్రతపై చైతన్యం..

నర్సాపూర్ మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామాన్ని కళాశాల యాజమాన్యం దత్తతు తీసుకుంది. వ్యక్తిగత శౌచాలయాల నిర్మాణాలను చొరవ చూపింది. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో పాటు కళాశాల యాజమాన్యం సైతం నిధులు వెచ్చించి పనులు పూర్తిచేసేలా కృషి చేయడం విశేషం. దీంతో ఈ గ్రామం సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా ఎంపికైంది. జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా సర్పంచి లక్ష్మీనారాయణ సైతం పురస్కారం అందుకున్నారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా సుమారు 300 మంది విద్యార్థులు గ్రామంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని చేపట్టి చెత్తాచెదారం తొలగించారు. వీధులను శుభ్రం చేశారు. పరిసరాల శుభ్రతపై ఇంటింటికి తిరిగి అవగాహన కల్పించారు. వ్యక్తిగత శౌచాలయాల ప్రాముఖ్యతను వివరించారు. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల, రక్షితనీటి పథకం, చెరువు గట్టు పరిసరాలను సైతం శుభ్రం చేశారు. అలాగే నర్సాపూర్‌లో జాతీయ నాయకుల విగ్రహాలను శుభ్రం చేశారు. అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రాం, స్వామివివేకానంద విగ్రహాలను నీటితో కడిగారు.

శ్రమదానం చేసి..

ఈ యువ ఇంజినీర్లు ఇంతటితో ఆగిపోకుండా నర్సాపూర్‌లో పలుగు, పార, చీపుర్లు చేతపట్టి ఆర్టీసీ ప్రయాణప్రాంగణం, ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాలలో సేవా కార్యక్రమాలు చేపట్టారు. ప్రయాణ ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు సంపూర్ణ ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. ఆసుపత్రి ఆవరణలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. శుభ్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిబ్బందికి, రోగులకు వివరించారు. అలాగే స్థానిక అంబేడ్కర్ కూడలి నుంచి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ చేపట్టారు. స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయడంతో పాటు మొక్కలు నాటారు. సహచరుల్లో సైతం స్వచ్ఛతపై అవగాహన పెంచాలనే సద్దుదేశంతో కళాశాలలో సాంస్కృతిక కార్యక్రమాలు సైతం ప్రదర్శిస్తుండటం గమనార్హం.

చాలా సంతోషంగా ఉంది..: నీరజవర్మ (ఐటీ, తృతీయ)


ఎన్ఎస్ఎస్‌లో భాగంగా గ్రామానికి వెళ్లడం ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేయడం సంతోషంగా ఉంది. ఎప్పుడూ ల్యాబ్‌లు, తరగతి గదులలో ఉండే మేము బయటకు వెళ్లడం, ప్రజలతో మమేకం కావడం మరచిపోలేము. అనేక అంశాలపై అవగాహన కలిగింది.

మరిన్ని కార్యక్రమాలు..: వరుణ్ (మెకానికల్ తృతీయ)

ఎన్ఎస్ఎస్ అనేది జాతీయ సేవా కార్యక్రమం. ఇందులో పాల్గొంటే ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. జీవితంపై విశ్వాసం, భవిష్యత్తుపై ఆశలు కలుగుతాయి. చదువుతోపాటు సేవా కార్యక్రమాలు చేపట్టడం అనేది జీవితంలో తొలిమెట్టుగా భావిస్తున్నాం. మరిన్ని కార్యక్రమాలు రూపొందిస్తున్నాం.



గురుభ్యోనమః



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

మిరుదొడ్డి ఉపాధ్యాయ సంఘం ఏర్పాటు ● విద్యాభివృద్ధికి చేయూత

న్యూస్‌టుడే, మిరుదొడ్డి

ఎప్పుడూ పాఠశాల, ఇల్లే ప్రపంచమా... సమాజం మనకు ఎంతో ఇచ్చింది... తిరిగి సమాజానికి ఏం చేయలేమా... ఒక్కడిగా ఏం చేయలేక పోవచ్చు... నలుగురు కలిస్తే ఏదైనా చేయవచ్చు. ఈ ఆలోచనతోనే మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయులు సంఘంగా ఏర్పడి సమాజ సేవకు నడుం కట్టారు. మిరుదొడ్డి ఉపాధ్యాయ సంఘం పేరుతో స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం సంస్థ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నారు.

గ్రామ అభివృద్ధి, నిరుపేదల పిల్లలకు విద్య, ఆరోగ్యం అందించడం వారి లక్ష్యం. అలాగని వారు ధనవంతుల కుటుంబంలో జన్మించినవారు కాదు. వారికున్నదల్లా సంకల్పం, ఐకమత్యం. చేయిచేయి కలిపితే సాధించలేనిది ఉండదన్న సమ్మకం. ఆ నమ్మకం నుంచి ఆవిర్భవించిందే మిరుదొడ్డి ఉపాధ్యాయ సంఘం. మండల కేంద్రమైన మిరుదొడ్డి గ్రామం అన్నిరంగాల్లో వెనుకబడిన ప్రాంతం. మధ్య, దిగువ తరగతి కుటుంబాలు ఎక్కువగా నివసిస్తుంటారు. తమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఏళ్లుగా ఎదురుచూస్తూ వచ్చిన యువకులు ఆ ఆశ నెరవేరదన్న నిశ్చయానికి వచ్చారు. మనమే ఎందుకు అభివృద్ధి చేసుకోకూడదన్న ఆలోచించగా 2012లో పరిష్కారం లభించింది. 'మిరుదొడ్డి ఉపాధ్యాయ సంఘం' స్వచ్ఛంద సంస్థను నెలకొల్పారు. తొలుత పది మంది ఉపాధ్యాయులు కలిసి ప్రారంభించగా ప్రస్తుతం ఆ క్రతువులో 45 మంది సభ్యులయ్యారు. వారంతా నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి తమవంతుకుగా ఆర్థిక సహాయాన్ని సంఘం ఖాతాలో జమ చేస్తుంటారు. అలా సంఘంలో జమ చేసిన మొత్తాన్ని వివిధ సేవా కార్యక్రమాలకు ఖర్చు చేస్తారు.

ఆరోగ్యానికి ప్రాధాన్యం.. తొలినాళ్లలో ప్రభుత్వ పాఠశాలలో ఆటల పోటీలు, సృజనను వెలికితీసే వివిధ పోటీలు నిర్వహిస్తూ విజేతలకు నిఘంటువులను, ఇతర ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రారంభించారు. తర్వాత పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను వెండి పతకాలతో ప్రోత్సహించారు. క్రమంగా సేవలను విస్తృతం చేశారు. గ్రామంలో సుమారు 50 నిరుపేద కుటుంబాలకు బియ్యం పంపిణీ, చికిత్స చేయించుకునే స్తోమత లేనివారికి చికిత్స చేయించడం, దీర్ఘకాలికంగా వ్యాధితో బాధపడుతున్న కుటుంబాలకు నిత్యావసర సరకులతో పాటు బియ్యం అందజేయడం లాంటి కార్యక్రమాలు ప్రతి నెలా చేపడుతున్నారు.



విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

చేపట్టిన సేవా కార్యక్రమాలు: ✤ మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో తల్లిదండ్రులు లేని అనాథ విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

✤ గ్రామంలో నిరుపేదలైన ముగ్గురు పిల్లల్ని గుర్తించిన ఉపాధ్యాయులు సంఘం నిధులతో ఉన్నత చదువులు చదివించేందుకు ముందుకొచ్చారు.

✤ తమ సేవలు మండల కేంద్రానికే పరిమితం కాకుండా మండల వ్యాప్తంగా విస్తరించారు. 2014లో మండల స్థాయిలో అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. జిల్లాస్థాయి విద్యాశాఖాధికారులు, ప్రజాప్రతినిధులు సమక్షంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం ద్వారా విద్యాభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు.

✤ మండలంలోని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు ఏటా రాత పుస్తకాలు, పెన్నులు, పలకలు పంపిణీ చేస్తున్నారు. అంతేకాకుండా ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన స్వచ్ఛభారత్ పిలుపుతో గ్రామంలో పరిశుభ్రతకు పాటుపడుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించే హరితహారంలో భాగంగా మొక్కలు నాటిని వాటిని సంరక్షిస్తున్నారు.



ప్రాథమిక పాఠశాలలో మొక్కలు నాటుతున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

ప్రాంత అభివృద్ధే ధ్యేయం

- శ్రీనివాస్, మిరుదొడ్డి ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు

ఈ ప్రాంత విద్యార్థుల అభివృద్ధి, ఆరోగ్య పరిరక్షణకు పాటుపడాలన్నదే మా ధ్యేయం. సంపాదించిన దానిలో కొంత నిరుపేద విద్యార్థుల విద్యాభివృద్ధికి, గ్రామాభివృద్ధికి వెచ్చించాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నాం. సేవలను నిరంతరం కొనసాగించడంతో పాటు మరింత విస్తృతం చేయాలన్న సంకల్పంతో ఉన్నాం.

వ్యక్తిత్వ వికాసానికి సోపానం..



కొత్త అంశాలతో సమ్మిళితం
విద్యార్థుల ఆలోచనల్లో మార్పు
క్రమశిక్షణకు మరింత దోహదం

మనందరికి ప్రార్థన అనగానే ముందుగా గుర్తుకొచ్చేవి అటెన్షన్.. స్టాండ్ ఎట్ఈజ్ అనే రెండు పదాలే.. బాల్యంలో క్రమశిక్షణకు ప్రధానమైన ఈ రెండు అప్పటి సంగతులను మన కళ్ల ముందుంచుతాయి.. ఆలస్యంగా వెళ్లిన రోజులు మదిలో మెదలుతాయి.. ఉపాధ్యాయుల ఆప్యాయతతో కూడిన మందలింపులు ఆలోచించేలా చేస్తాయి.. వందేమాతర గీతం, ప్రతిజ్ఞ, జాతీయగీతం గుర్తుకొస్తాయి.. అయితే ఉమ్మడి జిల్లాలో ఇప్పుడు ప్రార్థన స్వరూపం పూర్తిగా మారిపోయింది. నేడు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేలా నిర్వహిస్తుండటం విశేషం.

స్నానం.. దేహాన్ని శుద్ధి చేస్తుంది..
ధ్యానం.. బుద్ధిని శుద్ధి చేస్తుంది..
ప్రార్థన.. ఆత్మను శుద్ధి చేస్తుంది..
– పెద్దలు చెప్పిన మాటలు ఇవి..

న్యూస్‌టుడే, గజ్వేల్ గ్రామీణ

విద్యార్థులను మానసికంగా సన్నద్ధం చేసేది బడిగంట. మొదటి గంట కొట్టగానే విద్యార్థులు సిద్ధమవుతారు. ఇక రెండో గంట కొట్టగానే ప్రార్థన ప్రారంభమవుతుంది. ఇది అందరికీ తెలిసిన విషయమే. వందేమాతరం గీతంతో ప్రారంభమై ఆ తర్వాత తెలంగాణ రాష్ట్ర గీతం జయజయహే తెలంగాణ, ప్రతిజ్ఞలు ఉంటాయి. త్రిభాషా సూత్రం ప్రకారం సోమ, మంగళవారాలు తెలుగులో బుధ, గురువారాలు హిందీలో శుక్ర, శనివారాలు ఆంగ్లంలో చేపడుతుండటం విశేషం. ఉమ్మడి జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, మెదక్, రామాయంపేట, తూప్రాన్ తదితర ప్రాంతాల్లో ఈ కొత్త ఒరవడి ప్రస్తుతం కొనసాగుతోంది.



అహ్మదీపూర్ పాఠశాలలో ప్రార్థనకు హాజరైన విద్యార్థులు

వార్తల సమాహారం..



జిల్లాలోని అన్ని సర్కారు పాఠశాలల్లో దిన పత్రికలను తెప్పించి వాటిలోని ముఖ్యమైన వార్తలను విద్యార్థులతో చదివిస్తున్నారు. వారి పఠన సామర్థ్యం పెరగాలనే సదుద్దేశంతో పాటు వేదిక మీదికి ఎక్కేందుకు కలిగే భయం పోగొట్టుందుకు ఇది ఎంతో ఉపయోగపడుతుంది. గజ్వేల్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో అనిత అనే విద్యార్థిని వేదిక మీదికి ఎక్కాలంటే భయపడుతూ ఉండేది.. అలాంటిది ఈ కార్యక్రమం ద్వారా మెల్లిమెల్లిగా ఆమెలోని బెరుకుతనాన్ని దూరం చేయడానికి ఉపాధ్యాయులు చొరవ చూపారు. ఇప్పుడు ఆమె అన్ని కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తుండటం గమనార్హం. ఇక అన్ని విషయాలు తెలియజేసేందుకు సైతం ఇది దోహదపడుతోంది. జాతీయ, అంతర్జాతీయ, రాష్ట్రీయ వార్తలను చదువుతున్నారు. దీనివల్ల సామాజిక అంశాల పట్ల ఆసక్తి, అవగాహన పెరుగుతుంది. రోజూ రోజు ఒక్కో తరగతి నుంచి ఒక్కో విద్యార్థి తెలుగు, ఆంగ్లం, ప్రతికల నుంచి వార్తలు చదివి వినిపిస్తారు.

చరిత్రలో నేటి రోజు

'ప్రతి మనిషికి ఒక రోజు వస్తుంది' అనేది సామెత. చరిత్రలోని మహనీయుల జయంతులు, వర్ధంతులు, శాస్త్రవేత్తల నూతన ఆవిష్కరణలు, చరిత్రలో జరిగిన ఘటనలు, మహనీయుల గురించి ఆ రోజు యొక్క విశిష్టతను ప్రధానోపాధ్యాయుడు, లేదా సంబంధిత ఉపాధ్యాయులు ప్రార్థనలో సమయంలో వివరిస్తున్నారు. పర్యావరణ పరిరక్షణ జాతీయ నులిపురుగుల దినోత్సవం, సైన్స్‌డే వంటి విషయాలను విద్యార్థులకు వివరిస్తున్నారు. కొత్త విషయాలను తెలుసునేందుకు ఆసక్తి చూపుతున్నారు.. కొన్ని చోట్ల విభిన్న ఆలోచనలతో ప్రార్థన చేపడుతున్నారు.. శతక పద్యాలను చదివిస్తున్నారు.. ఆంగ్ల పదాలను చెప్పిస్తున్నారు.. ఇలా తమదైన పంథాలో కొనసాగిస్తున్నారు.. గజ్వేల్‌లోని ఓ ప్రభుత్వ పాఠశాలలో నిత్యం తెలుగు ఉపాధ్యాయుడి ఆధ్వర్యంలో పాఠ్యాంశాల్లోని పద్యాలు చదివిస్తున్నారు. దీనివల్ల విద్యార్థులు వాటిని కంఠస్థం చేయాల్సిన అవసరం లేకుండానే వారికి వచ్చేస్తున్నాయి. శతకాలు నైతిక విలువలను పెంపొందిస్తాయన్న కోణంలో, నీతితో వ్యవహరించాలన్న ఆలోచనతో చేపట్టిన ఈ కార్యక్రమం సత్ఫలితాలను ఇస్తుండటంతో దీన్ని కొనసాగిస్తున్నారు.

✦ ములుగు మండలంలోని ఓ పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడు చొరవ చూపి పిల్లలతో రోజూ ఆంగ్ల పదాలను పల్లె వేయిస్తున్నారు. వాటి అర్థాలను వివరిస్తూ ఎలా పలకాలో, ఎక్కడ వాడాలో వివరిస్తున్నారు. వ్యాఖ్యాల తయారీలో వినియోగం గురించి వివరిస్తుండటంతో ఆంగ్ల భాషలో నైపుణ్యం సాధించేందుకు ఇది దోహదపడుతోంది. రోజూ 20 పదాల వరకు ఇందులో నేర్పిస్తున్నారు. ఈ విధానం జిల్లావ్యాప్తంగా పలు పాఠశాలల్లో కొనసాగిస్తున్నారు.

నేటి ప్రశ్న.. నిన్నటి జవాబు

ప్రార్థన విజ్ఞాన సంబంధ విషయాలను, చరిత్రను తెలిపే వేదికగా నిలుస్తుంది. పోటీ పరీక్షలకు అవసరమైన పలు విషయాలను తెలుసుకునేందుకు ఉపయోగపడుతుంది. నిత్యం ఒక ప్రశ్న అడుగుతున్నారు. మరుసటి రోజు విద్యార్థులు తెలుసుకొని జవాబు చెప్పాల్సి ఉంటుంది. చరిత్ర, విజ్ఞానశాస్త్రము, శాస్త్ర సాంకేతిక రంగాలకు చెందిన ప్రశ్నలు, కవులు, రచనలు, తదితర విజ్ఞాన సంబంధ ప్రశ్నలు ఉండేలా జాగ్రత్త వహిస్తున్నారు. ప్రశ్నకు సమాధానం తెలుసుకోవాలనే ఆసక్తి విద్యార్థుల్లో పెరిగేందుకు ఇది దోహదపడుతుంది.



ఏర్పాటు చేసిన బోర్డు ..

ప్రస్తుతం ప్రార్థనలో ప్రధాన అంశాలు

- వందేమాతం
- జయజయహే తెలంగాణ
- ప్రతిజ్ఞ
- నేటి వార్తలు
- నేటి ప్రశ్న– నిన్నటి ప్రశ్నకు జవాబు
- సూక్తి
- చరిత్రలో నేటి రోజు
- జాతీయ గీతం

మంచిమాట



మంచిమాట ప్రార్థనలో తప్పనిసరి చేశారు. పెద్దలు చెప్పిన మాటలను ఒకసారి మననం చేసుకోవడం నైతిక విలువలను పెంపొందించుకునే అవకాశం ఉంటుంది. రామకృష్ణ పరమహంస, వివేకానంద, గాంధీజీ అబ్దుల్‌కలాం తదితర మహనీయుల సూక్తులు వినడం వల్ల వాటి నుంచి ప్రేరణ పొందుతారన్న ఆలోచనతో దీన్ని ప్రవేశపెట్టారు.



అహ్మదీపూర్ పాఠశాల



మార్చ్ ఫాస్ట్ చేస్తున్న విద్యార్థులు

అన్ని అంశాలపై అవగాహన

ప్రార్థనలో కొత్త అంశాలను చేర్చడంతో విద్యార్థులు ఆలోచనలో మార్పు కలుగుతుంది. నిత్యం ఓ కొత్త అంశం నేర్పిస్తున్నారు. పుస్తకాల గురించి తెలియజేస్తూ విషయజ్ఞానం పెరిగేలా ఉపాధ్యాయులు అవగాహన కల్పిస్తున్నారు. స్థానిక అంశాల నుంచి అంతర్జాతీయ అంశాల వరకు వివరిస్తున్నారు. మెదక్, సిద్దిపేట జిల్లాలలో చాలా పాఠశాలల్లో ఈ కార్యక్రమం ప్రణాళిక ప్రకారం చక్కగా నిర్వహిస్తున్నారు. ఉన్నత పాఠశాలల్లో అయితే తప్పనిసరి.



భయం పోగొట్టేందుకే

హరిత, ప్రధానోపాధ్యాయురాలు, బూర్గుపల్లి

ఆంగ్లంలో రాయాలన్నా, చదవాలన్న విద్యార్థులు భయపడుతుంటారు. మా పాఠశాలలో రోజూ 20 పదాలు చెప్పించడం వల్ల వారిలో పదజాల అభివృద్ధి చెందుతుంది. భాషపై పట్టురావాలంటే పదాలు తెలిసి ఉండాలి. క్రమం తప్పకుండా చేయించడం వల్ల పిల్లలు చక్కగా రాస్తున్నారు.

నీతిని గ్రహించేలా..

రాజిరెడ్డి తెలుగు పండితుడు, బెజగాము



ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థిలో క్రమశిక్షణ, నైతికత, మానవీయ విలువలు పెంపొందాలి. శతకాలు సమాజ జీవన ప్రతిబింబాలు. మంచి, చెడులను, మానవత్వాన్ని, నీతిని, ధర్మాన్ని విద్యార్థులకు తెలపాలన్న కోరికతో మా పాఠశాలలో నిర్వహిస్తున్నాం. పద్యాల వల్ల నీతిని గ్రహించి భవిష్యత్తుకు బాటలు వేసుకుంటారు.

కొత్త అంశాలపై ఆసక్తి..

కరీమోద్దీన్, ప్రధానోపాధ్యాయుడు, అహ్మదీపూర్




ప్రార్థన అనేది ఒక మొక్కుబడిగా చేసేది కాదు. ప్రతీ ఒక్కరూ క్రమశిక్షణగా చేయాలి. విద్యార్థులను ఒకేసారి నిత్యం ప్రార్థనలోనే చూస్తాం. వివిధ అంశాల ద్వారా విద్యార్థిలో కొత్త విషయలు తెలుసుకోవాలనే తపన, ఆసక్తి పెరుగుతుంది. పరిశోధించి తెలుసుకునే ఉత్సాహం పెరుగుతుంది.

వినదగునెవ్వరు చెప్పిన..
అజ్ఞాత శ్రీమంతుడి పాఠాలు!

నగరం గురించి ఏ మాత్రం తెలియని ఒక కుర్రాడు నెల రోజుల్లో నాలుగు ఉద్యోగాలు సంపాదించగలిగాడు. తను చదివిన చదువుకు తగ్గ కొలువా? నచ్చిన ఉద్యోగమా అని చూడలేదు. చేతిలో రూ.500 మాత్రమే ఉన్నాయి.. నెలరోజులు ఊరు కానీ ఊరులో బతకాలి. శ్రీమంతుల కుటుంబం నుంచి వచ్చినా తమ కుటుంబ కట్టుబాట్ల మేరకు గుర్తింపును వెల్లడించకూడదు. ఇటువంటి పరిస్థితుల్లో గుజరాత్ నగల వ్యాపారి కుటుంబం నుంచి వచ్చిన హితార్థ్ ఘన్‌శ్యాం డోలాకియా తను అనుకున్నది సాధించాడు. నెల రోజుల ప్రయాణంలో మనకు ఎన్నో పాఠాలను చెప్పకనే చెప్పి వెళ్లాడు.

– ఈనాడు, హైదరాబాద్




హితార్థ్



ప్రయత్నం ఆపొద్దు

కొన్నాళ్లు ప్రయత్నించాక ఉద్యోగం దొరకలేదని నిరుత్సాహ పడి కొలువుల వేట మానేస్తారు. ప్రయత్నం ఆపొద్దు అనేది గుజరాత్ కుర్రాడు నేర్పిన పాఠం. ఊరు నుంచి నగరానికి వచ్చాక సిటీలో రెండురోజు జాలీగా గడిపాక.. ఇలా వాయిదాలు వేయకుండా తొలిరోజు నుంచే ప్రయత్నం మొదలెట్టాలి. మీ ప్రయత్నాన్ని చూసి ఇతరులు చేయూతనిచ్చే అవకాశం ఉంది.

ఖాళీగా ఉండొద్దు..



నగరంలో చాలామంది కుర్రకారు ఉద్యోగాలు దొరక్క ఖాళీగా ఉంటున్నారు. నచ్చిన కొలువు వచ్చేదాక ఎదురుచూసే వారు మరికొందరు. ఖాళీగా కుటుంబానికి భారమవుతున్నామనే దిగులు ఉన్నా.. అడుగు ముందుకు పడక సతమతమయ్యే వారు ఎందరో. ఖాళీగా ఉండకుండా మొదట దొరికిన ఉద్యోగంలో చేరాలి. అక్కడి అనుభవం.. పరిచయాలు కోరుకున్న కొలువుకు బాటలు పడేలా చూసుకోవాలి. నచ్చకపోతే మనసు చంపుకుని పనిచేయాల్సిన పనిలేదు. మరో ఉద్యోగంలో చేరొచ్చు.

మౌనం వీడాలి



చిన్న కుటుంబాలు.. బడి, కళాశాల తప్ప మరో ప్రపంచం తెలియని చాలా మంది కుర్రాళ్లు చదువులో ముందుంటే ఫర్వాలేదు. ప్రాంగణ నియామాల్లోనే కొలువులు దొరుకుతాయి. అందరూ చదువుల్లో చురుగ్గా ఉండకపోవచ్చు కదా! బయట ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నప్పుడు ఎక్కువ మందితో మాటలు కలపాలి. పరిచయాలు పెంచుకోవాలి. ఆటోడ్రైవర్, క్యాబ్‌డ్రైవర్, టీకొట్టు ఇలా ఎవరైనా కావొచ్చు. సమాచారం కోసం వారిని సంప్రదించడంలో తేలికభావం వద్దు. గుజరాత్ కుర్రాడికి సలహా ఇచ్చింది ఓ ఆటోవాలా.



ఉన్న చోటు నుంచి..

ఉద్యోగ వేటలో ఉన్న చోటనే అంటే కొన్నిసార్లు దొరకపోవచ్చు.. అవసరమైతే ఊరు వదిలి.. నగరం దాటి వెళ్లడానికి సిద్ధపడాలి. సొంత నగరంలో చిన్న ఉద్యోగాలంటే నామోషిగా భావిస్తుంటారు. అడ్డంకుల్ని తెలియని ప్రాంతంలో అధిగమించవచ్చు. అక్కడి భాష నేర్చుకోవడం వంటి కొత్త నైపుణ్యాలను అలవర్చుకోవచ్చు. హైటెక్‌సిటీలో ఉద్యోగాల కోసం నాగోల్‌లో ఉండి ప్రయత్నించే బదులు.. మణికొండలో ఉంటే ప్రయాణభారం తగ్గుతుంది. అమీర్‌పేటలో ఉంటే ఐటీ రంగంలో పోకడలు.. ఏ విభాగంలో ఉద్యోగాలు ఉన్నాయనే విషయాలు సులభంగా తెలుస్తాయి. ఇక్కడే అద్దె గదుల్లో, హాస్టల్‌లో ఉంటున్నప్పుడు ప్రాంతం మారడానికి కూడా సిద్ధపడక వెనకబడి పోతుంటారు.

నైపుణ్యాలు మెరుగు



ఉద్యోగాలకు కావాల్సింది కమ్యూనికేషన్ స్కిల్స్. ఈ రోజుల్లో భాషానైపుణ్యాలు చాలాముఖ్యమని ఇప్పటికే ఉద్యోగవేటలో ఉన్నవారికి అనుభవంలోకి వచ్చి ఉంటుంది. డిగ్రీలు లేకపోయినా.. చేతిలో సర్టిఫికెట్లు లేకపోయినా నైపుణ్యం ఉంటే సిటీలో కొలువు సంపాదించడం పెద్ద కష్టమేమి కాదని మరోసారి నిరూపితం అయ్యింది. గుజరాత్ కుర్రాడు హిందీ, ఇంగ్లీష్ బాగా మాట్లాడటంతో కొలువు సంపాదించడానికి ఎక్కువ శ్రమ పడాల్సిన అవసరం రాలేదు.



గుర్తుంచుకోవాలి

ప్రతి దశలో ఎవరో ఒకరు ఏదో రూపంలో సాయపడుతూనే ఉంటారు. ప్రతిఫలం ఆశించకుండా చూసే వారే ఎక్కువ శాతం ఉంటారు. సమాజంలో మంచి ఇంకా బతికే ఉందని వీరు గుర్తు చేస్తుంటారు. ఇది మున్ముందు కొనసాగాలంటే ఇలాంటి వ్యక్తులను మర్చిపోకుండా.. ఉన్నతస్థానంలో ఉన్నప్పుడు అవసరమైన వారికి మీకు తోచిన రూపంలో సాయం చేయడానికి ప్రయత్నించాలి.





అమీర్‌పేట ప్రధాన రహదారిలో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన కుండీల్లో మొక్కలు ఎండిపోయాయి. అక్కడే మరోచోట రహదారికి అడ్డంగా విభాగినుల వద్ద ప్రయాణాలు సాఫీగా సాగకుండా పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. నిర్వహణలో లోపాల వల్ల అవసరమైన చోట లేకుండా.. అనవసరమైన చోట పెరుగుతున్నాయి.

మారాలి.. మారి తీరాలి

ఏటా రూ.70 కోట్లకు పైగానే జరిమానాలు ● పాయింట్ల నేపథ్యంలో మార్పు అవశ్యం

ఈనాడు, హైదరాబాద్

శిరస్త్రాణం ధరించకుండా వాహనం నడిపినందుకో.. ఎర్రలైటు పడినా సిగ్నల్ జంపింగ్ చేసినందుకో.. మద్యం తాగి వాహనం నడుపుతూ దొరికినందుకో.. ఇలా ఉల్లంఘన ఏదైనా కానీ రాజధాని నగరంలోని మూడు కమిషనరేట్ల పరిధిలో వాహనదారులు ప్రతి రోజు చెల్లిస్తున్న సగటు జరిమానా ఎంతో తెలుసా..? దాదాపు రూ.9లక్షల పైమాటే. ఈలెక్కన ఏటా సుమారు రూ.70 కోట్లకుపైగానే జరిమానాల రూపంలో ఉల్లంఘనుల జేబుల్లో నుంచి ప్రభుత్వ ఖజానాకు జమ అవుతోంది. ప్రస్తుతం పాయింట్ల నమోదుతో జరిమానాలకు తోడు అవీ తోడైతే లైసెన్స్ పైనే ప్రభావం చూపనుంది. ఈనేపథ్యంలో వాహనదారులు మారి తీరాల్సిన అవసరం ఏర్పడింది.

మోటారు వాహనాల చట్టం నిబంధనల్ని ఉల్లంఘించే వాహనదారులపై దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో మాత్రమే పాయింట్ల విధానాన్ని అమలు చేస్తున్నారు. ఈ విధానం కేంద్ర మోటారు వాహనాల చట్టంలోనే ఉన్నా దేశంలో ఇంకా ఎక్కడా అమల్లో లేదు. తొలిసారిగా తెలంగాణాలో.. అదీ హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధిలోనే ఈనెల నుంచి అమల్లోకి వచ్చింది. దీంతో జరిమానాలకు తోడు లైసెన్స్‌దారులపై పాయింట్లను నమోదు చేస్తున్నారు. రెండేళ్లలో 12 పాయింట్లు నమోదైతే లైసెన్స్ రద్దు చేసే సన్నాహాల్లో ట్రాఫిక్ యంత్రాంగం కసరత్తు చేస్తోంది. ఈక్రమంలో వాహనదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటివరకు ఉల్లంఘనలకు పాల్పడితే జరిమానాలు చెల్లించి బయటపడే పరిస్థితి ఉండేది. ఇకపై కూడా అలా బయటపడతామనుకుంటే కుదరదు. మొదటికే మోసం రావొచ్చు. ఉల్లంఘనలు హద్దు మీరితే మీరు వాహనం నడిపే అవకాశముండదు. అయినా సరే అని మొండికేస్తే ఊచలు లెక్కించడం ఖాయం. అందుకే వాహనాన్ని రోడ్డు పైకి తీసుకొచ్చే ముందే తగిన స్పృహ ఉండాలి.

ప్రస్తుతమైతే రెడ్‌హ్యాండెడ్‌గా చిక్కితేనే..

ప్రస్తుతం ఈ మూడు కమిషనరేట్ల పరిధిలో కాంటాక్టు, నాన్‌కాంటాక్టు పద్ధతిలో జరిమానాలు విధిస్తున్నారు. ఉల్లంఘనుల్ని గుర్తించినప్పుడు రహదారులపైనే ఆపి జరిమానా విధించడాన్ని కాంటాక్ట్ చలానాగా.. వాహనదారుడిని ఆపకుండానే ట్రాఫిక్ సిబ్బంది చేతిలోని కెమెరానో లేక కూడళ్లు, ప్రధాన రహదారులపై ఉన్న సీసీ కెమెరాలు చిత్రీకరించే ఉల్లంఘనల్ని కంట్రోల్ రూంలోని సిబ్బంది సంగ్రహించడం ద్వారానో జరిమానా విధించడాన్ని నాన్‌కాంటాక్ట్ చలానాగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం పాయింట్ల విధానం అమలైన తర్వాత ఈ రెండు విధాలా జరిమానాలు యథావిధిగానే ఉండనున్నాయి. వీటికితోడు ఉల్లంఘనుల్ని గుర్తించి వారి లైసెన్స్‌లపై పాయింట్లను



నమోదు చేస్తున్నారు. ఇప్పటికైతే కేవలం వాహన తనిఖీల సమయంలో గుర్తించిన ఉల్లంఘనులపై మాత్రమే పాయింట్లను నమోదు చేస్తున్నారు. ఎందుకంటే.. పాయింట్లను నమోదు చేసేది వాహనదారుడి లైసెన్స్ పైనే కాబట్టి అలా చేస్తున్నారు. ఉల్లంఘనకు పాల్పడిన వాహనదారుడిని గుర్తించినప్పుడు మాత్రమే అతడి లైసెన్స్‌పై పాయింట్లు నమోదు చేసే అవకాశముంది. ఒకవేళ ఒకరి వాహనాన్ని మరొకరు తీసుకెళ్లి ఉల్లంఘనకు పాల్పడితే.. ప్రత్యక్షంగా అతడిని గుర్తించకుండా లైసెన్స్‌పై పాయింట్లను నమోదు చేయడం సరికాదు కాబట్టి ఇలా చేస్తున్నారు. కానీ సమీప భవిష్యత్తులో నాన్‌కాంటాక్ట్ పద్ధతిలోనూ పాయింట్లను నమోదు చేసే అవకాశముండటంతో ఇప్పటినుంచే వాహనదారులు జాగ్రత్త పడటం అలవాటు చేసుకోవాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

మోటారు వాహనాల చట్టం ఉల్లంఘనలు ఇలా..

నగర కమిషనరేట్ పరిధిలో ఇదీ పరిస్థితి..

ఏడాది	కేసులు	జరిమానాలు
2014	30,47,169	రూ. 35,75,46,610
2015	30,23,086	రూ. 32,25,45,023
2016	30,87,499	రూ. 31,02,61,375
2017 జూన్ వరకు	13,46,248	రూ. 10,98,55,915

సైబరాబాద్, రాచకొండ పరిధిలో..

కమిషనరేట్	కేసులు	జరిమానా
సైబరాబాద్	12,40,027	రూ. 28,65,81,355
రాచకొండ	2,61,643	రూ.10,23,79,750

(గత ఏడాది గణాంకాలు మాత్రమే)



చిన్నప్పటి నుంచి పిల్లలు అడిగిందల్లా కొని ఇవ్వడం వారి భవిష్యత్తుకే ముప్పుగా మారుతోంది. దాని ధరతో సంబంధం లేకుండా చాలామంది పిల్లలు వారికి నచ్చిన వస్తువునల్లా కొనిమ్మని తల్లిదండ్రులను పట్టుపడుతుంటారు. వాటి అవసరం ఏమేరకు ఉందో లెక్కించకుండా పిల్లలు అడిగారని చాలామంది తల్లిదండ్రులు కొనేయడం పరిపాటిగా మారింది. దీనితో పిల్లలు పెడదారి పట్టడానికి ఎక్కువ ఆస్కారం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. పిల్లలు చిన్నచిన్న కష్టాలు ఎదుర్కొనేలా చేయాలని వారు వివరిస్తున్నారు. చాలామంది పిల్లలకు పొదుపు అనేదే తెలియట్లేదని, చిన్నవయస్సు నుంచే ఆ పాఠాలు నేర్పితే భవిష్యత్తులో వారికి అది మంచి అలవాటు అవుతుందని వారు వెల్లడిస్తున్నారు.



చిన్న వయస్సుకి పొదుపు పాఠాలు!

- అడిగిందల్లా ఇవ్వడం మంచిది కాదు
- వద్దన్నా వినేలా తర్ఫీదు ఇవ్వాలి
- చిన్న చిన్న కష్టాలు ఎదుర్కొనేలా చేయాలి

ఈనాడు, హైదరాబాద్

హైదరాబాద్ మహా నగరానికి విద్య, ఉద్యోగరీత్యా వస్తున్న వారే ఎక్కువ. ఉదయం నుంచి రాత్రివరకు విధుల్లో పూర్తిగా నిమగ్నమవ్వడం.. ఇంటికి రావడంతో అలసిపోయి పిల్లల గురించి పట్టించుకోకుండా ఉండేవారే నగరంలో ఎక్కువగా ఉంటున్నారు. కొందరు మాత్రం ఏ కొద్ది సమయం ఖాళీగా ఉన్నా కుటుంబసభ్యులతో గడుపుతున్నారు. పిల్లలు అడిగిందల్లా కొనిఇవ్వడంలో మాత్రం ఆచితూచి చూసేవారు తక్కువే. ఒకరిని చూసి మరొకరు వస్తువు ధరతో సంబంధం లేకుండా కొని ఇచ్చే అలవాటు పిల్లలకు చేసేస్తున్నారు. ఇదే వారికి ముప్పు తీసుకొస్తోంది. బ్యాంకులు, పోస్టాఫీసుల్లో పిల్లల పేరున పొదుపు ఖాతా తెరచి వారికి పొదుపు చేయడం అలవాటు చేయాలని నిపుణులు వివరిస్తున్నారు. ప్రోత్సాహకంగా ఇచ్చిన నగదుని పిల్లలు పొదుపు చేసే విధానం అలవాటుగా మార్చాలని వారు పేర్కొంటున్నారు.

చిన్న వయస్సులోనే బైకులు.. ముప్పు

నిండా పదేళ్లు పూర్తి కాకుండానే పిల్లలకు ద్విచక్ర వాహనాలు కొని ఇచ్చేస్తున్నారు. వారికి లైసెన్స్ లేకుండానే సందుల్లో తొక్కుకుంటాడు అంటూ తల్లిదండ్రులు వత్తాసు పలుకుతున్నారు. అలా మొదలైన వారి ప్రయాణం ఏదో ఒకచోట దుర్ఘటనలకు దారితీస్తోంది. నగరంలో చాలామంది విద్యార్థులు ఈ తరహా ప్రమాదాలకు గురవుతున్నారు. చాలామంది తల్లిదండ్రులు పిల్లలకు నచ్చిన వాహనాలు కొని ఇచ్చేస్తున్నారు. ఇటీవల పలు ప్రమాదాలకు మైనర్లే కారణమవుతున్నట్లు పోలీసుల గణాంకాలు వివరిస్తున్నాయి.

పిల్లల చేతుల్లో ఖరీదైన చరవాణులు.. వద్దు

ఏమాత్రం ఖాళీ దొరికినా పిల్లలు చరవాణులతోనే ఆడుకుంటున్నారు. వీరు వినియోగించేవి అత్యంత ఖరీదైనవి కావడం విశేషం. చిన్నపిల్లలు ఏడిస్తే కూడా చరవాణిలో పాటలు పెట్టడం లేదా ఆటలాడుకొనేలా ప్రోత్సహించడం చాలామంది తల్లిదండ్రులు అలవాటు చేసేస్తున్నారు. పిల్లలను సంరక్షణ కేంద్రాల్లో రోజంతా ఉంచి.. సాయంత్రం వారిని ఇళ్లకు తీసుకొచ్చింది మొదలు 70శాతం మహిళలు వారికి చరవాణులు ఇస్తున్నట్లు ఇటీవల నగరంలో ఒక సర్వేలో తేలింది. పిల్లలకు ఆట వస్తువులు ఇవ్వకుండా చరవాణులే ఇవ్వడంతో వారికి వచ్చే ఇబ్బందుల గురించి తెలియకే ఇలా చేస్తున్నామని 40శాతం మంది మహిళలు తెలిపారు.



ట్యాబ్‌లలోనే పాఠాలు..?

నగరంలో చాలా ప్రైవేటు పాఠశాలలు హైటెక్ హంగులను ప్రదర్శిస్తున్నాయి. మూడు, నాలుగో తరగతుల్లో పిల్లలకు ట్యాబ్‌లను అలవాటు చేస్తున్నాయి. మా పాఠశాలలో హోమ్‌వర్కు ట్యాబ్‌ల్లోనే చేయాల్సి ఉంటుందని యాజమాన్యాలు వివరిస్తున్నాయి. దీంతో చిన్నవయస్సులోనే చరవాణులకు పిల్లలు అలవాటుపడిపోతున్నారు. అదే అలవాటుగా మారి పర్యవేక్షణ లేక ఇంటర్‌నెట్‌లో అందుబాటులో ఉండే నీలిచిత్రాలు, బొమ్మలు వారిపై ప్రభావం చూపి పెడదారి పట్టే ప్రమాదం ఉందని నిపుణులు వివరిస్తున్నారు. చదువుపై శ్రద్ధ తగ్గే ప్రమాదం ఉందంటున్నారు.

ఇలా చేస్తే మేలు..

- పుస్తకాలు, కథలు, పత్రికలు చదివించడం అలవాటు చేయాలి.



- ఇతర పిల్లలతో కలిసి ఆడుకునే వీలుంటే అందుకు కొంత సమయం కేటాయించాలి.



- పొదుపు పాఠాలు నేర్పాలి. వారిని ప్రోత్సహించేందుకు ఇచ్చే ప్రతి రూపాయి దాచుకొనే అలవాటు చేయాలి. వాటితోనే వారికి కావాల్సిన వస్తువులను కొనుగోలు చేయించాలి.



- చిన్న వయస్సు వారికి వాహనాలు కొని ఇవ్వడం మంచిది కాదు.
- ఇంట్లో చేసే పనుల్లో చిన్నచిన్నవి వారికి అప్పగించాలి. దగ్గరలోని దుకాణాలకు వారిని పంపించి కొనడం అలవాటు చేయాలి.
- చరవాణులు, కంప్యూటర్లకు పిల్లలను సాధ్యమైనంత వరకు దూరంగా ఉంచితే మంచిది.



మీ పిల్లల భవిష్యత్తు మీ చేతుల్లోనే..: సుధీర్‌కుమార్, వ్యక్తిత్వ వికాస నిపుణులు

నగరంలో చాలామంది తల్లిదండ్రులు.. తమ పిల్లలు అడిగిందల్లా కొనేస్తున్నారు. దాని విలువ, ఉపయోగం గురించి అవగాహన కల్పించకుండానే కోరికలు తీర్చేస్తున్నారు. కొనిపించుకున్న కొద్ది రోజులకే వాటిని పక్కన పడేస్తున్నారు. పిల్లల భవిష్యత్తు మంచిగా ఉండాలంటే వారు చిన్న చిన్న కష్టాలు ఎదుర్కొనేలా చూడాలి. అడిగిందల్లా ఇచ్చి వారిని ప్రమాదాల్లోకి నెడుతున్నారనే విషయాన్ని గుర్తించాలి. చాలామంది పిల్లలు.. తమ స్నేహితులను చూసి కోరికలు పెంచుకుంటున్నారు. వాహనం, ఖరీదైన చరవాణి ఇలా పలు వస్తువులను కోరిన వెంటనే ఇవ్వడంతో వారి భవిష్యత్తుని తల్లిదండ్రులే అంధకారంలోకి నెట్టేస్తున్నారని గుర్తించాలి.



కోరి వస్తోన్న కొలువు.. రారమ్మంటోన్న చదువు

మాదాపూర్ న్యూస్‌టుడే

కళాశాల చదువు ముగుస్తుందో.. లేదో.. తెలియగానే యువత ఉద్యోగాల కోసం వెతుకుతుంటారు. ప్రాంగణ నియామకాలు.. నేరుగా దరఖాస్తు చేయడం.. ఇలా ఏ అవకాశాన్ని వదలరు. చదువు ముగిసేలోగానే కొలువును కోరుకుంటుంటారు.. అయితే.. ఇటీవల నగర యువత ఆలోచనలో మార్పు కనిపిస్తోంది..

డిగ్రీ పూర్తికాగానే ఏదైనా మంచి కంపెనీలో ఉద్యోగం చేయాలి.. పట్టా చేతికి రాగానే బహుళజాతి కంపెనీలో చేరిపోవాలి.. ప్రాంగణ నియామకాల్లో కొలువు వెతుక్కుంటూ వస్తే ఎగిరి గంతెయ్యాలి.. అనుకునే విద్యార్థులు తగ్గుతున్నారు. ప్రస్తుతం చాలా మంది డిగ్రీతో వచ్చే ఉద్యోగాలపై ఆసక్తి చూపడం లేదు. ఉన్నత చదువులకు వెళ్లేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఏడాదికి రూ. 15 నుంచి 20 లక్షల వేతనాల జాబ్ ఆఫర్లను కూడా కాదనుకొని తమకు ఆసక్తి ఉన్న కోర్సుల్లో పీజీ, పీహెచ్‌డీ చేసేందుకు పోటీపడుతున్నారు. తాము ఎంచుకున్న కోర్సులో పూర్తిస్థాయి పట్టుసాధించాలనే తపనతో ఉన్నత చదువులకు వెళ్తున్నారు. ట్రిపుల్‌ఐటీ, ఐఐటీ, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఉన్నత చదువులే లక్ష్యంగా మెరుగైన భవిష్యతుకు బాటలు వేసుకుంటున్నారు. కొందరైతే కుటుంబ ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో వచ్చిన ఉద్యోగం వదులుకోక కొన్నాళ్లపాటు అక్కడి పనిచేస్తున్నారు. ఆర్థికంగా నిలదొక్కుకున్నాక ఉద్యోగం మానుకొని ఉన్నత చదువులకు విదేశాలకు వెళ్తున్నారు. డిగ్రీ స్థాయిలో పరిశోధనలపై ఆసక్తి పెంచుకుంటున్న యువత ఆయా రంగాల్లో మరింత జ్ఞానం పెంచుకునేందుకే ఉన్నత చదువుల వైపు మొగ్గుచూపుతున్నారు.

బోధనపై ఎక్కువ ఆసక్తి

ఉన్నత చదువులకు వెళ్తున్న యువతలో అధిక శాతం బోధన రంగంలో స్థిరపడేందుకు ఇష్టపడుతున్నారు. పీజీ, పీహెచ్‌డీ చేశాక మంచి విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేయాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకుంటున్నారు. తాము నేర్చుకున్న విద్యను, జ్ఞానాన్ని నలుగురికి పంచాలనుకుంటున్నారు. డిగ్రీ, పీజీ, పీహెచ్‌డీ.. ఇలా ఉన్నత చదువులకు క్యాంపస్‌లో దాదాపు పదేళ్లు గడుపుతున్న యువత చదువులయ్యాక అక్కడే అధ్యాపకులుగా పనిచేసేందుకు సిద్ధమవుతున్నారు. పై చదువులపై తమ పిల్లలు చూపుతున్న ఆసక్తిని తల్లిదండ్రులు ప్రోత్సాహం అందిస్తున్నారు.

ఆలోచనలకు 'అంకుర'ం

సాంకేతిక విద్యార్థులు మాత్రం డిగ్రీస్థాయిలో పరిశోధనల వైపు దృష్టిసారిస్తున్నారు. డిగ్రీ పూర్తికాగానే సమాలోచనలు జరిపి తోటి స్నేహితులతో కలిసి అంకుర సంస్థల ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ముఖ్యంగా కంప్యూర్‌సైన్స్ రంగంలో ఉన్న యువత సరికొత్త మొబైల్ అప్లికేషన్స్, సాఫ్ట్‌వేర్ ఆవిష్కరణలను వెలుగులోకి తీసుకవచ్చేందుకు అంకిత భావంతో కష్టపడుతున్నారు. ఇలా విద్యార్థులు డిగ్రీ అయ్యాక ఉద్యోగంలో చేరడం కంటే ఉన్నత చదువులు లేదా సొంతంగా వ్యాపారం ప్రారంభించాలనే ఆశయంతో ఉంటున్నారు.

బోధన రంగంలో ఆసక్తి: సౌజన్య పొన్నపల్లి, బీటెక్, ట్రిపుల్‌ఐటీ



ట్రిపుల్‌ఐటీలో పరిశోధనలు, అకడమిక్స్ రెండింటికి ప్రాధాన్యం ఇస్తారు. ప్రాంగణ నియామకాల్లో నాకు ఓ బహుళ జాతి కంపెనీలో మంచి ఉద్యోగం వచ్చింది. ఏడాదికి రూ.22 లక్షల వేతనం. బోధనపై ఆసక్తి ఉండటంతో పీహెచ్‌డీ చేయాలనే లక్ష్యంతో ఉన్నాను. అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్‌లో ఎంఎస్, పీహెచ్‌డీ సీటు వచ్చింది.

అమెరికాలో ఉన్నత చదువులు: ప్రియదర్శిరథ్, ట్రిపుల్‌ఐటీ



మాది జార్ఖండ్. అమ్మనాన్న వైద్యులు. బయాలజీ సబ్జెక్టుపై ఆసక్తి లేకపోవడంతో కంప్యూటర్‌సైన్స్ వైపు వచ్చాను. మా తల్లిదండ్రులు నాకు ఇష్టమైన కోర్సును ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఇచ్చారు. ఇష్టపడి చదవటంతో నేను బీటెక్ ఈసీఈలో బంగారు పతకం సాధించగలిగాను. అమెరికాలోని ఓ ప్రముఖ విశ్వవిద్యాలయంలో ఎంఎస్ సీటు వచ్చింది.

ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ చేస్తా: కౌత్సవ్‌సేన్‌గుప్తా, ట్రిపుల్‌ఐటీ



ఎంటెక్ సీఏఎస్ఈ కోర్సు చేశాను. బంగారు పతకం సాధించా. ఇది నాకు రెట్టింపు ఉత్సాహాన్ని నిచ్చింది. ఐఐటీ ముంబయిలో పీహెచ్‌డీ సీటు వచ్చింది. పీహెచ్‌డీ అయ్యాక విద్యాబోధన చేయాలని ఉంది. మా స్వస్థలం కోల్‌కత్తా. నాన్న విశ్రాంతి ఉద్యోగి. అమ్మ గృహిణి. డిగ్రీలో చేరిన ఏడాది నుంచి ప్రణాళికాబద్ధంగా చదివితే మంచి ఫలితం వస్తుంది.







నంబరు దాచిపెట్టు... చలానాకు మస్కా కొట్టు..

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన సమయంలో సీసీ కెమెరాల ద్వారా కేసులు బుక్ చేయడంతో పాటు... పాయింట్లు విధిస్తుండటంతో వాహన చోదకులు కొత్త దారులు వెతుక్కుంటున్నారు. వాహనాలపై నంబర్లను కనిపించకుండా చేయడమో... ఏదో ఒక అక్షరాన్ని చెరిపివేయడమో చేస్తున్నారు.



ప్రతిభ

ముఖ్యమైన తేదీలు

★ ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో పోస్టులకు: 9 సెప్టెంబరు
★ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ పోస్టులకు: 12 సెప్టెంబరు
★ వైద్య విధాన పరిషత్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ పోస్టులు, లెక్చరర్ పోస్టులు, ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్స్ పోస్టులకు: 15 సెప్టెంబరు

1857 ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు

టీఎస్‌పీఎస్సీ

తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిరుద్యోగులకు తీపి కబురు ప్రకటించింది. మొత్తం 2345 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వివిధ శాఖల్లో జనరల్ రిక్రూట్‌మెంట్ కింద ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. ఖాళీలు, అర్హతలు, ఎంపిక విధానం మొదలైన వివరాలు..

ఫారెస్ట్ బీట్ ఆఫీసర్

మొత్తం ఖాళీలు: 1857
వయసు: 18 నుంచి 31 ఏళ్ల మధ్య ఉండాలి.
వేతన శ్రేణి: రూ.16,400 - 49,870
అర్హత: ఇంటర్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించిన 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు. మార్కులు: 100.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో ప్రారంభం.
చివరి తేదీ: 12 సెప్టెంబరు

సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్టులు

★ మొత్తం ఖాళీలు: 205.
★ విభాగాల వారీగా ఖాళీలు: అబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ - 41, పీడియాట్రిక్స్ - 27, అనెస్తీషియా - 39, ఆర్థోపెడిక్స్ - 5, ఈఎన్‌టీ - 20, డెర్మటాలజీ - 1, పాథాలజీ - 16, జనరల్ మెడిసిన్ - 34, సైకియాట్రిక్ - 3, రేడియాలజీ - 3, జనరల్ సర్జరీ - 16.
★ అర్హత: సంబంధిత విభాగంలో పీజీ డిగ్రీ/ డిప్లొమా లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: పేపర్ - 1లో జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
✪ పేపర్ - 2లో సెక్షన్ - ఎ, సెక్షన్ - బి అనే రెండు విభాగాలు ఉంటాయి. సెక్షన్ - ఎలో బేసిక్ యూజీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు (అందరికీ కామన్). సెక్షన్ - బిలో సంబంధిత పీజీ డిప్లొమా/ పీజీ డిగ్రీ సిలబస్ నుంచి 75 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
✪ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 90
★ అర్హత: అగ్రికల్చర్ ఒక సబ్జెక్టుగా ఏదైనా డిగ్రీ లేదా బోటనీ/ ఫారెస్ట్/ హార్టికల్చర్/ జువాలజీ/ ఫిజిక్స్/ కెమిస్ట్రీ/ మ్యాథమెటిక్స్/ స్టాటిస్టిక్స్/ జియాలజీలో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి లేదా కెమికల్/ మెకానికల్/ సివిల్ ఇంజినీరింగ్‌లో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 31 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.21,230 - 63,010
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
పేపర్ – 1: జనరల్ నాలెడ్జ్‌కి సంబంధించి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
పేపర్ – 2: జనరల్ మ్యాథమెటిక్స్ నుంచి 100 మార్కులకు 100 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: 90 నిమిషాలు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభమవుతాయి.
చివరి తేదీ: 12 సెప్టెంబరు

ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్

★ మొత్తం ఖాళీలు: 67.
★ అర్హత: అగ్రికల్చర్/ బోటనీ/ కెమిస్ట్రీ/ కంప్యూటర్ అప్లికేషన్స్ లేదా కంప్యూటర్ సైన్స్/ ఇంజినీరింగ్ (అగ్రికల్చర్/ కెమికల్/ సివిల్/ కంప్యూటర్/ ఎలక్ట్రికల్/ ఎలక్ట్రానిక్స్/ మెకానికల్)/ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్/ ఫారెస్ట్రీ/ జియాలజీ/ హార్టికల్చర్/ మ్యాథమెటిక్స్/ ఫిజిక్స్/ స్టాటిస్టిక్స్/ వెటర్నరీ సైన్స్/ జువాలజీలో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 28 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.31460 - 84970
★ ఎంపిక: రాతపరీక్ష, వాకింగ్ టెస్ట్, మెడికల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: జనరల్ ఇంగ్లిష్ పేపర్ (100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100), మ్యాథమెటిక్స్ పేపర్ (ఎస్ఎస్‌సీ/ హయ్యర్ స్కూల్ స్టాండర్డ్ నుంచి 100 ప్రశ్నలు ఇస్తారు. సమయం: 100 నిమిషాలు. మార్కులు: 100)లో సాధించిన మార్కులను క్వాలిఫయింగ్ మార్కులుగా పరిగణిస్తారు. 150 మార్కులకు జనరల్ స్టడీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. ఆప్షనల్ పేపర్‌లో (ఏదైనా ఒకటి మాత్రమే) 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మరో 50 మార్కులకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 21 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 12 సెప్టెంబరు

ట్యూటర్

★ మొత్తం ఖాళీలు: - 65
★ విభాగాల వారీగా ఖాళీలు: క్లినికల్ - 33. ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ నాన్ - క్లినికల్ - 32. ఎంబీబీఎస్/ ఎంఎస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. (మెడికల్ స్పెషాలిటీ విభాగాల్లో)
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఉద్యోగాలు Jobs

★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహించే రాతపరీక్షలో పేపర్ - 1, పేపర్ - 2 అనే రెండు విభాగాలు ఉంటాయి.
★ పేపర్ - 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ పేపర్ - 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్‌లో.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 43.
★ అర్హత: ఎంబీబీఎస్ లేదా తత్సమాన అర్హత అవసరం.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,780
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఉంటాయి. సమయం: రెండున్నర గంటలు, మార్కులు 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో మెడికల్ సైన్స్, జనరల్ మెడిసిన్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు: 300. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు నిర్వహిస్తారు.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
చివరి తేదీ: 15 సెప్టెంబరు

డెంటల్ అసిస్టెంట్ సర్జన్లు

★ మొత్తం ఖాళీలు: 10.
★ అర్హత: బీడీఎస్ ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ స్టేట్ డెంటిస్ట్స్ రిజిస్ట్రేషన్ ట్రైబ్యునల్‌లో లేదా ఏపీ స్టేట్ డెంటల్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకుని ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.40,270 - 93,270
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో నిర్వహిస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 150.
పేపర్ – 2: డిగ్రీ స్థాయిలో డెంటల్ సర్జరీకి సంబంధించి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు: 300.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

లెక్చరర్లు

★ మొత్తం ఖాళీలు: 6
★ విభాగాలు: రేడియోలాజికల్ ఫిజిక్స్, ఫిజిస్ట్
★ అర్హత: ప్రథమశ్రేణి మార్కులతో ఫిజిక్స్/ న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎంఎస్సీ ఉత్తీర్ణతతోపాటు బార్క్ నుంచి హాస్పిటల్ ఫిజిక్స్, రేడియోలాజికల్ ఫిజిక్స్‌లో పోస్ట్ గ్రాడ్యుయేట్ ట్రెయినింగ్ కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ. 37,100 - 91,450
★ ఎంపిక: రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా.
★ పరీక్షా విధానం: ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు ఇస్తారు.
పేపర్ – 1: జనరల్ స్టడీస్, ఎబిలిటీస్ నుంచి 150 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
పేపర్ – 2: పోస్ట్ ఎంఎస్సీ డిప్లొమా స్థాయిలో రేడియోలాజికల్ ఫిజిక్స్/ మెడికల్ ఫిజిక్స్‌కు సంబంధించి 300 మార్కులకు 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు.
★ ఇంటర్వ్యూ: 50 మార్కులకు ఉంటుంది.
★ చివరి తేదీ: 15 సెప్టెంబరు

ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీస్‌లో అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్

★ ఖాళీలు: 2
★ అర్హత: ఫిజియోథెరపీలో డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి.
★ వయసు: 18 నుంచి 44 సంవత్సరాల మధ్య ఉండాలి.
★ వేతన శ్రేణి: రూ.17,890 - 53,950
★ ఎంపిక: రాతపరీక్ష ఆధారంగా.
★ పరీక్షా విధానం: మొత్తం 300 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి.
పేపర్ 1: జనరల్ స్టడీస్, జనరల్ ఎబిలిటీస్ నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. మార్కులు 150. సమయం: రెండున్నర గంటలు.
పేపర్ 2: ఫిజియోథెరపీ (డిప్లొమా స్థాయిలో) నుంచి 150 ప్రశ్నలు ఇస్తారు. వ్యవధి: రెండున్నర గంటలు. మార్కులు 150.
★ దరఖాస్తు: 22 ఆగస్టు నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు అందుబాటులో ఉంటాయి.
చివరి తేదీ: 15 సెప్టెంబరు
వెబ్‌సైట్: www.tspsc.gov.in

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ

గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✪ ఖాళీలు: హిస్టరీ, ఆర్కియాలజీ - 1.
✪ తెలుగు, ఓరియంటల్ లాంగ్వేజెస్ - 1.
✪ కామర్స్, బిజినెస్ మేనేజ్‌మెంట్ - 1.
✪ సోషియాలజీ, సోషల్ వర్క్ - 1.
✪ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఛైర్ - 1.
✪ జువాలజీ - 1.
✪ బోటనీ, మైక్రోబయాలజీ - 1.
✪ మ్యాథమెటిక్స్ - 1.
✪ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ - డీన్ - 1.
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ పూర్తిచేసిన దరఖాస్తుతోపాటు 'రిజిస్ట్రార్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, నాగార్జున నగర్ - 522510, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్' పేరిట ఎస్‌బీఐలో తీసిన రూ.2 వేల డీడీ జతచేసి పంపాలి.
చివరి తేదీ: 9 సెప్టెంబరు
వెబ్‌సైట్: www.anu.ac.in

బి.ఆర్.అంబేద్కర్ యూనివర్సిటీ

శ్రీకాకుళంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ యూనివర్సిటీ ఆర్ట్స్, సైన్స్ విభాగాల్లో ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
✪ వివరాలు: ఆర్ట్స్: ప్రొఫెసర్ (లా - 1, సోషల్ వర్క్ - 1)
✪ సైన్స్: ప్రొఫెసర్ (బయోటెక్నాలజీ - 1, మ్యాథమెటిక్స్ - 1, ఆర్గానిక్ కెమిస్ట్రీ - 1).
✪ దరఖాస్తు: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు
✪ రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.2000
చివరి తేదీ: 29 ఆగస్టు
✪ వెబ్‌సైట్: www.brau.edu.in

ఐఐఎం, విశాఖపట్నం

విశాఖపట్నంలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీ చేయనుంది.
✪ ఖాళీలు: అకౌంటెంట్ -1, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (జనరల్ అడ్మినిస్ట్రేషన్) -1, జూనియర్ ఇంజినీర్ -1, సీనియర్ లైబ్రరీ అండ్ ఇన్ఫో అసిస్టెంట్ - 1, స్టోర్ అండ్ పర్చేజ్ ఆఫీసర్ - 1.
వెబ్‌సైట్: www.iimv.ac.in

IBPS - RRBs Recruitment


No. of Questions: 80 **Maximum Marks: 80** **Time: 45 Mts.**

ప్రతిభ

IBPS Officers Prelims Model Paper - 2017

(నిన్నటి తరువాయి)

(37 – 39):




37. I. ✔ II. ✔
Both I and II follows.

38. I. ✔ II. ✕
Only I follows.

39. I. ✕ II. ✕
Neither I nor II follows.

40.



I. ✕ II. ✔
Only II follows.

41. 8×20 men = 8×32 women
$\Rightarrow$ 5 men = 8 women
5 men + 8 women = 16 women
$M_1D_1 = M_2D_2$
$\Rightarrow 8 \times 32 = 16 \times D_2$
$\Rightarrow D_2 = \frac{8 \times 32}{16} = 16$ days

42. Side of the square
$= \sqrt{1024} = 32$ cm.
$\therefore$ Length of rectangle
$= 2 \times 32 = 64$ cm.
Breadth of rectangle = 32 – 12 = 20 cm.
$\therefore$ Required ratio = 64 : 20 = 16 : 5

43. $x + x + 2 + x + 4 + x + 6 + x + 8 = 220$
$\Rightarrow 5x + 20 = 220 \Rightarrow x = 40$
Second lowest number of different set
$= 2 \times 40 - 37 = 43$
$\therefore$ Required sum
$= 42 + 43 + 44 + 45 + 46 = 220$

44. Bus fare = Rs. 420
Train fare $= 2 \times 420 \times \frac{3}{4}$ = Rs. 630
$\therefore$ Required total fare
= Rs. $(2 \times 420 + 4 \times 630)$ = Rs. $(840 + 2520)$
= Rs. 3360

45. Speed of tractor $= \frac{360}{12} = 30$ kmph
Speed of jeep $= 30 \times \frac{250}{100} = 75$ kmph
$\therefore$ Speed of car $= \frac{3}{5} \times 75 = 45$ kmph
$\therefore$ Average speed of car and jeep together
$= \left(\frac{75 + 45}{2}\right)$ kmph = 60 kmph

46. Gita's average earnings
$= \frac{140 + 200 + 420 + 400}{4} = \frac{1160}{4}$ = Rs. 290

47. Amount earned by Rahul and Naveen
= 180 + 260 + 340 + 160 = Rs. 940

48. Naveen's total earnings on Wednesday
= 420 + 120 = Rs. 540

49. Required difference = 240 – 200 = Rs. 40

50. Required ratio = 360 : 120 : 160
= 9 : 3 : 4

51. It is obvious from the table.

52. Percentage increase in 2006
$= \frac{-12.5 - 5.3}{5.3} \times 100 = 136$

53. Required difference
$= (14.5 - 6.6) \times 1000$ = Rs. 7900

54. Total monthly rent at Virar over the years
$= (1.1 + 2.1 + 1.8 + 3.6 + 5.5 + 7.8) \times 1000$
= Rs. 21900
$\therefore$ Required percentage $= \frac{9800}{21900} \times 100 = 45$

55. It is obvious from the table.

56. I. $5x^2 - 18x + 9 = 0$
$\Rightarrow 5x^2 - 15x - 3x + 9 = 0$
$\Rightarrow 5x(x - 3) - 3(x - 3) = 0$
$\Rightarrow (x - 3)(5x - 3) = 0$
$\therefore x = 3$ or $\frac{3}{5}$
II. $20y^2 - 13y + 2 = 0$
$\Rightarrow 20y^2 - 8y - 5y + 2 = 0$
$\Rightarrow 4y(5y - 2) - 1(5y - 2) = 0$
$\Rightarrow (4y - 1)(5y - 2) = 0$
$\therefore y = \frac{1}{4}$ or $\frac{2}{5}$
Clearly, $x > y$

57. I. $x^3 = 878 + 453 = 1331$
$\therefore x = \sqrt[3]{1331} = 11$
II. $y^2 = 82 + 39 = 121$
$\therefore y = \sqrt{121} = \pm 11$
$\therefore x \geq y$

58. I. $\frac{3}{\sqrt{x}} + \frac{4}{\sqrt{x}} = \sqrt{x}$
$\Rightarrow 3 + 4 = x \Rightarrow x = 7$
II. $y^3 - \frac{(7)^{7/2}}{\sqrt{y}} = 0$
$\Rightarrow y^{7/2} = 7^{7/2} \Rightarrow y = 7$
$\therefore x = y$

59. I. $9x - 4x = 54.55 + 15.45$
$\Rightarrow 5x = 70 \Rightarrow x = 14$
II. $\sqrt{y + 155} = 7 + 6 = 13$
$\Rightarrow y + 155 = 169$
$\Rightarrow y = 169 - 155 = 14$
$\therefore x = y$

60. I. $x^2 + 11x + 30 = 0$
$\Rightarrow x^2 + 6x + 5x + 30 = 0$
$\Rightarrow x(x + 6) + 5(x + 6) = 0$
$\Rightarrow (x + 5)(x + 6) = 0$
$\therefore x = -5$ or -6
II. $y^2 + 7y + 12 = 0$
$\Rightarrow y^2 + 4y + 3y + 12 = 0$
$\Rightarrow y(y + 4) + 3(y + 4) = 0$
$\Rightarrow (y + 3)(y + 4) = 0$
$\therefore y = -3$ or -4
Clearly, $x < y$

61. The pattern of the number series is :
$7 \times 2 + 6 = 20$; $20 \times 2 + 6 = 46$
$46 \times 2 + 6 = 98$
$98 \times 2 + 6 = 202$
$202 \times 2 + 6 = 404 + 6 =$ 410

Send your feedback to
pratibhadesk@eenadu.net

62. The pattern of the number series is :
$210 - 1^3 = 209$
$209 + 2^2 = 213$
$213 - 3^3 = 186$
$186 + 4^2 = 202$
$202 - 5^3 = 202 - 125 =$ 77

63. (5) The pattern of the number series is :
27 + 11 = 38
38 + 33 = 71
71 + 55 = 126
126 + 77 = 203
203 + 99 = 302

64. (3) The pattern of the number series is :
$435 - 9 \times 9 = 354$
$354 - 9 \times 8 = 282$
$282 - 9 \times 7 = 219$
$219 - 9 \times 6 = 165$
$165 - 9 \times 5 =$ 120

65. (3) The pattern of the number series is :
$4 + 14^2 = 4 + 196 = 200$
$200 + 13^2 = 200 + 169 = 369$
$369 + 12^2 = 369 + 144 = 513$
$513 + 11^2 = 513 + 121 = 634$
$634 + 10^2 = 634 + 100 =$ 734

Calculations (66 – 70):
$\therefore$ 25% = 75
$\therefore 100\% = \frac{75}{25} \times 100 = 300$
$\therefore$ Total females = 300
Computer Science $\Rightarrow \frac{300 \times 35}{100} = 105$
Civil Engineering $\Rightarrow \frac{300 \times 5}{100} = 15$
Electrical Engineering $\Rightarrow \frac{300 \times 20}{100} = 60$
Mechanical Engineering $\Rightarrow \frac{300 \times 15}{100} = 45$
Bio-technology = 75
Total males = 700 – 300 = 400
Computer Science $\Rightarrow \frac{400 \times 30}{100} = 120$
Civil Engineering $\Rightarrow \frac{400 \times 15}{100} = 60$
Electrical Engineering $\Rightarrow \frac{400 \times 18}{100} = 72$
Mechanical Engineering $\Rightarrow \frac{400 \times 12}{100} = 48$
Bio-technology $= 400 \times \frac{25}{100} = 100$

66. Required percent $= \left(\frac{100 - 75}{75}\right) \times 100$
$= \frac{100}{3} = 33\frac{1}{3}\%$

67. Required ratio = 120 : 105 = 8 : 7

68. Required difference
= 72 + 48 – 60 – 45 = 15

69. Civil Engineering + Computer Science :
Total students = 105 + 15 + 120 + 60 = 300
Male students = 180
$\therefore$ Required percent $= \frac{180}{300} \times 100 = 60$

70. Required average
$= \frac{45 + 75 + 48 + 100}{2} = \frac{268}{2} = 134$

71. ? = 466 + 765 – 212 = 1019
$\therefore$ Required answer = 1020

72. $? = \frac{150 \times 150}{100} + 150$
= 225 + 150 = 375

73. $? = \frac{300 \times 750}{1000} - 1400$
= 2250 – 1400 = 850

74. ? = 51 – 34 + 21 = 38
$\therefore$ Required answer = 40

75. $? = \frac{900}{30} \times \frac{90}{300} \times \frac{600}{50} = 108$
$\therefore$ Required answer = 110

76. C.P. of wrist watch
$= \frac{100}{100 - \text{loss\%}} \times$ S.P.
= Rs. $\left(\frac{100}{75} \times 2400\right)$ = Rs. 3200
$\therefore$ Required S.P. of wrist watch =
Rs. $\left(\frac{125}{100} \times 3200\right)$
= Rs. 4000

77. Fifth number
$= 5 \times 56 - 4 \times 54 = 280 - 216 = 64$

78. Let the number be x.
$\therefore x + \frac{7}{9} \times \frac{35}{100} \times 900 = 325$
$\Rightarrow x + 245 = 325$
$\Rightarrow x = 325 - 245 = 80$

79. $x + 4x + 5x + 60 = 360"$
$\Rightarrow 10x = 300° \Rightarrow x = 30$
$\therefore$ Required difference = 5x – x
$= 4x = 4 \times 30 = 120"$

80. On dividing 1740 by 88,
the remainder = 68
$\therefore$ Required number = 68.

This model paper was prepared by subject experts of RACE Institute, Hyderabad

ఉద్యోగాలు

ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్

హైదరాబాద్‌లోని ఎలక్ట్రానిక్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఈసీఐఎల్) కింది పోస్టులను భర్తీ చేయనుంది.

- ఖాళీలు: ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (న్యూక్లియర్) - 1.
- జనరల్ మేనేజర్ (ఆర్ అండ్ డీ) - 1.
- డిప్యూటీ జనరల్ మేనేజర్ (కంపెనీ సెక్రటరీ) - 1.
- పర్చేజ్ మేనేజర్ - 3.
- ఈసీఐఎల్ స్పెషల్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ ద్వారా కింది పోస్టులను కూడా భర్తీ చేయనుంది. వీటిని బధిరులకు కేటాయించారు.
- సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ - 1
- అకౌంట్స్ ఆఫీసర్ - 2. ✪ పర్సనల్ ఆఫీసర్ - 2.
- ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో.

✪ చివరి తేదీ: *31 ఆగస్టు*
వెబ్‌సైట్: **careers.ecil.co.in**

హాయ్! బుజ్జీ!!



మన జీవిత లక్ష్యం ఆనందం కాదు, దానికి తగిన అర్హత సంపాదించుకోవడం


– ఎమర్సన్

పదసంపద!

రోజుకు రెండు పదాలు చదివితే పదసంపద మీదే!

- push = తోయు
- మకరం = మొసలి

కొండల్లో ఇల్లంట.. ప్రపంచంలో మిన్నంట!!



ప్రపంచంలో ఎత్తయిన ఆకాశహర్మ్యం ఏదంటే... బుర్జ్‌ఖలీఫా అని టక్కున చెప్పేస్తాం. మరి ప్రపంచంలో ఎత్తయిన ఇల్లేదంటే చెప్పగలరా? తెలియకపోతే ఇది చదివేయాల్సిందే.

✤ మనం పది పదిహేను అంతస్తులుండే అపార్ట్‌మెంట్లు బోలెడు చూస్తుంటాం. అందులో చాలా కుటుంబాలు నివాసముంటాయి. అయితే ప్రపంచంలో ఒకే కుటుంబం ఉండే ఎత్తయిన ఇల్లొకటుంది. పేరు 'ఫాల్కన్ నెస్ట్'.

✤ అమెరికాలో ఆరిజోనా రాష్ట్రం ఉంది. అక్కడన్నీ చాలామటుకు రాతి కొండలు. అలాంటి చోటుందీ ఇల్లు.

✤ ఇది 6,200 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉంది. 10 అంతస్తుల్లో ఉన్న దీని ఎత్తు 124 అడుగులు. అంటే ఓ పన్నెండు అంతస్తుల అపార్ట్‌మెంట్ అంత.

✤ ఈ ఇంట్లోంచి 360 డిగ్రీల్లో చూట్టూ ఏ ప్రదేశమైనా చక్కగా కనిపిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆరిజోనా పక్క రాష్ట్రం కాలిఫోర్నియాలోని పర్వతాలు సైతం ఈ ఇంట్లోకి కనిపిస్తాయి. దీని నిర్మాణమే ఆ రకంగా చేశారన్నమాట.

✤ ఇంత పెద్ద ఇంట్లో బోలెడన్ని పడకగదులు ఉంటాయనుకుంటారేమో. దీంట్లో ఉన్నది మూడు పడకగదులు, నాలుగు బాత్రూమ్‌లే. మిగిలిన స్థలమంతా బయటి ప్రకృతి అందాలు ఎక్కడికక్కడ కనిపించేలా అద్దాలతో ఉంటుంది.

✤ ఇల్లు వేసవిలో చల్లగా, శీతకాలంలో వెచ్చగా ఉండేలా ప్రత్యేక విద్యుత్ వ్యవస్థ ఉంది.

✤ దీని యజమాని ఎంతో ఇష్టంతో 1994లో దీన్నిలా కట్టించుకున్నారు. ఆయన భార్య చనిపోవడంతో ఇప్పుడు దీన్ని అమ్మకానికి పెట్టారు. ప్రపంచంలోనే ఎత్తయిన ఇల్లు అమ్మకానికి వచ్చిందంటూ ఇది ఇప్పుడు మళ్లీ వార్తల్లోకొచ్చింది.

కథ



ధ్రువ ప్రాంత ఎలుగుబంట్లు వాసన చూడటంలో మహా దిట్టలు. ఆహారం మంచులో దాగి ఉన్నా ఇవి 20 మైళ్ల దూరం నుంచే పసిగట్టేస్తాయి.

నోటు పాట్లు!

ఒక అరటి పండ్లు అమ్మే వాడి డబ్బుల డబ్బాలోకొచ్చి పడిందో పది రూపాయల కాగితం. సరికొత్తగా మెరిసిపోతోంది. అయితే దాని ముఖంలో విచారం పరుచుకుని ఉంది.

ఆ డబ్బాలో ఉన్న మిగతా డబ్బు కాగితాలు, నాణేలు మొదట ఈ కొత్త నేస్తాన్ని కుతూహలంగా చూశాయి. దాని దిగులు ముఖం చూసి ఏమైందని అడిగాయి.

"ఊహ తెలిసినప్పటి నుంచి ఒక ఇనుప పెట్టెలో ఊపిరాడక బతికాను. ఈ రోజు ఒక షావుకారు దయవల్ల బయట పడ్డాను. ఊపిరి పీల్చుకోబోయానో లేదో అతగాడు నన్ను ఒక బిచ్చగత్తె జోలెలో పడేశాడు. ఆమె దగ్గరున్న సొట్టలు పడిన సత్తు గిన్నెలోకి చేరుకున్నాను. అలాంటి చోట బతకాలంటే ఎంత కంపరమనిపించిందో. ఇంతలో ఆమె అరటిపండ్లు కొనడంతో మళ్లీ ఈ పెట్టెలో కొచ్చి పడ్డాను. మళ్లీ చీకటి, ఇరుకు, ఉక్కపోత. ఇక్కడి నుంచి ఎవడి చెమట జేబులోకి వెళ్తానో, వాడు నన్ను ఎవరి పరం చేస్తాడో, ఇలా ఎన్ని చేతులు మారాలో తలుచుకుంటేనే గాబరాగా ఉంది". అని వాపోయింది.

పక్క డబ్బులన్నీ దీని వాలకానికి నిరుత్సాహ పడ్డాయి. ఇక దాని జోలికి పోకుండా తమలో తాము కబుర్లాడుకోసాగాయి.

ఇంతలో ఆ పెట్టెలోకి చేరింది మరో పది కాగితం. చాలా ముడతలు పడి మురికిగా, చిరగడానికి సిద్ధంగా ఉన్నట్లుంది. అయితే దాని ముఖం కళకళలాడుతోంది. వచ్చిన కాసేపటికే అన్ని రకాల డబ్బులనూ నవ్విస్తూ వాటికి మంచి నేస్తమయిపోయింది.

ఈ కొత్త కాగితాన్ని కూడా పలకరించింది. కానీ అది నవ్వలేదు సరికదా! మరింత ముఖం ముడుచుకుని 'మాసిపోయిన నీ వాలకం చూస్తుంటే కొన్నాళ్లకి నా గతీ ఇంతేనేమో అని ఏడుపొస్తోంది' అంది దీనంగా.


నవ్వుతూ వింటున్న పాత నోటుని నీకథేమిటంది ఆగలేక.

'మొదట నేనూ కొన్నాళ్లపాటు ఇనపపెట్టెలో ఊపిరాడకుండానే ఉన్నాను. కానీ ఒక కుటుంబానికి భద్రతనిస్తున్నాననే ఆనందంతో బాధ అనిపించలేదు. ఈ రోజు ఒక చెప్పులు కుట్టే మనిషి చేతికి వచ్చాను. ఇందాక అతను తన వణుకుతున్న చేతులతో చెమటతో తడిచిన జేబులోంచి నన్ను తీసి ఇచ్చి అరటిపళ్లు కొని ఒకటి ఆత్రంగా తిన్నాడు. అతని ఆకలి తీర్చగలిగాననే ఆనందం ఎంత బాగుందో! ఎందరివో చెమట, మురికి అంటుకుని ఇలా అయిపోయాను. నా జీవితంలో ఎన్ని మలుపులో! ఎన్ని మజిలీలో! అయినా నాకు అడుగడుగునా ఆనందమే'. చెబుతున్న పాత నోటును ఒక చెయ్యి పైకి లాగింది.

'మరెవరి అవసరమో తీర్చే అవకాశం మళ్లీ వచ్చింది నాకు. టాటా' అని వీడ్కోలు పలుకుతూ వెళ్లిపోయింది పాత నోటు.

అసలైన ఆనందం తారసపడిన పరిస్థితుల్ని బట్టి కాదు, అలవరుచుకున్న వైఖరిని బట్టి ఉంటుందని తెలుసుకుంది కొత్తనోటు. దాని మనసు కలత తీరి తేటపడింది.

- గుడిపూడి రాధికారాణి



నవ్వుల జల్లులు!



టీచర్: హోం వర్కులో ఎవరైనా తప్పులు చేస్తే వాళ్లకు రేపు గట్టిగా దెబ్బలు పడతాయి...

చింటు: అయితే రేపు మా అన్నను తప్పకుండా తీసుకొస్తాను టీచర్!

- జీవీయస్ ప్రియంవద, అరసవెల్లి

భార్య: ఏవండీ నేనీరోజు గారెలు చేశాను...

భర్త: అయితే పళ్ల డాక్టరు అపాయింట్‌మెంట్ తీసుకొస్తాను..



భార్య: ఎందుకండీ?

భర్త: అవి తిన్నా, తినకపోయినా తర్వాత ఏం జరుగుతుందో నాకు తెలుసు కాబట్టి!

- అంజి, చౌడేపల్లి

జతపరచండి!

ఇక్కడ సినిమా పేర్లు అసంపూర్ణంగా ఉన్నాయి. పక్కనున్న పదాల్లో ఏది సరిపోతుందో కనిపెట్టి జత చేయగలరా?


1. స్వామి	ఎ. కోరి
2. ఇట్లు	బి. వేడుక చూద్దాం
3. రారండోయ్	సి. రారా
4. నిన్ను	డి. శ్రావణి సుబ్రమణ్యం

చిలిపి ప్రశ్న

రాత్రిళ్లు కూడా పగలు కనిపించేదెప్పుడు?

- ఎ. వెంకట అమ్మిరాజు, పేరూరు

దారేది?



గబగబా అనండి

నత్త నడక
చిరుత ఉరక

- ఎం.సాయిచేతన్, హైదరాబాద్

ఎవరు నేను?

నేను ఏడక్షరాల ఆంగ్ల పదాన్ని. నాలో 1,3,6,7 అక్షరాలు కలిపితే పద్యం అని అర్థం, 2,3,5,6– పాత్ర, 7,3,4– గుంపు అని అర్థం. ఇంతకీ నేనెవరిని?

1	2	3	4	5	6	7

ఏది భిన్నం?



జవాబులు: చిలిపి ప్రశ్న: కరెంటుపోయినప్పుడు!
ఏది భిన్నం: సి జతపరచండి: 1.డి 2.సి
3.బి 4.ఎ ఎవరు నేను: Problem



ఎంపీకి వినతిపత్రం అందిస్తున్న నార్సింగి వాసులు

వంతెన మంజూరుకు వినతి

నార్సింగి, చేగుంట: మండల కేంద్రమైన నార్సింగిలో జాతీయ రహదారిపై వంతెన మంజూరు చేయించాలని కోరుతూ స్థానిక నాయకులు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర తెరాస బీసీ విభాగం నాయకులు మల్లేశ్‌యాదవ్, జిల్లా నాయకులు శ్రీపతిరావు, పీఏసీఎస్ డైరెక్టర్ కుమ్మరి బాబు హైదరాబాద్‌లో ఎంపీని కలిసి వినతిపత్రం అందించారు. నార్సింగి మీదుగా జాతీయ రహదారి ఉందని, ఇక్కడ వంతెన లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా విద్యార్థులు రహదారిని దాటే క్రమంలో ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. అందుకే రోడ్డు దాటేందుకు వీలుగా ఆకాశ వంతెన ఏర్పాటుచేయించాలని కోరారు.

వేటు పడినా.. పతాకావిష్కరణ!

కౌడిపల్లి: సస్పెన్షన్‌కు గురైన ఉద్యోగి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడం చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటన మండల కేంద్రమైన కౌడిపల్లిలో చోటుచేసుకుంది. స్థానిక గిరిజన బాలుర సంక్షేమ వసతిగృహాన్ని గత జులై 14న గిరిజన సంక్షేమశాఖ రాష్ట్ర కమిషనర్ లక్ష్మణ్ సందర్శించారు. ఈ సందర్భంగా సదరు వసతిగృహ సంక్షేమాధికారి గోవింద్ విధుల్లో లేరు. అనధికారికంగా విధులకు గైర్హాజరైనందుకు కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లా పాలనాధికారి అతడిపై వేటు వేశారు. గిరిజన బాలుర వసతి గృహం పక్కనే ఉన్న బీసీ బాలుర వసతిగృహ సంక్షేమాధికారికి బాల్‌రాజ్‌కు ఇన్‌ఛార్జి అప్పగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సంబంధిత ఉత్తర్వులను ఈ నెల 10న గోవింద్ అందుకున్నారు. ఈ మేరకు ఆయన గిరిజన బాలుర వసతి గృహ బాధ్యతలు తీసుకోవాలని బాల్‌రాజ్‌ను కోరగా ఆయన అందుకు సుముఖత వ్యక్తం చేయలేదని తెలిసింది. మంగళవారం స్వాతంత్ర దినోత్సవం రోజున సస్పెన్షన్‌కు గురైన గోవింద్ జాతీయ పతాకాన్ని ఎగురవేయడం గమనార్హం. ఈ విషయమై ఆయన్ను వివరణ కోరగా జిల్లా గిరిజన సంక్షేమాధికారి సూచన మేరకే జెండా ఎగురవేశానని తెలిపారు.

ఈటీవీలో ఈనాడు

ఉదయం

05-45: ఆరాధన, 06-30: అన్నదాత, 07-00: ఈటీవీ న్యూస్, 07-30: శుభమస్తు: శిరిడిసాయి అనుగ్రహం కోసం గురువారం పాటించాల్సిన నియమాలు...?, ఇంట్లో ఉండాల్సిన లక్ష్మీప్రదమైన వస్తువులు.., 08-30: టాలీవుడ్ టైమ్, 09-00: ఈనాడు సినిమా: జగన్మోహిని (నరసింహరాజు, ప్రభ).

మధ్యాహ్నం

12-00: అభి'రుచి': ఘుమఘుమలు 'చెనా బీట్‌రూట్ మసాలా', మీచేతి వంట 'పాలక్‌పకోడీ కర్రీ', 'బీరకాయ బొబ్బర్ల కర్రీ', జస్ట్ ఎ మినిట్ 'క్యాబేజ్ శాండ్‌విచ్' తయారు చేసే విధానం, ఇంటింటి వంటింటి చిట్కాలు.., 01-00: స్టార్ మహిళ (మెగా గేమ్ షో), 02-00: అభిషేకం (డైలీ సీరియల్), 02-30: అత్తారింటికి దారేది (డైలీ సీరియల్), 03-00: సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు (విధి 2) (డైలీ సీరియల్), 03-30: ఆడదే ఆధారం (డైలీ సీరియల్).

సాయంత్రం

04-00: వసంతం (డైలీ సీరియల్), 04-30: జీన్స్–2(రిపీట్), 05-30: ఆడాళ్ళా మజాకా: (రావులపాలెం అతివల అల్లరి ఆటల సందడి), 06-00: శ్రీ భాగవతం (భక్తి రసాత్మక దృశ్య కావ్యం) (డైలీ సీరియల్), 06-30: ఒకరికి ఒకరు (డైలీ సీరియల్)

రాత్రి

07-00: సావిత్రి (డైలీ సీరియల్), 07-30: మనసు మమత (డైలీ సీరియల్), 08-00: స్వాతిచినుకులు (డైలీ సీరియల్), 08-30: నా పేరు మీనాక్షి (డైలీ సీరియల్), 09-00: ఈటీవీ న్యూస్, 09-30: జబర్దస్త్ (ఖతర్నాక్ కామెడీ షో): వినోదాల విందు... 10-30: జబర్దస్త్ జల్సాటైం...

ఈటీవీ ప్లస్

ఉదయం 11:00 కిక్ రిపీట్
మధ్యాహ్నం 12:00 జబర్దస్త్ రిమిక్స్
01:00 ఆనందోబ్రహ్మ రిపీట్
01:15 డీజే రిపీట్
01:30 పటాస్ రిపీట్
02:00 అల్లరే అల్లరి రిపీట్
02:30 సరదాగా కాసేపు రిపీట్
03:00 తారక్ మామా అయ్యోరామ రిపీట్
03:30 ఈ-జంక్షన్ రిపీట్
సాయంత్రం 04:30 ఎక్స్‌ప్రెస్ రాజా
05:00 జిల్ జిల్ జిగా
06:00 అమృతం రిపీట్
06:30 ఎక్స్‌ప్రెస్ రాజా
రాత్రి
07:30 తారక్ మామా అయ్యోరామ
08:00 పోవే..పోరా
09:00 పటాస్
09:30 మైకేల్ మదన్ కామరాజు
09:45 ది బ్రేకప్ కన్సల్టెంట్
10:00 ఆనందోబ్రహ్మ
10:15 డీజే
10:30 తారక్ మామా అయ్యోరామ రిపీట్
11:00 పటాస్ రిపీట్
11:30 ఎక్స్‌ప్రెస్ రాజా రిపీట్

ఈటీవీ లైఫ్

- ★ మానస (ఉ. 6:00, సా. 6.00, రా. 11.00)
- ★ డా. ఈటీవి (ఉ. 6:30, 11:00, మ. 3:30. రా. 7:30)
- ★ యోగమంత్ర (ఉ. 7:00, సా.5:30, రా. 11:30)
- ★ గెట్‌సెట్‌ఫిట్ (ఉ. 7:30, సా. 5:00, రా. 10:30)
- ★ అమృతం (ఉ. 8:00, మ. 12:30, రా. 8:00)
- ★ హెల్దీ & టేస్టీ – (ఉ. 8:30, మ. 01:00, రా. 8:30)
- ★ ఆరోగ్యమస్తు (ఉ. 09:00, 10:30, మ. 3:00, రా. 09:00)
- ★ జీవనరేఖ చైల్డ్ కేర్ - (ఉ. 09:30, మ. 2:00, సా. 04:00, రా. 7:00)
- ★ బాడీ మైండ్ & సోల్ - సుఖ జీవనం (ఉ. 10:00, మ. 2:30, రా. 9:30).
- ★ విహారి (మ. 12:00, సా. 6:30, రా. 10:00)
- ★ హెల్దీ డయాబెటిక్ (మ. 1:30)

ఈటీవీ సినిమా

ఉదయం: 6-00: మధురిమలు, 7-00: సన్‌రైజ్ సినిమా: దొంగల దోపిడి (కృష్ణ, దీప), 10-00: మార్నింగ్ షో: అమ్మో బొమ్మ (రాజేంద్ర ప్రసాద్, ఉమా శంకరి), మధ్యాహ్నం: 1-00: మాటినీ: వంశానికొక్కడు (బాలకృష్ణ, ఆమని), సాయంత్రం: 4-00: ఈవినింగ్ షో: దేవా ది గ్రేట్ (సత్యరాజ్, భానుప్రియ), రాత్రి: 7-00: ఫస్ట్ షో: పంతాలు – పట్టింపులు (శోభన్‌బాబు, వాణిశ్రీ), 10-00: క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీతో గుర్తుకొస్తున్నాయి...

ఈటీవీ అభిరుచి

ఉ.6.00: బ్రేక్ ఫాస్ట్ షో - ఎగ్ ఇడ్లీ శాండ్విచ్ & హార్స్ గ్రామ్ సలాడ్, ఉ.8.00, రా.9:00: బ్రేక్ ఫాస్ట్ షో – ఓట్స్ అండ్ వెజిటబుల్ బాత్ & ఓట్స్ లీఫీ అండ్ ఆలూ పరోటా, ఉ.10.00: పిండివంటలు, ప్రసాదాలు – చల్ల ఉండలు & స్వీట్ పనియారం, ఉ.11.00, రా.10.45: గోరుముద్దలు – మంగుళూర్ బన్స్, ఉ.11.15, రా.8:30: డైట్ మెనూ – పాలక్ రాజ్మా కర్రీ, ఉ.11.30, రా.8:00: గాయత్రీ గోల్డ్ "బాబాయ్ హోటల్" - సగ్గుబియ్యం పెరుగు వడలు & టమోట రోటి పచ్చడి, మ.12.00: టేస్ట్ ఆఫ్ ఇండియా (గోవన్ – హిందు క్యూసైన్) - గోవన్ కోకోనట్ కేక్, మ.12.15, రా.10:15: మమ్మీస్ కిచెన్ – పాలకాయలు, మ.12.30, రా.8.45: "కౌ అండ్ కాఫ్" సూపర్ చెఫ్ - పొట్లకాయ వడ కర్రీ, మ.12.45: సూప్స్ & స్టార్టర్స్ - ఆచారి రోస్టెడ్ చికెన్, మ.1.00, రా.7.00: వావ్ ఏమి రుచి (స్కివర్స్ స్పెషల్) – ఆహాతీర్ తుకా హష్య & బోహేమనియన్ డ్రెస్సింగ్, మ.1.30, రా.10.00: చట్‌పట్ (అత్తమ్మ రుచుల స్పెషల్) - శెనగల బిళ్ళల కర్రీ, మ.1.45, రా.7.30: పెరటి రుచులు, మ.2.15, రా.10.30: డిజైనర్ డిష్ – తెరియాకి చికెన్, మ.2.30: చోటా షెఫ్ – ఎగ్ పకోడి, సా.5.15: స్నాక్స్ – టమాటో పాస్తా.

ఈటీవీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 ప్రార్థనా సమయం, 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 సుఖీభవ (రిపీట్), 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్ (రిపీట్), 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 ప్రత్యేక వాణిజ్య కార్యక్రమం, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 సుఖీభవ: కడుపులో సునామీ... **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 తీర్థయాత్ర: శ్రీ షిర్డీసాయిబాబా మందిరం సుజాతానగర్, విశాఖపట్నం, 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి, 06-00 ఘంటారావం, 06-30 జై కిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం,07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం,11-30 ఇదీ సంగతి (రిపీట్)

ఈటీవీ తెలంగాణ కార్యక్రమాలు

ఉదయం: 05-30 తమసోమా జ్యోతిర్గమయ, 06-00 ఘంటారావం, 06-30 యువ (రిపీట్), 07-00 అంతర్యామి, 07-30 ఈటీవీ 360°, 08-30 యువ, 09-00 ఘంటారావం, 09-30 ఈటీవీ టాకీస్, 10-00 ఘంటారావం, 10-30 సుఖీభవ (రిపీట్), 11-00 ఘంటారావం, 11-30 ఇదీసంగతి!, **మధ్యాహ్నం:** 12-00 ఘంటారావం, 12-30 కమర్షియల్ స్లాట్, 01-00 ఈటీవీ 360°, 02-00 సఖి, 02-30 ఘంటారావం, 02-35 సఖి, 03-00 ఘంటారావం, 03-30 తీర్థయాత్ర: శ్రీ సాయిబాబా మందిరం, దేశ్‌ముఖ్, రంగారెడ్డి జిల్లా, **సాయంత్రం:** 04-00 ఘంటారావం, 04-30 సుఖీభవ: కడుపులో సునామీ... 05-00 ఘంటారావం, 05-30 అంతర్యామి (రిపీట్), 06-00 ఘంటారావం, 06-30 జైకిసాన్, **రాత్రి:** 07-00 ఘంటారావం, 07-30 ఇదీ సంగతి, 08-00 ఈటీవీ 360°, 09-00 ప్రతిధ్వని, 09-30 యువ, 10-00 ఘంటారావం, 10-30 ఈటీవీ టాకీస్, 11-00 ఘంటారావం, 11-30 ఇదీ సంగతి (రిపీట్).

ఏ ఛానల్లో ఏముంది.. 17-08-2017

SVBC (TTD): **ఉదయం:** 05-30 సుప్రభాత వైభవం, 06-30 శుభోదయం + నిత్య పూజలివిగో, 07-00 విష్ణుసహస్ర నామ స్తోత్రం, 07-30 శ్రీవారి సేవలు (తిరుప్పావడసేవ), 08-00 శతమానంభవతి, 08-30 పూజకు వేళాయే - దత్తాత్రేయుడు, 09-00 ఆధ్యాత్మిక విశేషాలు, 09-30 భక్తిగీత మాలిక, 10-00 ఆధ్యాత్మిక విశేషగళు - కన్నడ, 10-30 లైవ్ పద్మావతి అమ్మవారి కల్యాణం - తిరుచానూరు, 11-30 ప్రత్యేక వార్తలు - ఆముక్త మాల్యద, **మధ్యాహ్నం:** 12-00 లైవ్ కల్యాణోత్సవం, 01-00 ఆధ్యాత్మిక విశేషాలు, 01-30 విష్ణు సహస్ర నామామృతం, లైవ్‌డోలోత్సవం, 02-00 లైవ్ ఆర్జిత బ్రహ్మోత్సవం, 02-30 లైవ్ వసంతోత్సవం, 03-00 అన్నమయ్య పాటకు పట్టాభిషేకం (రిపీట్), **సాయంత్రం:** 04-30 అష్టలక్ష్మి అనుగ్రహం శ్రీ మాచిరాజు కిరణ్, 05-00 లైవ్ ఎస్.డి. సేవ + ప్రత్యేక వార్తలు, అళ్వార్ శ్రీసూక్తి, 06-00 లైవ్ నాదనీరాజనం - తిరుమల, **రాత్రి:** 07-30 లైవ్ ఘంటానాదం + శ్రీనివాసగద్యం + లక్ష్మీ నృసింహ కరావలంబస్తోత్రం, 08-00 నేను - నాస్వామి, 08-30 మహాలక్ష్మి వైభవం - చాగంటి, 09-00 ఆలయదర్శనం - మహారాష్ట్ర, 09-30 దేవీ సప్తశతి - సామవేదం, 10-00 ఆధ్యాత్మిక విశేషాలు, 10-30 మహాభారతం - అనుశాసనిక పర్వం..

భక్తి TV: **ఉదయం:** 06-00 సాయిహారతి, 06-30 సద్గురు స్తోత్రం, 7-00 అర్చన, 7-30 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 08-00 పుణ్యక్షేత్రం, 08-30 లక్ష్మీ వైభవం, 09-00 సంపూర్ణ రామాయణం, 11-00 ధర్మసందేహాలు, **సాయంత్రం:** 04-30 పుణ్యక్షేత్రం, 05-00 శ్రావణలక్ష్మీ నమోస్తుతే, 05-30 సాయిగీతామృతం, 06-00 సద్గురుస్తోత్రం, **రాత్రి:** 07-00 భక్తివిశేషాలు, 07-30 అమృతకలశం, 08-00 పరిహారం, 08-30 రామాయణ తరంగిణి, 09-00 లక్ష్మీ కటాక్షం, 09-30 లక్ష్మీ వైభవం, 10-00 ధర్మసందేహాలు, 10-30 భక్తివిశేషాలు.

జీ తెలుగు: **ఉదయం:** 07-30 శుభమస్తు, 08-00 సినిమా: రెడీ, 11-00 కామెడీ ఖిలాడీలు (రిపీట్), **మధ్యాహ్నం:** 12-00 గోల్డ్ రష్, 01-00 బతుకు జట్కాబండి, 02-00 గృహప్రవేశం, 02-30 నా కోడలు బంగారం, 03-00 సూర్యవంశం (రిపీట్), 03-30 వారెవా, **సాయంత్రం:** 04-00 కామెడీ ఖిలాడీలు, 05-00 జైకృష్ణా ముకుంద మురారి, 05-30 కుంకుమభాగ్య, 06-00 పక్కింటి అమ్మాయి, 06-30 రామా సీతా, **రాత్రి:** 07-00 అమెరికా అమ్మాయి, 07-30 ముద్ద మందారం, 08-00 దట్ ఈజ్ మహాలక్ష్మి, 08-30 పున్నాగ, 09-00 కల్యాణ వైభోగం, 09-30 ముత్యాల ముగ్గు, 10-00 సూర్యవంశం, 10-30 ఇన్‌స్పెక్టర్ కిరణ్, 11-00 సినిమా: తులసి.

మా: **ఉదయం:** 06-30 సిల్వర్‌స్క్రీన్, 07-00 మహాభారతం, 08-00 దిన ఫలం - రాశి ఫలాలు, 08-30 ఫన్‌టైమ్, 09-00 సినిమా: నమో వెంకటేశ, **మధ్యాహ్నం:** 12-00 కోడలా కోడలా కొడుకు పెళ్లామా, 12-30 చిన్నారి పెళ్లికూతురు, 01-00 సంసారం ఒక చదరంగం, 02-00 కుంకుమపువ్వు, 02-30 బిగ్ బాస్ రిపీట్, 04-00 సినిమా: ఊహలు గుసగుసలాడే, **సాయంత్రం:** 05-30 ఒకె జాను, 06-00 ఉయ్యాలా జంపాలా, 06-30 చిన్నారి పెళ్లికూతురు, **రాత్రి:** 07-00 లక్ష్మీ కళ్యాణం, 07-30 అష్టాచమ్మా, 08-00 కోయిలమ్మ, 08-30 కుంకుమ పువ్వు, 09-00 మల్లీశ్వరి, 09-30 బిగ్ బాస్, 10-30 బిగ్ బాస్ రిపీట్ .

జెమిని: **ఉదయం:** 06-00 టెలీ షాపింగ్, 07-00 సకలసిద్ధి, 07-30 అనుగ్రహం, 08-00 శ్రీ ఆంజనేయం రిపీట్, 08-30 నాటు వైద్యం, 09-00 సినిమా: ముగ్గురు మొనగాళ్ళు, **మధ్యాహ్నం:** 12-00 నువ్వు నాకు నచ్చావ్ (రిపీట్), 12-30 చక్రవాకం, 01-00 నందిని (రిపీట్), 01-30 మొగలి రేకులు, 02-00 అమ్మ నేను ఓ అమ్మాయి, 02-30 నాగిని 2 (రిపీట్), 03-00 సినిమా: పందెంకోడి, **సాయంత్రం:** 06-00 ప్రతిఘటన, 06-30 శ్రీ ఆంజనేయం, **రాత్రి:** 07-00 నాతిచరామి, 07-30 నాగిని-2, 08-00 నువ్వు నాకు నచ్చావ్, 08-30 శనీశ్వరుని దివ్య చరిత్ర, 09-00 నందిని, 09-30 అగ్నిపూలు,10-00 సినిమా: శౌర్యం.

జొన్న సాగులో మెలకువలు



జొన్నను ఖరీఫ్ పంటగా ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో విత్తుకోవచ్చని మండల వ్యవసాయ విస్తరణాధికారిణి హారిక తెలిపారు. నల్లరేగడి, తేలికైన ఎర్ర నేలలు అనుకూలంగా ఉంటాయన్నారు.

రకాలు: సి.ఎస్.హెచ్-5, 6, 9, 13, పి.ఎస్.హెచ్-1, ఎ.ఎస్.హెచ్-1, పి.ఎస్.వి-1, సి.ఎస్.వి-15, నంద్యాల తెల్లజొన్న 3, ఎన్.జె -2169, ఎ.జె-140 తీపిజొన్న రకాలు విత్తవచ్చు. 105 నుంచి 115 రోజుల్లో పంట చేతికి వస్తుంది. ఎకరాకు 15-20 కింటాళ్ల దిగుబడి వస్తుంది. సి.ఎస్.హెచ్ 5, 6, 9, 13 రకాల్లో కంకి కండె ఆకారంలో ఉండి బూజు తెగులు తట్టుకొంటాయి. అంతర పంటలను వేసుకోవచ్చు. ఎత్తు ఎక్కువగా పెరుగుతుంది. చొప్ప ఎక్కువగా వస్తుంది. కాండం తొలుచు పురుగును కొంత వరకు నివారిస్తుంది. గింజ తెల్లగా ఉంటుంది.

విత్తనం: ఎకరాకు 4 కిలోలు సరిపోతుంది.

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 3 గ్రా. థైరమ్ లేదా కాప్టాన్ కలిపి విత్తనశుద్ధి చేయాలి.

విత్తే ఎడం : వరుసల మధ్య 45 సెం.మీ, వరుసలో మొక్కల మధ్య 12-15 సెం.మీ. దూరంలో విత్తాలి.

ఎరువులు: పశువుల ఎరువు ఎకరాకు 4 టన్నులు వేసి ఆఖరి దుక్కిలో కలియదున్నాలి. ఎకరాకు 12 కిలోల నత్రజని, 16 కిలోల భాస్వరాన్ని విత్తేటప్పుడు, పంట మోకాలు ఎత్తు పెరిగినప్పుడు.. 12 కిలోల నత్రజనిని పైపాటుగా వేయాలి.


నీటి యాజమాన్యం : తేలిక నేలల్లో వారానికి ఒకసారి, నల్లరేగడి భూముల్లో 15 రోజులకొకసారి తడి ఇవ్వాలి. పంట పూత, గింజ పాలు పోసుకునే సమయంలో నీరు తప్పకపెట్టాలి.

అంతర పంటలు : జొన్న, కందిలను 2:1 నిష్పత్తిలో వేసుకోవచ్చు.

అంతరకృషి : విత్తిన 30 రోజులకు గుంటక లేదా దంతితో అంతరకృషి చేయడం వల్ల పొలంలో తేమ నిలిచి మొక్కలు బాగా పెరుగుతాయి. విత్తిన రెండు వారాలలోపు ఒత్తు మొక్కలను తీసేయాలి. విత్తిన తదుపరి కలుపు నివారణకు.. ఎకరాకు కిలో పెండిమిథాలిన్ 200 లీటర్ల నీటిలో కలిపి విత్తిన 3 రోజుల్లోపు పిచికారి చేయాలి. విత్తిన 15-20 రోజుల వ్యవధిలో 2, 4-డి ఎకరాకు 800 గ్రా., 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి.

– న్యూస్‌టుడే, సదాశివనగర్

కనకాంబరానికి పురుగుల బెడద



కనకాంబరంలో పురుగుల బెడద ఎక్కువని ఉద్యాన అధికారి ఎం.బబిత తెలిపారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలను సూచించారు.


నులి పురుగులు: ఇవి మొక్కల వేర్లకు రంధ్రాలు చేసి బుడిపెలను కలుగజేస్తాయి. దీని వల్ల వేర్లు నీటిని, పోషకాలను కావాల్సిన మేర మొక్కకు అందించలేవు. అందువల్ల ఆకులు ముడుచుకుని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారతాయి. పూల పరిమాణం తగ్గుతుంది. నులి పురుగులు చేసిన రంధ్రాల గుండా శిలీంధ్రాలు వేర్లలోకి చేరి ఎండుతెగులు సోకే అవకాశం ఉంది. మొక్కలు ఎండిపోతాయి.

నివారణ చర్యగా నులిపురుగులున్న పొలంలో కనకాంబరం పూలసాగు చేపట్టే ముందు, సూర్యరశ్మీకరణ చేయాలి. నాటేముందు ఎకరాకు 200 కిలోల వేప పిండి వేసుకోవాలి. నాలుగు కిలోల ఫోరేట్ లేదా 10 కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు ఇసుకతో కలిపి చల్లాలి. నులిపురుగులు సోకిన మొక్కల్ని పెరికి నాశనం చేయాలి. బంతి పూలతో పంటమార్పిడి చేస్తే నేలలో నులిపురుగుల సంఖ్య తగ్గుతుంది.

పిండినల్లి: లేత కొమ్మలు, ఆకులు, పూమొగ్గలపై తెల్లని పొర కప్పినట్టుగా ఉండే పురుగులు గుంపులుగా చేరి రసంపీల్చడంతో ఆకులు పసుపురంగుకు మారి మొక్కలు గిడసబారతాయి. ఇవి విసర్జించే తియ్యని పదార్థంపై నల్లని బూజు పెరుగుతుంది. దీని వల్ల ఆకుల్లో కిరణజన్య సంయోగక్రియ జరగక మొక్కల పెరుగుదల తగ్గుతుంది. నివారణకు లీటరు నీటికి 2.5 మి.లీ. క్లోరిపైరిఫాస్ కలిపిన ద్రావణాన్ని రెండుసార్లు 15 రోజుల వ్యవధితో పిచికారి చేయాలి.

ఎండు తెగులు: ఈ తెగులు సోకిన నారు నాటడం లేదా సాగుచేసిన పొలంలో శిలీంధ్రాలు ఉండటం వల్ల ఈ తెగులు వ్యాప్తి చెందుతుంది. ఈ శిలీంధ్రానికి నులి పురుగులు తోడైనప్పుడు మొక్కలు తొందరగా ఎండిపోతాయి. ఆకులు ముందుగా కిందికి వాలుతాయి. తరువాత పసుపు రంగుకు మారి కొమ్మల చివర్లు కిందికి వంగుతాయి. మొదట వేర్ల చివర్ల వద్ద తర్వాత నేల మట్టం వద్ద కాండం కుళ్లిపోతుంది. దీన్ని కాండంకుళ్లు అంటారు. లీటరు నీటికి 3 గ్రా. కాంటాఫ్ కలిపిన ద్రావణాన్ని మొక్క మొదలు చుట్టూ భూమి తడిచేలా పోసి ఎండు తెగులును నివారించవచ్చు.

పోటీ ప్రపంచంలో సాంకేతిక విద్య ప్రాధాన్యం ఎంతో పెరిగింది. కళాశాలల్లో ప్రవేశానికి, ఉద్యోగానికి, పోటీ పరీక్షలకు, ప్రభుత్వ పథకాలకు ఇలా దేనికైనా నేడు సాంకేతిక విద్య తెలియాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీని ప్రాముఖ్యతను గుర్తించిన పలు ప్రైవేటు పాఠశాలలు సంగణక విద్యను అందిస్తున్నాయి. గత ఉమ్మడి రాష్ట్ర సమయంలో అప్పటి ప్రభుత్వం సైతం సర్కారు బడుల్లో సంగణక విద్య అందించేందుకు శ్రీకారం చుట్టింది. ప్రైవేటు ఏజేన్సీతో ఒప్పందం కుదుర్చుకుని ఎంపిక చేసిన ఉన్నత పాఠశాలల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి సంగణకాలు పంపిణీ చేసింది. ఒప్పందం గడువు ముగిసి నాలుగేళ్లు కావస్తున్నా కొత్త వారి నియామకం లేకపోవడంతో సంగణక విద్య అటకెక్కింది. విలువైన సంగణకాల సామగ్రి మూలకు చేరి దుమ్ముపట్టిపోతున్నాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లోని సాంకేతిక విద్య పరిస్థితిపై 'న్యూస్‌టుడే' కథనం..



అటకెక్కి.. దుమ్ము ధూళి పట్టి..

● మిథ్యగా మారిన కంప్యూటర్ విద్య

● ప్రభుత్వ పాఠశాలల్లో నిధుల వృథా
● నాలుగేళ్లుగా బోధకులు లేక మూలనపడ్డ సామగ్రి



పెద్దశంకరంపేటలో చిందరవందరగా సామగ్రి



చిన్నశంకరంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వృథాగా..

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట

ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ విద్య బోధకులు లేకపోవడంతో లక్షల విలువైన సామగ్రి మూలకు చేరి పూర్తిగా చెడిపోతున్నాయి. నేటి పరిస్థితుల్లో చదువుతో పాటు విద్యార్థులకు కంప్యూటర్ విద్య తప్పనిసరిగా మారింది. కేవలం పుస్తకాల్లోని పాఠ్యాంశాలనే కాకుండా కంప్యూటర్ విద్య సైతం అందించాలని గత ప్రభుత్వం భావించింది. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు కంప్యూటర్ విద్యను అందించాలని నిర్ణయం తీసుకున్నారు. వ్యవస్థ నిర్వహణకు నిట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్‌లు అందజేసి, తాత్కలిక బోధకులను నియమించారు. విద్యార్థులకు ఇందుకు సంబంధించిన పుస్తకాలను సైతం అందించారు. నాలుగేళ్ల క్రితం నిట్ సంస్థ ఒప్పందం ముగిసిపోవడంతో కంప్యూటర్ బోధన ఆగిపోయింది. దీంతో కంప్యూటర్ విద్య నాలుగేళ్లుగా నిలిచిపోయింది.

నిట్ సంస్థతో ఒప్పందం..

2008లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులకు కంప్యూటర్ విద్య ఉచితంగా నేర్పించాలని సాంకేతిక విద్యను ప్రవేశపెట్టింది. ప్రభుత్వం నిట్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకుని గత ఉమ్మడి మెదక్ జిల్లాలోని 251 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్‌లను అందజేశారు. ఒక్కో పాఠశాలకు 11 కంప్యూటర్‌లు, విద్యుత్తు లేని సమయంలో వాడుకునేందుకు జనరేటర్ సైతం అందజేశారు. అయిదేళ్ల ఒప్పందంతో పాఠశాలకు ఇద్దరు చొప్పున మొత్తం 502 మంది తాత్కాలిక బోధకులను నెలకు రూ.2500 భత్యం ఇస్తూ నియమించారు. తరగతులవారీగా ఆయా అంశాలను రూపకల్పన చేసి పుస్తకాలను సైతం విద్యార్థులకు అందించారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఏవిధంగా బోధించాలనే విషయంపై నిట్ సంస్థ శిక్షకులకు పూర్తి శిక్షణ కల్పించారు. గత నాలుగేళ్ల క్రితం జిల్లాలోని 198 పాఠశాలల్లో నిట్ సంస్థ ఒప్పందం ముగిసిపోగా అక్కడితోనే ఆయా పాఠశాలల్లో కంప్యూటర్ బోధన ఆగిపోయింది. తర్వాత మూడేళ్ల క్రితం మరో 53 పాఠశాలల్లో ఒప్పందం ముగిసిపోవడంతో బోధన పూర్తిగా నిలిచిపోయింది. దీంతో ఆయా పాఠశాల్లో ఏర్పాటు చేసిన కంప్యూటర్‌లు మూలకు చేరాయి. వీటికోసం కేటాయించిన జనరేటర్‌లు, ఫర్నీచర్‌లు తప్పుపట్టి పాడవుతున్నాయి. బోధకులపై దృష్టి సారించకపోవడంతో రూ.లక్షల విలువైన సామగ్రి పాడైపోతోంది.



పెద్దశంకరంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బీరువాల్లో మానిటర్‌లు

ఇలా చేస్తే..

లక్షలాది రూపాయల విలువైన కంప్యూటర్‌లు నిర్వహణ లేక మూలకు చేరాయి. అధికారులు ఈ విషయమై దృష్టి సారించి శిక్షకులను నియమిస్తేనే విద్యార్థులకు సాంకేతిక విద్య అందుతుంది. కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న ఉపాధ్యాయులు అపుడప్పుడు ప్రత్యేకంగా తరగతులు తీసుకున్నా కొంత మేరనైనా ప్రయోజనం చేకూరుతుంది. ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతో ఉంది.

కొన్నిచోట్ల పరిస్థితి ఇలా..

● పెద్దశంకరంపేట మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత, బాలికల ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్‌లు అందించారు. గత మూడేళ్లు వీటి నిర్వహణ లేక మూలకు చేరి పాడవుతున్నాయి.

● శివ్వంపేట మండలంలోని గోమారం, దొంతి, రత్నాపూర్, కొంకన్‌పూర్, శివ్వంపేట గ్రామాల్లోని ఉన్నత పాఠశాలలకు అందించినా అవి ఎక్కడా వినియోగంలో లేకపోవడం గమనార్హం.

● వెల్దుర్తి, మాసాయిపేట, కుకునూరుపల్లి ఉన్నత పాఠశాలల్లో శిక్షకులు లేకపోయినా అప్పుడప్పుడు ఉపాధ్యాయులే విద్యార్థులకు నేర్పిస్తున్నారు.

● రామాయంపేట మండలంలోని నిజాంపేట, రామాయంపేట ఉన్నత పాఠశాలల్లో ఇచ్చిన కంప్యూటర్‌లు వాడకపోవడంతో వృథాగా మారగా, ధర్మారం, అక్కన్నపేట పాఠశాలల్లో నిర్వహణ ఉన్నా విద్యార్థులకు తరగతులు మాత్రం నిర్వహించడం లేదు.

● చిన్నశంకరంపేట మండలంలో ఏ బడిలో చూసినా అవి దుమ్ము పట్టి కనిపిస్తాయి.

● నర్సాపూర్ మండల పరిధిలో ఎక్కడా వినియోగంలో లేవు. తూప్రాన్, అందోలు, చేగుంట, తదితర మండలాల్లో సైతం ఇదే దుస్థితి నెలకొంది.

అవకాశం లేకుండా పోయింది: శివలీల, విద్యార్థిని



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదువుకునే పేద విద్యార్థులకు కంప్యూటర్ బోధన మంచి అవకాశంగా ఉండేది. కానీ ఇప్పుడు అందుబాటులో లేకపోవడంతో అందరిలో నిరాశ ఏర్పడుతోంది. నేర్చుకోవాలని ఉన్నా అవకాశం దొరకడం లేదు.

పునరుద్ధరిస్తే మేలు

రఘునాథ్‌రావు ఉపాధ్యాయుడు పెద్దశంకరంపేట



ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో గతంలో ఏర్పాటు చేసిన కంప్యూటర్ తరగతులను పునరుద్ధరిస్తే విద్యార్థులకు ఎంతో మేలు. సాంకేతిక విద్య నేర్చుకోవడానికి గతంలో విద్యార్థులు ఎంతో పోటీ పడేవారు. ఒప్పందం ముగిసిపోవడం శిక్షకులు లేకపోవడంతో కంప్యూటర్‌లు అన్ని పాఠశాలల్లో వృథాగా ఉన్నాయి. వీటికి వెచ్చించిన నిధులు వృథా కాకుండా ఉండాలంటే ప్రభుత్వం తరగతులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలి.

లక్ష్యాలు నిర్దేశించుకోండి



మాట్లాడుతున్న వీరేందర్



హాజరైన విద్యార్థులు

సిద్దిపేట టౌన్, న్యూస్‌టుడే: లక్ష్యాలు లేక యువత పెడదారి పడుతోందని, దృఢ సంకల్పంతో లక్ష్యాలను నిర్దేశించుకుని ఛేదించాలని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు వీరేందర్ అన్నారు. సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ-పీజీ కళాశాలలో టీఎస్‌కేసీ(తెలంగాణ స్కిల్ నాలెడ్జి సెంటర్) ఆధ్వర్యంలో విద్యార్థులకు 'వ్యక్తిత్వ వికాసం - మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలు'పై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయానికి మంచి ఆలోచనలే ప్రధానమని, అనవసరమైన ఆలోచనలతో భవిష్యత్తును నాశనం చేసుకోవద్దన్నారు. దురలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. ప్రిన్సిపల్ శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత లక్ష్యాలను సులువుగా చేరుకునే సత్తా యువతలో ఉంటుందన్నారు. టీఎస్‌కేసీ సమన్వయకర్త నాగుల వేణు మాట్లాడుతూ.. విద్యార్థులు న్యూనతాభావాన్ని వీడితే అన్ని రంగాల్లో రాణించవచ్చున్నారు. విద్యార్థులు విద్య, విజ్ఞానంతో పాటు నైతిక విలువలు, ధర్మాలు నేర్చుకుని ఆచరించాలన్నారు. అధ్యాపకులు హరినాథ శర్మ, హుస్సేన్, సుదర్శనం, రామాచారి, బేబి రమణి, నవీన్, అనురాధ, దుర్గాప్రసాద్, సువర్ణాదేవి తదితరులున్నారు.

ఉద్యోగ ప్రకటనపై హర్షం

సిద్దిపేట, న్యూస్‌టుడే: నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని తెరాసవి జిల్లా సమన్వయకర్త మేర్గు మహేశ్ అన్నారు. తాజాగా టీఎస్‌పీఎస్సీ 9 ఉద్యోగ ప్రకటనలు జారీ చేయడంతో తెరాసవి ఆధ్వర్యంలో సిద్దిపేటలో బుధవారం కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ.. ఈ ఏడాది 84,876 ఉద్యోగాల భర్తీకి కార్యాచరణ ప్రణాళిక రూపొందించారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు 294 గురుకుల పాఠశాలలు ఉంటే.. తెరాస అధికారం చేపట్టాక కొత్తగా 516 గురుకులాలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రభుత్వ వసతిగృహాల్లో సన్నబియ్యంతో అన్నం పెడుతోందన్నారు. సిద్దిపేట నియోజకవర్గంలో మంత్రి హరీశ్‌రావు కృషితో ప్రభుత్వ విద్యావ్యవస్థ బలోపేతం అవుతోందన్నారు. కార్యక్రమంలో తెరాసవి నేతలు రామ్మోహన్, భిక్షపతినాయక్, నాగరాజు, రమేశ్, బాలు, వంశీ తదితరులున్నారు.



సిద్దిపేటలో తెరాసవి ఆధ్వర్యంలో కేసీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

ఆరడుగుల కొండచిలువ హతం

వర్గల్, న్యూస్‌టుడే: రైతుపై దాడి చేయబోయిన కొండచిలువ హతమైంది. ఈ సంఘటన వర్గల్ మండలంలోని వేలూరులో బుధవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన ఓ రైతు తన వరి పొలంలో ఒడ్డుపై నడుస్తున్న సమయంలో పెద్ద కొండచిలువ అతన్ని కాలు పట్టుకునేందుకు యత్నించింది. వెంటనే తప్పించుకున్న రైతు అప్రమత్తమై దాన్ని కర్రతో బాది చంపేశాడు. అనంతరం పరిశీలించి చూడగా ఆరు అడుగులకు పైగా పొడవు ఉంది. దీన్ని రైతు పొలం నుంచి గ్రామం సమీపంలోకి తీసుకురాగా చూసేందుకు స్థానికులు ఎగబడ్డారు.



రైతు చంపివేసిన కొండచిలువ